ఆత్మకథ



చార్లీ చాప్లిన్

అభ్యుదయ

సచిత్ర సాహిత్య మాసపత్రిక

సంపుటి 2	1948 మార్చి	సంచిక 4

సంపాదకులు:

కొమర్రాజు వినాయకరావు

ప్రయాగ కోదండరామశాస్త్రి

★

గౌరవ సంపాదకులు

మల్లంపల్లి సోమశేఖరశర్మ — పి. వి. రాజమన్నారు

దేవులపల్లి కృష్ణశాస్త్రి — తుమ్మల వెంకటరామయ్య

కొడవటిగంటి కుటుంబరావు

వెల ఆరణాలు

అభ్యుదయ ఆంధ్ర అభ్యుదయ రచయితల మాస పత్రిక

ఇందులో

Editor, Printer & Publisher K. V. [illegible]ka Rao
Secretary Andhra Progressive Writers' Association Governorpet
Printed at Abh[illegible] Press, Bezwada

సంపాదకీయం

వ్యావహారిక భాష

ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషా ఉద్యమం నలభై యేళ్లకు పైగా సాగుతూవచ్చింది. పండిత భిషక్కుల గోసాయి చిట్కా-గండాలన్నీ గడచి, పెరిగి, పెద్దదై కొత్తకొత్త పూవులనుదొడిగి ఆంధ్రులనందరినీ ఆకర్షించింది. కవులకు, కథకులకు, నాటకకారులకు నవలా రచయితలకు, అంగీకారమైంది. పత్రికా సంపాదకులకూ విలేఖరులకు ఆదరణీయమైనది. ఏవో ఛాందససాంప్రదాయికాలు ఒకటి రెండుతప్ప తెలుగు పత్రికలన్నీ వార్తలనూ, వ్యాసాలనూ సంపాదకీయాలనూ వ్యావహారికభాషలోనే వ్రాస్తున్నాయి. నేటి సాహిత్యమంతా వ్యావహారికభాషలోనే వస్తున్నది. గద్యంలోగాని పద్యంలోగాని ఉత్తమ రచనలన్నీ వ్యావహారికంలోనే వెలసినవి. ప్రజలు నిత్యమూ వాడుకునే జీవద్భాష వ్యావహారిక భాష గ్రంథస్తమౌతూంది.

అధికారుల బధిరత్వము

కాని మద్రాసుప్రభుత్వమూ, ఆంధ్రవిశ్వవిద్యాలయమూ వ్యావహారిక భాషాసిద్ధాంతాన్ని ఇంకా అంగీకరించలేదు. వ్యావహారిక భాషలో వ్రాయబడ్డ గ్రంథాలను విద్యార్థులకొరకు వాచకాలుగా, పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించడంలేదు. శతాబ్దాలనాడు సంస్కృతపు వరవడిలో చెక్కిన తెలుగు వ్యాకరణమూ, ఆ వ్యాకరణపు గాటిలో నడిచే 'కృతక గ్రాంథిక' భాషలోనే విద్యార్థులువ్రాసి పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలి.

నలభైయేళ్ల వ్యావహారిక భాషాఉద్యమాన్నీ, అదిపొందిన ప్రజాదరణనూ, ప్రభుత్వమూ, ఆంధ్ర విశ్వవిద్యాలయమూ పెడచెవిని బెట్టటం శోచనీయము.

ఆంధ్ర జాతీయోద్యమాన్ని తృణీకరిస్తున్నారు

భారతదేశంలో బ్రిటిషు సామ్రాజ్యప్రభుత్వం నిరంకుశపరిపాలననూ, దోపిడీని నిరాటంకంగా సాగించడానికి ప్రజల కన్నుగప్పింది. వివిధభాషలు మాట్లాడే ప్రజలను కలిపి రాష్ట్రాలేర్పరచింది. బానిస విద్యావిధానాన్ని నెలకొల్పింది. వివిధశాస్త్రాలనూ, ఇంగ్లీషులో నేర్వాలని శాసించింది. మాతృభాషలు ప్రధానములుకావు. పరనీయమని నిర్ణయించిన మాతృభాషా గ్రంథాలుకూడా, బూజుపట్టిన కృత్రిమ భాషలో వ్రాసినవి. పాఠశాలల్లో విద్యార్థులు నేర్వవలసిన 'మాతృభాషకూ' నేడు ప్రజలు మాట్లాడే జీవద్భాషయైన వ్యావహారిక భాషకూ ఏనాడో తరాలు తెగిపోయినవి.

ఈ విద్యావిధానం వల్ల, నేటికి మనప్రజల్లో నూటికి తొంభై మందికి చదువురాదు. మనప్రజలను ఆర్థికంగాదోచుకుని, రాజకీయంగా అణచివేసి, సాంఘికంగా మూఢవిశ్వాసాలకు దాసులనుచేసి, చిరకాల బానిసత్వంలో మునిగి ఉండేలా చేసింది, బ్రిటిషు ప్రభుత్వపు యీ విద్యా విధానమే!

వాఙ్మయరంగంలో జాతీయోద్యమం

విద్యా విహీనులుగా, మూఢవిశ్వాసపరులుగా, అర్థదరిద్రులుగా, రాజకీయ బానిసలుగా ఉన్న ఆంధ్రులను చైతన్యవంతులను చేసిన భారత స్వాతంత్ర్య పోరాటమూ ఆంధ్రరాష్ట్ర ఉద్యమమూ - ఈ ఉద్యమాలకొక తరం ముందే ఆంధ్రజాతీయ వికాసానికి మూలపురుషుడు కందుకూరి వీరేశలింగంపంతులు ఆంధ్రులలో యీ చైతన్య ప్రబోధం చేశాడు. సమాజాన్ని సర్వతో ముఖంగా సంస్కరించడానికి, జ్ఞానవంతం చేయడానికి భాషను ఆయుధంగా ఉపయోగించాడు. గ్రాంథికనియమాలను ఉల్లంఘించలేకపోయినా తేలికయయిన తెలుగుశైలిని తన రచనలలో వ్రాశాడు. తెలుగు వాఙ్మయరంగంలో పజాతంత్ర ఉద్యమం ప్రారంభమైంది. తరువాత శ్రీగురజాడ అప్పా

రావుగారు వివిధ విజ్ఞాన విషయాలనూ, సాహిత్యరూపాలనూ, స్పష్టంగానూ సుబోధకంగానూ, రసవంతంగాను వ్యావహారిక భాషలో వ్రాయవచ్చునని తన రచనలద్వారా ఆచరణలో రుజువుచేశాడు. ఈయనకు సమ కాలీనుడైన శ్రీ గిడుగు రామమూర్తిగారు, వ్యావహారిక భాషకు సిద్ధాంతకారుడై ప్రవర్తకుడై, గ్రాంథిక వాదులతో యుద్ధాలు నడిపి ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషకు జయస్తంభాన్ని ప్రతిష్ఠించాడు. ఆంధ్రప్రజల జీవితాలకూ, ఆశయాలకూ, వాటిని చిత్రించవలసిన ఆంధ్రభాషా స్వరూపానికి ఐక్యతా, పొందికా, ఏర్పడ్డవి. ఆంధ్ర వాఙ్మయం ప్రజాతంత్ర మార్గంలో పెద్ద ముందడుగు వేసింగి ఆంధ్రుల జాతీయ ప్రబోధం వ్యావహారిక భాషలో నేజరిగి ఆంధ్రుల నూతన వికాసానికి సర్వతోముఖంగా తోడ్పడ్డది. వ్యావహారికభాషా వాఙ్మయంలో ఆధునిక ఆంధ్రజీవితం ప్రతిబింబిస్తూఉంది విద్యార్థి సంస్థలూ, సాహిత్య సంస్థలూ ఇతర ప్రజాసంస్థలూ వ్యావహారికాన్ని విశ్వవిద్యాలయం గుర్తించవలెనని కోరుతున్నాయి.

అధికారుల నిరంకుశత్వం

ఇలాంటి వ్యావహారికభాష ఇంతకాలంనుంచీ ఆంధ్ర విశ్వవిద్యాలయ సంస్థల్లో బోధనకూ, అభ్యాసనకూ, పరీక్షలకూ, ఉపయోగింపబడకపోవడం, ఆంధ్రజాతీయ వికాస్త మూలపురుషుల సత్సంప్రదాయాలను, ఆంధ్రుల జాతీయవాంఛనూ తృణీకరించడంతప్ప వేరుగాదు.

అదీకాక స్వతంత్రంవచ్చిందని, స్వతంత్రాధికారంతో కాంగ్రెసు మంత్రులూ, విశ్వవిద్యాలయాలూ నడుస్తున్నాయని చెప్పబడుతూంది. అలాంటప్పుడు నేడుగూడా, ఆంధ్రుల జాతీయ, స్వతంత్ర వాంఛలలో ఒకటైన వ్యావహారిక భాషను గుర్తించకపోవటం, చదువుకునే విద్యార్థులకూ, వారివలన ఉన్నతవిజ్ఞానాన్ని పొందవలసిన ప్రజలకూ మధ్య అంతరాన్ని స్థిరపరచడమే అవుతుంది. బ్రిటిషు బానిస విద్యా విధానాన్ని కొనసాగించటమే అవుతుంది.

నేడు విశాలాంధ్ర నిర్మాణం ఆంధ్రుల జాతీయవాంఛ. కోస్తా జిల్లాలూ, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలలో మాట్లాడుకునే ఆంధ్రభాషలో ప్రాంతీయ భేదాలను తొలగించి, అందరికీ సర్వసామాన్యంగా అర్థమై, రచనలలో ఉపయోగింపబడేటట్లు భాషను అభివృద్ధి చేయటంవల్ల, వివిధప్రాంతాల ఆంధ్రులు ఎక్కువసన్నిహితులై విశాలాంధ్ర నిర్మాణానికి జరిగే పోరాటానికి ఎక్కువబలం చేకూరుతుంది.

నేటి ప్రధాన సమస్యలు

కాబట్టి విద్యావిజ్ఞాన విషయాల్లో ఆంధ్రుల ముందున్న ముఖ్య సమస్యలు:

1. ఆంధ్రవిశ్వవిద్యాలయంలోనూ దాని కనుబంధించినసంస్థలన్నిటిలోనూ బోధన, అభ్యసన, పరీక్షా కార్యక్రమమంతా ముక్కోటి ఆంధ్రుల సజీవ మాతృభాషయైన వ్యావహారిక భాషలోనే నడపబడాలి.

2. మృతభాషయైన సంస్కృతమార్గంలో శతాబ్దాలనాడెప్పుడో నిర్మించిన తెలుగువ్యాకరణాన్ని విసర్జించి, ఈనాటి విశాలాంధ్రదేశంలో వాడబడే వ్యావహారికాంధ్రభాషకు నూతనంగా వ్యాకరణాన్ని నిర్మించాలి

3 వ్యావహారికాంధ్రానికి సమగ్రమైన నిఘంటువు రచించాలి.

మార్చి 13వ తేదీన ఆంధ్రవిశ్వవిద్యాలయం సెనేటు సమావేశం కాబోతున్నది. ఆసమావేశం, సనాతన ఛాందసులు, వ్యావహారిక మంతేలక్షణ విరుద్ధమనీ, గ్రామ్యమనీ అపభ్రంశమనీ, వాదించే కుంటివాదనలను తోసిపుచ్చి, పైకార్యక్రమం నిర్వహించడానికి తీర్మానించాలి.

ఇందుకొరకు రచయితల సంఘాలూ, సాహిత్యపరులు, విద్యార్థి సంఘాలూ యితర ప్రజాసంఘాలూ ఆందోళన చేయాలని, అభ్యుదయ రచయితల సంఘం కోరుతున్నది.

సెనేట్‌కు తీర్మానం

శ్రీ పి. వి. సుబ్బారావు బి. ఎ., బి. యల్. ఆంధ్రవిశ్వ విద్యాలయ సెనేటు సభ్యులు, ఈక్రింది తీర్మానం, రాబోయే సెనేటు సమావేశంకొరకు పంపారు:

"ఆంధ్ర విశ్వవిద్యాలయ తరగతులైన ఇంటర్ మిడియెట్, బి. ఏ., బి. ఏ ఆనర్సుతరగతులకు వ్యావహారికాంధ్ర భాషలో వ్రాయబడిన గ్రంథాలను, పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించాలని, తెలుగు బోర్డు ఆఫ్ స్టడీస్‌వారికి, ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనేటుయొక్క యీ సమావేశం గట్టిగా సిఫారసు చేస్తున్నది.

"పై తీర్మానం, ఆత్మ బోధకమూ సంపూర్ణమూ కాదు, సరిగా అర్థంచేసుకోవడానికి వీలుండక పోవచ్చును కాబట్టి బోర్డు ఆఫ్ స్టడీస్ వారికి యీ తీర్మానం సూచించే కార్యక్రమం చాల ముఖ్యమైనదనీ, చారిత్రకంగా అవసరమైనదనీ ఎప్పుడో అమలుజరిపి యుండవలసినదని నచ్చచెప్పుటకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి ముగ్గురు సభ్యులతో గూడిన ఒక ఉపసంఘాన్ని నియమించడం సమంజసమని ఈసమావేశం భావిస్తున్నది.

"పైన చెప్పబడిన ఉపసంఘంలో ఈ క్రింద పేర్కొనబడిన ముగ్గురు పెద్దలుండాలని సెనేటు అభ్యర్థిస్తూ వారిని నియమిస్తున్నది.

[సభ్యులు] 1. గౌ॥ బెజవాడ గోపాలరెడ్డి
(ఆర్థికశాఖామంత్రి మద్రాసు)
2. శ్రీ విశ్వనాథ సత్యనారాయణ
3. శ్రీ నార్ల వెంకటేశ్వరరావు

ఈ తీర్మానాన్ని సెనేటు సభ్యులందరూ బలపరచి, ఇది వెంటనే అమలులోకి వచ్చేటట్లు చూడాలని కోరుతున్నాం

'నవసందేశం'

రచన
శ్రీ రామ కవచం

చరిత్ర మరచిన
దరిద్రులారా!
పోదాం ముందుకు
కదలండి!!
నవ ప్రపంచపు
ద్వారాలు తెరచుకోవాలంటే
నాందీగీతా
న్నాలాపిస్తూ
చరిత్ర మరచిన
దరిద్రులారా!
పోదాం ముందుకు
కదలండి॥
చీకటి గర్భం
చీల్చుకు నేడు
ప్రకృతి శక్తి
ప్రభవిస్తోంది
జలధులు పొంగి
వేలలు దాటే
ప్రజావాహినిలో
ఐక్యముకాగా
చరిత్ర మరచిన
దరిద్రులారా!
పోదాం ముందుకు
కదలండి॥

ప్రపంచ ప్రజల
విపంచి మీటుచు
మరో ప్రపంచపు
పురోగాములై,
మరో ప్రపంచపు
మహాస్రష్టలై
సమ సమాజమున
కభిముఖమై
చరిత్ర మరచిన
దరిద్రులారా!!
పోదాం ముందుకు
కదలండి!!
దోపిడి దాస్యం
దౌర్జన్యాలు
క్రోధం ద్వేషం
కార్పణ్యాలు
ఆకలి చావులు
దుర్భిక్షాలు
కననీ వినని
మన లోకానికి
చరిత్ర మరచిన
దరిద్రులారా!!
పోదాం ముందుకు
కదలండి!!

తెలుగు సారస్వతంలో

★ ★ దేశభక్తి ★ ★

శ్రీ పి వి శివయ్య

I

దేశభక్తి ప్రబోధకమైన సారస్వతం వీరగాథలుగా, స్థల పురాణాలుగా, రాజకీయపోరాటవర్ణనగా ఉంటుంది. ప్రజల రాజకీయ చైతన్యాన్ని పెంపొందించి, దేశాన్ని, ప్రజాజీవితాన్ని సర్వాంగ శోభితంగా దిద్దడానికీ, దేశాన్ని శత్రుల బారినుంచి రక్షించుకోడానికి, లేక బానిస దేశాలు స్వతంత్రం సంపాదించుకోడానికి కృషి చేసేటట్లు, పోరాడేటట్లు, ఉత్సాహపరచడం దేశభక్తి సారస్వతానికి ప్రధానోద్దేశ్యం

ఒకే ఆర్థిక విధానం, ఒకే భాష, ఒకే విజ్ఞానం, ఆగమ్యకాకులు దేశ ద్రిమ్మరులు కాక చారిత్రకంగా స్థిర నివాసులైన ప్రజలూ, గలిగి ఖచ్చితమైన ఎల్లలుగల భూభాగం "దేశమ"నబడుతుంది. ఇలాంటి దేశాన్ని అందులో నివసించే ప్రజలు ప్రేమించడం దేశభక్తి అంటారు "జననీజన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" (మాతృదేశం స్వర్గంకన్నా గొప్పది.)

దేశభక్తి ప్రధానంగా రాజకీయమైనది. బానిసదేశాల్లో దేశభక్తికి రాజకీయ స్వభావం మరీ ప్రస్ఫుటంగా ఉంటుంది. ప్రజలకు సంబంధించిన ప్రతి సమస్యా-వాక్సభా పత్రికాస్వాతంత్ర్యాలు, తిండీ గుడ్డ ఇల్లు, భూమీ, కర్మాగారాలూ, విద్యావిజ్ఞానాలూ అన్నీ నిరంకుశపాలకుల చేతుల్లో ఉంటాయి. ఇవి కోల్పోయిన ప్రతి వ్యక్తీ వీటిని సంపాదించుకోడంలో ఒకడికొకడుతోడై సమిష్టిఉద్యమం బయలుదేరుతుంది. "ఈదేశంనాది" అనే నినాదం ఈ ఉద్యమంయొక్క

ప్రధాన చైతన్యాన్ని ప్రతిబింబిస్తుంది.

"ఈ దేశంనాది" అనే కేంద్రదనినాదంతో దేశంయొక్క రాజకీయ వ్యక్తిత్వంకొరకు ప్రజలు చైతన్యంతో పోరాడడం సర్వకాల సర్వావస్థల్లోనూ పోరాడడం జరగదు. అలాంటి పోరాటం ఒకదేశచరిత్ర యొక్క ప్రత్యేక పరిస్థితుల్లోనే సంభవిస్తుంది.

తెనుగు దేశంలో బౌద్ధయుగం నాటినుంచీ అనేక వైజ్ఞానిక ఉద్యమాలు, సంఘ సంస్కరణోద్యమాలూ, ఉధృతంగా చెలరేగిన రోజులున్నవి తెనుగు దేశాన్ని దురాక్రమించడానికి అనేక దండయాత్రలు జరిగినవి. ఆ ఉద్యమాల్లోనూ, దురాక్రమణ నెదిరిస్తూ జరిపిన యుద్ధాల్లోనూ, తెనుగు ప్రజలుపాల్గొన్నారు. కాని ఆఉద్యమాలకు రాజకీయ స్వభావం ప్రముఖంగాలేదు. ఆ యుద్ధాల్లో తెనుగు ప్రజలంతా ఏకమై పోరాడింది లేదు. కారణం ఆనాటికి తెనుగుదేశమన్నీ, తెనుగుప్రజలని సమిష్టిభావం స్థిరంగా ఏర్పడలేదు. అప్పటికి తెనుగుదేశం నాడులు, నాడులుగానే ఉన్నది. జీవితవిధానం జమీందారీ విధానం, రాజకీయ విధానం, దీనిమీద ఆధారపడిన చిల్లర రాజరికాలు, ఈ రాజుల మధ్య స్వార్థపరమైన అంతర్యుద్ధాలు...ప్రజలజీవితానికి ప్రాధాన్యత లేదు ప్రజలకు వ్యక్తిత్వం లేదు. దేశపరిపాలనలో భాగస్వాములుగారు ప్రజలుభూమినిదున్నే బానిసలు.

కాబట్టి మధ్యయుగపు తెలుగు సారస్వతంలో, పురాణాలు గాని ప్రబంధాలు గాని, లేక ప్రజాసామాన్యపు జానపదాల్లో గాని, మహాపురుషుల జీవితాలు, వీర గాథలు, స్థలపురాణాలూ ఉన్నవి. కాని యీ సారస్వతం ప్రజల రాజకీయ చైతన్యాన్ని ప్రతిబింబించదు. యుద్ధాల్లోనూ, వైజ్ఞానిక, సంస్కరణోద్యమాల్లోనూ ప్రజలు ఉజ్వలమైనపాత్రను నిర్వహించినా వారిదిమాత్రం నాయకత్వంకాదు. ఆ సారస్వతమంతా ప్రజల కతీతులైన నాయకులను గురించీ, వీరులను గురించీ కీర్తిస్తుంది. ఆ సార

స్వతంలో దేశభక్తియన్నది సమిష్టి రాజకీయ చైతన్యంగా అగుపిం చదు.

కాకతీయ యుగ ప్రత్యేకత

ఈ విధంగా చూస్తే తెనుగు మధ్యయుగ చరిత్రలో కాకతీయుల కాలానికి ప్రత్యేక లక్షణాలున్నవి.

"నా విష్ణుః పృథివీపతిః" అని రాజును దేవుణ్ణిచేసి నిరంకుశరాజరి కాన్ని పోషించే వైదిక మతానికి, బ్రాహ్మణ మతానికి, వర్ణాశ్రమ ధర్మాల కాఠిన్యతకూ వ్యతిరేకంగా శైవమతం వచ్చింది. ప్రజలకు ప్రాధాన్యత హెచ్చింది. ప్రజలు తక్కువ కులస్తులనబడేవాళ్లు సార స్వతంలో నాయకులైనారు. ప్రజ లకు మతప్రబోధం సంస్కృతంలో గాకుండా ప్రజల నిత్యవ్యవహా రంలో ఉండేవాడుక తెనుగులో, జాను తెనుగులో జరిగింది. సంస్కృ తంతో పాటు, తెనుగు కూడా, పండితస్వీకార యోగ్యమై, ఉభయ భాషా కోవిదులూ, ఉభయ కవి మిత్రులూ వెలశారు.

సమాజవ్యవస్థ బ్రాహ్మణే తరుల పైఅంతస్తు నంగీకరించింది. రాజకీయ పరిపాలనావ్యవస్థ, ప్రజా సామాన్యాన్ని ఒకకొంత గుర్తిం చక తప్పిందిగాదు.

శైవమతం మధ్యయుగ చరి త్రలో గొప్ప ప్రజా ఉద్యమం. ప్రజాతంత్ర ఉద్యమం. కాకతీయ రాజులు శైవమతాధారంతో ప్రజ లను కూడగట్టుకుని, యుద్ధాలు చేసి ఎక్కువమంది తెలుగులను, ఎక్కువభాగం తెలుగు భూమినీ తమ పాలనక్రిందికి తెచ్చారు. తెలుగు దేశానికి త్రిలింగ దేశమని దేశపు ఎల్లలను సూచించే పేరు వచ్చింది. ఆంధ్రభాష మాట్లాడే వారి నందరినీ సమిష్టిగా సంబో ధించడం ప్రారంభమైంది.

"ఆంధ్రావళి మోదముం బొరయు" భారతం ఆంధ్రీకరిస్తా నన్నాడు తిక్కనమహాకవి.

కాకతీయుల కాలానికి దేశాభి మానం, జాత్యభిమానం ఎక్కువ మంది తెనుగుప్రజలకు సమిష్టి చైతన్యమయినది.

కాని కాకతీయ సామ్రాజ్యం అంతఃపుర కలహాల వల్లనూ, మహమ్మదీయ దండయాత్రల

వల్లను శిథిలమైనది. ప్రజలపైన మరల బ్రాహ్మణ మతదండయాత్ర ప్రారంభమైనది.

పురాణ కవులలో చివరివాడు ప్రబంధ కవులకు మొదటివాడు అయిన శ్రీనాథుడు మధ్యయుగ సారస్వత చరిత్రలో కాకతీయ కాలపు స్వర్ణస్మృతులను కలిగించే కవినాథుడు.

ఈయన శైవపక్షపాతి. శైవ వైష్ణవ మతభేదమెంచినవాడుగాడు. నిరంకుశవర్ణ వ్యవస్థకు వ్యతిరేకి.

"కుల్లాయుంచితి కోకసుట్టితి మహా
కూర్పాసమున్ తొడ్గితిన్
వెల్లుల్లిన్ తిలపిష్టమున్ మెసవితిన్
విశ్వస్త వడ్డింపగా
చల్లా యంబలి ద్రావితిన్ రుచులుదో
సంబంచుబోనాడితిన్
......దయలేదా!
నేను శ్రీనాథుడన్"

అన్నాడు. ఆరోజుల్లో బ్రాహ్మణులు నాటకాల్లో వేషాలేయగూడదు. శ్రీనాథుడు వీధినాటకాలు రాయడమేగాదు. వాటిల్లో ఆడవేషం వేసేవాడు.

ఒక్క నైషధభాషాంతరీకరణం తప్ప మిగిలిన కావ్యాలన్నీ శైవ గ్రంథాలే. సామాన్య ప్రజలనుంచి వచ్చినవాళ్లే అతని కావ్యాలకు నాయికా నాయకులు.

పగులగొట్టించి తుద్భట వివాదప్రౌఢి
గౌడ డిండిమ భట్టు కంచుఢక్క

అన్నాడు.

శ్రీనాథుడిదెబ్బకు సంస్కృతం రాజాస్థానాలనుంచిగూడా పారిపోయింది.

కొండవీటి పెదకోమటి వేమారెడ్డి ఆస్థాన కవిగాఉండి, రాజాస్థానాలన్నిట సన్మానాలు పొంది, భోగిగా బ్రతికి చివరకు, రెడ్డిరాజుల ప్రభతోపాటు యీాయన ప్రభగూడ ఒరిగిపోయింది. ఆర్థిక బాధలతో అప్పులపాలై శ్రీనాథ మహాకవి

"సార్వభౌముని భుజాస్కంధ
మెక్కనుగదా
నగరి వాకిటనుండు నల్లగుండు"

శిక్షలుపడి, కష్టాలపాలై పల్నాడు చేరాడు. చంద్రవంకతీరంలో చనిపోయే వరకు వృద్ధాప్యంగడిపాడు. పలనాటి వీర వైష్ణవుల అమరగాథ "పల్నాటి వీరచరిత్ర" ద్విపద కావ్యంరాశాడు. పండిత కవులు

దేశి కవితలు వ్రాయగూడదట. శ్రీనాథుడిక్కడా తిరుగుబాటే.

మధ్యయుగ సారస్వతంలో శ్రీనాథుడొక్కడే రాజకీయ నిర్వచనంతో దేశస్వాతంత్ర్యాన్ని ఆశయంగా బోధించాడు.

ఉజ్జ్వలమైన కాకతీయ శైవ యుగ చరిత్రకు నిజమైనవారసుడుగా కొండవీటి రాజ్య విద్యామంత్రిగా, వివిధాస్థానాల పరిచయ అనుభవాలతో, స్వకీయమైన శైవ మతం కుదిర్చిన ప్రజాతంత్ర విశ్వాసంతో, పాటక జనసామాన్యంపడే కష్టనిష్టురాలస్వానుభవంతో-మధ్యయుగపు రచయిత శ్రీనాథుడు పల్నాటి వీరచరిత్రలో భట్టుమూర్తి రాయబారఘట్టంలో ఏమని ఉద్బోధించాడో చూడండి. ప్రజాభిప్రాయాన్ని ఎలా వెలిబుచ్చాడో చూడండి.

"పోరుమంచిదిగాదు భూమినెక్కడను
పాడౌనుదేశంబు పగమించెనేని,
ప్రజలెల్లనశియించి పారిపోవుదురు
బండారమునకును వైకంబులేదు,
రాణువయందుచే రహిచెడియుండు.
చేజీతగాండ్రెల్ల చెలగి కోపించి,
యీ గల జీతంబు లిమ్మందురపుడు
పతిబంటుమేరలు పరిహరమ్మాను,
పంపినపని చేయ ప్రాలుమాలుదురు.
తెలిసిన శాత్రవుల్ ధీరతతోడ
భూమినిగొనుటకు బుద్ధిపెట్టుదురు,
పగవారివార్తలు పరికింపలేరు.
మేకొని మీలోనమీరు పోరాడ,
చూచెడివారికి చులకనయ్యాను,
కోరిశాత్రవులు మీగుట్టెరుంగుదురు.
పలుకులు మిముజేరి పగచావనీక
చెప్పుచునుందురు చెనటివాక్యముల,
ఐకమత్యము చెడు నజ్ఞానితోడ.
చెడునుబలంబును, చెడునుభాగ్యంబు,
చెడునుయశంబును చెడును శౌర్యంబు
చెడును రాజ్యంబులు చెడ్డపిమ్మటను,
దేశంబె పరనృపాధీనమౌనమ్మ
పారతంత్ర్యమ్ము మీపై బడగలదు.
పరతంత్రజనముల పాలికష్టములు
చెప్పగనలవియే శివునకునైన
పంజరమ్మననున్న పక్షులభాతి
బోనులోనుంచిన పులులవిధమ్ము
స్వాతంత్ర్యరహితత బడి యుండవలయు
పరికింపగా మనోవాక్కాయములను
నైజదుర్గ్రాహ్యమానసమది తప్ప
వాక్కాయములు రెంటు బంధింపబడును
మనసులోబుట్టిన మంచితలంపు
లాచరణమునందు నలవిగాకున్న
జన్మఫలమ్మేమి చచ్చుటేమేలు
....
పార్థివా, యిటువంటి పారతంత్ర్యంబు
కటకటా పగవారికైన నను వలదు

(పల్నాటి వీరచరిత్రము—ఉమాకాన్తకృత సంపాదితము)

దాదాపు 500 ఏండ్లనాటి చరిత్రలో మృతజీవుడైన శ్రీనాథ మహాకవి ఈనాటి పాకిస్తాన్ యిండియన్ యూనియన్ ప్రభుత్వాలకు హితవు బోధిస్తున్నట్లున్నది. ఆశ్చర్యము. పారతంత్ర్యమువలన రాగల నైచ్యజీవనాన్ని స్పష్టీకరించి, స్వతంత్రంకొరకు, దేశంకొరకు, న్యాయంకొరకుపోరాడమని ప్రజలనుద్బోధిస్తున్నాడు. శ్రీనాథుడు తెనుగు సారస్వతంలో తెనుగు ప్రజాహృదయంలో చిరస్థాయి. కాని శ్రీ నాథుడు బోధించిన స్వతంత్రం, ప్రజలహక్కులు శాశ్వత సత్యాలైనా, అవి రాచరిక వ్యవస్థ పరిధులను దాటలేదు. రాజులివ్వన్నీ ప్రజలకుండేట్లు చేయాలంటాడు. మధ్యయుగపు జమీందారీవిధాన వ్యవస్థలో, క్రొత్తజీవిత విధానపద్ధతులు క్రొత్త-శక్తులు అభివృద్ధిగానిదే దాని కనుగుణ్యమైన, స్వతంత్రం, ప్రజలే తమనిజమైన ప్రతినిధులద్వారా పరిపాలించుకునే ప్రజాతంత్ర పరిపాలనా పద్ధతి, యిలాంటి ఆశయంతో "ఈదేశం నాది" అనే చైతన్యంగలిగినదేశభక్తి ఏర్పడజాలదు. ఆనాటికి ప్రజలకు మంచిపరిపాలనరావాలి. అయితే అలా రాజులేపాలించాలి. ప్రజలు దేశంకోసంపోరాడుతారు. అయితే ఎవరు గెలిచినా జమీందారీ ప్రతినిధులైన రాజులది.

"Mankind sets itself only such tasks for which material conditions have already matured or are in the process of maturing"

ఏ ఆశయాలను సాధించడానికి భౌతిక పరిస్థితులదివరకే పరిపక్వమైయున్నవో, లేదా పరిపక్వమయ్యే క్రమంలోఉన్నవో, ఆ ఆశయాలను సాధించడానికే మానవ సమాజం పూనుకుంటుంది." అని మార్క్సు అన్నాడు.

జ్వాలాముఖి

శ్రీ వాసిరెడ్డి భాస్కరరావు

అది పవిత్ర పుణ్యభూమి
ఆంధ్రజాతి జన్మభూమి
రుద్రమా ప్రతాపరుద్ర
పదముద్రిత భద్రభూమి
అదిపవిత్ర పుణ్యభూమి
ఆంధ్రజాతి జన్మభూమి !

క్షుద్ర నిజాంనరకాసుర
పరిపాలనలో నేడది
రుద్రభూమి,
భస్మ రాశి.

అట పిశాచహుంకారం
మదమత్తాహంకారం
వినిపించును
కనిపించును
గృహదహనం
శిశుహననం
సుజనశిక్ష
కుజనరక్ష

నర భక్షణసాగుతోంది
సాగుతోంది ప్రళయకాల
మృత్యుభయంకర నృత్యం!
ఆ కాలిన గోడలలో
ఈ కూలిన మేడలలో
అణగి మణగి నివురుగప్పి
అట్టడుగున పడిపోయిన
నిప్పుకణిక ఒకటొకటే
కణకణమని రాజుతోంది
పొగల సెగల నెగజిమ్ముచు
భుగభుగమని రాజుతోంది
రాజుతోంది నైజాంనాజీ !
రాజుతోంది
ఆంధ్రజాతి హృదయంలో
ఆరని విద్వేషవహ్ని
నీ తొత్తులు నీ బలగం
రగిలించిన అగ్నికణం
ఘనదవాగ్ని కీలికయై
బడబాగ్ని జ్వాలికయై
తన నాలిక చాస్తున్నది
వస్తున్నది భస్మాసుర
రూపంతో నీపైకే
పై పైకే వస్తున్నది
పగబట్టిన త్రాచువోలె
బుసగొట్టుచు పడగవిప్పి
కసిదీరగ కాటువేయ వస్తున్నది
వస్తున్నది

మూసీనదీ తీరంపై
రెసిడెన్సీ బిల్డింగులు
షామంజిల్ కింగ్‌కోటీ
ఆఘాటకి కుంగిపోవు
వస్తున్నది తెలంగాణా
నలువైపులచుట్టుముట్టి
నిజాంధ్వజం
లొంగదీయ కుంగదీయ
ప్రజాసేన
పొరలి తరలి వస్తున్నది
వస్తున్నది.

నల్లగొండ జిల్లా నీ
గుండెలపై కుంపటియై
మండుతోంది
చెండుతోంది
గూండాలను సైనికులను
చెండుతోంది
ప్రజాశక్తివిజృంభించి
భుజా బలంచూపుతోంది
బూజు బట్టిపోయినట్టి
యువరాజుల రారాజుల
మసిజేయగ నుసిజేయగ
జ్వాలా ముఖి కదలింది
ఝంఝూనిలం సాగింది
తప్పుకోండి !
తప్పుకోండి !

నాజీలతో రాజీపడి
జ్వాలా ముఖి శిఖరంపై
చన్నీళ్లను చల్లబోవు
జడు లారా !
చలచల్లగ తప్పుకోండి !
తప్పుకోండి ! వస్తున్నది.
జ్వాలాముఖి వస్తున్నది.

సిపాయీల తుపాకులూ
పరంగీల ఫిరంగీలు
ఆఘాకకు తాళలేవు
ఆఘాటికి నిలవలేవు
తప్పుకోండి !
తప్పుకోండి !

మ్రోగించుచు రణదుందుభి
సాగించుచు జైత్రయాత్ర
వస్తున్నది
వస్తున్నది

తెలుగుతల్లి చెరబట్టిన
కీచకులను పీచమణచ
అదిగదిగో ! కదలికదలి
వస్తున్నది జ్వాలాముఖి
అరుణారుణ కాంతులతో
జయపతాక ఎగురుతోంది
తొలగండిక తొలగండీ !
ఆదారిన తొలగండీ !

జన్మహక్కు

శ్రీ 'మాన్సు'

★

మధ్యాహ్నపు ఎండనీ దక్కను పీఠభూమినీ చీల్చుకొని వడివడిగా అనేక వందల ప్రాణులను మోసుకొని బొంబాయి మెయిల్ విసురుగా పోతోంది. అమ్మ చీరచెంగు పట్టుకుంటేనే పాప తప్పిపోకుండా మళ్ళీ ఇల్లు చేరుకోగలిగినట్లు... ఆ రైలుపెట్టెల్లో దేంట్లోనో ఇరుక్కుంటేనే—కోటి ఆలోచిస్తూ నవ్వుకున్నాడు—బొంబాయి చేరుకోగలడు! చుట్టూ స్నేహితులు బాతాఖానీ వేశారు. దూరాన కనిపిస్తున్న చెట్లూ కొండలూ వెనక్కు పరుగెడుతున్నాయి. చిన్ననాడు పాఠంలో నేర్చుకున్నట్లు భూమి గుండ్రంగా ఉందని నిరూపించడం యెల్లా అని కోటి శ్రమ పడుతున్నాడు.

"చూశారా..." వెనకనుంచి ఎవరో ఎవరితోనో నవ్వుతూ హిందీలో చెపుతున్నాడు..."యీ రైలుబద్దీలకు రెండు వైపులా కంచె కట్టివేశారు. కారణం తెలుసా? దీనికి కుడివైపు భాగం నైజాం నవాబుది. ఎడమవైపు భాగం బ్రిటిష్ వాడిది. కాదుకాదు మరచాను మనదీనూ..."

కోటి తల వెనక్కు తిప్పకుండానే ఆలోచిస్తున్నాడు. "స్వాతంత్ర్యం తెచ్చిన వెన్నో బాధ్యతలు..."

"నైజాంలో నలుగురు స్త్రీల మానభంగం..." "నల్లగొండ తాలూకాలో కమ్యూనిస్టువీరుని బలి..." "పోలీసులు గ్రామాలు గ్రామాలనే దోచుకుంటున్నారు..."

వెనుకనుండి పేపరు టైటిల్సు చదువుతున్నాడు గోపాలరావు.

తనదేశం తిండి, గుడ్డ లేకుండ బాధపడుతోంది. ఇతరదేశాల్లో ప్రజలంతా ఈనాడు ఎలక్ట్రిక్ రైళ్ళలో ప్రయాణం చేస్తుంటే...తన దేశస్థులు ఇంకా బొగ్గురైళ్ళలోనే ప్రయాణం చెయ్యాల్సి వచ్చింది మొన్న ప్రభుత్వం కొత్తగా నడుపదలచుకొన్న 'సిల్వర్ యారో' గ్రామాల్లోంచి పోతుంటే...పాపంబీదప్రజలు...విరగబడి చూశారు...ఇంతకీ అదీ బొగ్గుబండే!

దూరాన యెవరో రైతు పొలంగట్టు మీద నిలబడి ఎండకి చెయ్యి అడ్డుపెట్టుకుని రైలునుచూసి గట్టిగా ఆవులించాడు. వెనకనుంచి గోపాలం పేపరు చదివి వినిపిస్తున్నాడు.

మొన్న ఒక రాజకీయ నాయకుడు మాట్లాడుతూ అన్నమాటలు జ్ఞాపకానికొచ్చాయి.

"స్వాతంత్ర్యం రావడమంటే ఈనాడు ప్రజలకష్టాలు పోగొట్టే ప్రభుత్వం రాలేదని మనకి తెలుసు. తెల్లనాయకత్వంపోయి నల్ల నాయకత్వం అధికారంలోకి వచ్చింది. కార్మికులు సమ్మెలు యెందుకుచేస్తారో

అర్థంచేసుకోలేని గుడ్డి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంఎలా అవుతుంది?....తను గద్దెమీద వుండగా ఎవరూ తనని ఏమీ చెయ్యలేరని అహంకారం. . ఈనాడు ప్రజలంటే ఎవరూ అనొచ్చు ప్రభుత్వం... కాని రేపు..."

"ఎన్. జి. ఓ. లపై ప్రభుత్వం పగ సాధించరాదు"

దూరాన యెవరో అంటున్నారు: "అసలు వీళ్ళని సమ్మె చెయ్యమన్నది ఎవరు...యీ వేళ పగ సాధించరాదని ప్రాధేయపడమన్నది ఎవరు ?"

కోటి రివ్వున వెనక్కు తిరిగాడు... "కడుపులో మండే ఆకలి వాళ్ళని సమ్మె చెయ్యమంది...ఇంట్లో మాడుతున్న పెళ్ళాం బిడ్డలు సమ్మె చెయ్యమన్నారు. మందు లేకుండా ఎన్నాళ్ళకూ నయంకాని కొడుకుల జబ్బులు గుమాస్తాలను సమ్మె చెయ్యమన్నాయి. యీనాడు మధ్యతరగతి కుటుంబాలు అన్నం తింటున్నాయి అనుకుంటున్నారేమిటి ? పొరపాటు...మర్యాదకు మీతో చెప్పటంలేదు కాని..."

వింటూ వింటూ బీడీ వెలిగించాడా వ్యక్తి.

"ఈనాడు తమ ప్రభుత్వం వచ్చింది కనక నోరువిడిచి అడిగారు. నేను వోటు వేస్తే అధికారంలోకి వచ్చిందిఈప్రభుత్వం. ఇంకా కుర్చీలు యెక్కకముందే స్టేట్‌మెంట్లిచ్చారు... నేను ఇదిచేస్తాను...అది చేస్తాను అంటూ......ఇప్పుడొక్కరూ మాట్లాడరేం ?"

"ఎందుకు? తను అవసరం తీరిపోయింది కనక..."

"అన్నం పెట్టమన్నాడు గుమాస్తా... సున్నం పెడతానంది ప్రభుత్వం... జీసస్ అన్నాడు వెర్రివాడు కనక... ఏ తండ్రి అయినా కొడుకు రొట్టె అడిగితే రాయి యిస్తాడా అని... తెలియదు జీసస్‌కి మన ప్రభుత్వం వుందని..."

తన పేపరు హడావుడినుంచి తేరుకుంటూ అడిగాడు గోపాలం: "దేని విషయం మాట్లాడుతున్నారు ? నైజాం గురించా ?..."

కోటి ఆలోచనలోపడ్డాడు... నైజాం విషయం తలుచుకుంటే గుండె దడదడ లాడుతోంది. ప్రజలను నిలువునా చిత్రవధచేస్తున్నారు.

సాయంకాలం సూర్యుడు క్రుంగి పోతున్నాడు. పొలాలన్నీ నిర్జనంగావున్నాయి రైలుఇంజను నిప్పురవ్వలు ఎగిరిస్తోంది.

"మీరు ఎంతవరకూ వెడతారు" వెనకనుంచి ఎవరో అడుగుతున్నారు.

"బొంబాయి"గోపాలం అంటున్నాడు.

కోటి అనుకున్నాడు— "నిజంగా ఈ రైలు నైజాంకూ, మద్రాసు ప్రభుత్వానికీ మధ్యగా రెండు ప్రభుత్వాలకీ గుణాల్లోను, చర్యల్లోను రాజీచేస్తూ ముందుకు బొంబాయి పోతోంది. వీటి అన్నిటికీ గమ్యస్థానం బొంబాయి కాబోసు..."

"విద్యార్థుల మహాసభ జరుగుతోంది. చాలామంది వెడుతున్నాం. కాశ్మీర్ నుంచి వస్తున్నారు. మద్రాసునుంచి వస్తున్నారు. మైసూరునుంచి. బెంగాల్ నుంచి. రాజపుటానానుంచి. ఇంకా... ఇంకా...... చాలామంది"

ఇంత క్రితం సంఘటన ఒకటి జ్ఞాపకానికొచ్చింది కోటికి మళ్ళీ. మహబాద్ స్టేషను నైజాం నవాబుది. విద్యార్థులంతా "నైజాం డౌన్ డౌన్" "...నైజాం నశించాలి" అని స్టేషను అదిరిపోయేలా అరగంటసేపు అరిచారు. "మఖ్దూం మొహియుద్దీన్ జిందాబాద్" అంటుంటే రైల్వే కార్మికులు తెల్లపోయి చూశారు. ఎవరు వీళ్ళు, ఇంత ధైర్యంగా నైజాం నడిబొడ్డుమీద నిప్పు పెడుతున్నారని. పోలీసువాడు తన్ని లాక్కుపోయాడు వాళ్ళని. అనేకవందల మంది నైజాం అభిమానులు ప్లాటుఫారం మీద చేరినా, ఏమీ చేయలేకపోయారు. రైలు కదులుతూంటే ముగ్గురు సి.ఐ.డీ. లను రైలులో ఎక్కించారు తర్వాత స్టేషన్‌లో ప్లాటుఫారంమీద పోలీసు ఆఫీసర్లు గస్తీ తిరగడం ప్రారంభించారు. తెలుసుకున్నారు విద్యార్థులు. ఒక్కడూ మాట్లాడలేదు. రైలు కదిలింది. మళ్ళీ "నైజాం నశించాలి" అని ఒక్కసారిగా నినాదాలు.

"విద్యార్థులు కోతులు." నవ్వుతూ హిందీలో అంటున్నాడు పెట్టిలో ఒకాయన తన భార్యతో.

"చదువుకునే రోజుల్లో మీరూ ఇలాగే ఉండేవారా...?"

"ఈ బడిపంతులు నయ్యాక ఇలా ముని లాగ తయారయాను కాని... నేను చదువుకొనే రోజుల్లోనా!..."

"ప్రస్తుతం బాధపడుతూన్న మనిషి—బుర్రని పది సంవత్సరాలు వెనక్కు లాగి తను మరొకరిమీద ఆధారపడి సుఖంగా బతికినరోజులు జ్ఞాపకం తెచ్చుకొని నోరు ఊటలు ఊరిస్తూ, కళ్ళల్లో జ్యోతులు మెరిపిస్తూ సంతోషంగా మీసాలమధ్య నుంచి చిరునవ్వు వదులుతాడు. ముందేదో నవమహోదయం రాబోతోందిఅంటే అతను నమ్మమన్నా నమ్మడు" అని నామనస్సు యోచిస్తోంది.

"రాత్రి భోజనం ఎక్కడ" అన్నాడు రామారావు చీకటికేసి చూస్తూ... సెక్రటరీ పక్క పెట్టెలోంచి మా పెట్టెలోకి వచ్చాడు.

కోటి పక్క పెట్టెలోకి తొంగి చూశాడు......విద్యార్థి జండా ఎలక్ట్రిక్ కాంతిలో రెపరెపలాడుతూ గర్వంగా మీకు స్వాతంత్ర్యాన్నీ, శాంతినీ, అభ్యుదయాన్నీ ఇచ్చితీరుతానని హామీయిస్తోంది!

"రాత్రి భోజనం యెక్కడ" మళ్ళీ అడిగాడు రామారావు సెక్రటరీని.

ఏదోఅన్నాడు సెక్రటరీ...కోటికి వినిపించలేదు, నాకూ వినిపించలేదు. రైలు ఆగిన ప్రతీ స్టేషన్‌లోనూ..."బొంబాయి మహాసభ జిందాబాద్" "షేక్ అబ్దుల్లా జిందాబాద్"

"షేక్ అబ్దుల్లా వస్తాడట వీళ్ళ మహాసభకు......తప్పకుండా వెళ్ళాల్సిందే సుమా..."

"విద్యార్థి ఫెడరేషన్ జిందాబాద్..." "నైజాం దురంతాలు నశించాలి" కోటి కూడా ఉత్సాహంతో స్లోగన్నిచ్చాడు.

రైలు కదిలింది. అందరి ముఖాలవైపు చూశాడు కోటి. నాగభూషణం రెండు చేతుల్లో తలపెట్టుకొని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఎవరో తనకు తెలీని మరో

విద్యార్థి పుస్తకం చదువుతున్నాడు. తీక్షణంగా...

"బొంబాయి వెళ్ళేది తెల్లారి ఎన్ని గంటలకి ?"

కొంతమంది విద్యార్థులు చుట్టూచేరి దేనివిషయమో సవ్వుకుంటున్నారు.

నావైపు చూశాడు కోటి...సిగరెట్టు పొగలో కళ్ళు చిట్లిస్తూ ఏమీ తోచక అతన్నే పరిశీలిస్తున్నాను.

రామకృష్ణ "రైల్వేగైడ్ నిన్ను ఎవరు తియ్యమన్నా"రని చంద్రంతో దెబ్బలాడుతున్నాడు.

నారాయణ "అబ్బబ్బ...సిగరెట్ పొగ..."అని సిగరెట్లుతాగే కులాన్నంతా దుయ్యబడుతున్నాడు.

"మనస్తత్వాలు" అనుకున్నాడు కోటి; చీకటిని చీల్చుకు దూరపు కొండలవైపు చూడడానికి ప్రయత్నిస్తూ...

"రాత్రి అన్నం తినకుండానే నిద్ర పోతావా..." అని అడిగాడు నన్ను కోటి కటకటల్లోపడిన బొగ్గు నలుముకుంటూ...

నిద్రలో ఏమన్నానో జ్ఞాపకంలేదు.

* * *

"పూనా వచ్చింది. ఇక్కడనుంచి ప్రకృతి అతి రమ్యంగా వుంటుంది... లేవండి..." కేకతో అదిరిపడ్డాను...... లేచాను...బెడ్డింగు చుట్టాను.

"రాత్రి అంతా మెళుకువగానే వున్నావా..." అడిగాను కోటిని...

"వచ్చేది పూనాస్టేషన్..."

"రాత్రి అంతా మెళుకువగానే వున్నావా అని అడుగుతున్నాను..."

"ఆ...వచ్చేది పూనాస్టేషన్...... అక్కడనుంచి సీనరీ చాలా బాగుంటుంది...రైలు గుహల్లోంచి పోతుంది. పెద్దపెద్ద ఎత్తైన పర్వతాలమీదనుంచి పోతూంటే రెండు నిలువుల అడవులలోయలు కనిపిస్తాయి..."

"రైలుని బొగ్గు లాగలేదు...ఎలక్ట్రిసిటీతోనే నడుస్తుంది..."వెనకనుంచిఎవరో అంటున్నారు.

"అంతా దాదర్ స్టేషన్లో దిగాలి... స్టేషన్ రాగానే బెడ్డింగులు ఎవరివివారు చేత్తో పట్టుకోవాలి..." అంటూ ఎవరో గట్టిగా అరుస్తున్నారు. అంతా బడలికతో ఒళ్ళు విరుచుకుంటున్నారు.

"చాలా బడలికగా వుంది...ఇంటికి వెళ్ళగానే స్నానం చెయ్యాలి" అన్నాడు కోటి నవ్వుతూ.

దాదర్ స్టేషన్లో రైలు ఆగింది. ఎన్నో వందలమంది విద్యార్థులు రైలులోంచి దిగుతున్నారు.

"షేక్ అబ్దుల్లా జిందాబాద్...... బొంబే కాన్ఫరెన్సు జిందాబాద్..."

తాను కలలుగన్న బొంబాయిలో నడుస్తున్నాడు కోటి...బెడ్డింగులుముందు 'హేల్ గాడీ'లో పోతున్నాయి. కేంప్ కు ఊరేగింపుగా పోవడానికి వీల్లేదంటున్నాడు వలంటీర్...

విద్యార్థుల్లో కలవరం పుట్టింది.

"ఏం .. ఎందుకు వీల్లేదు..."

"ఊరేగింపులు నిషేధం. సిటీలో 144 పెట్టింది ప్రభుత్వం"

"ఎందుకు..."

"మన మహాసభ కూడా పెట్టుకోనివ్వరేమో!"

అందరి వదనాలూ ఆశ్చర్యం వెలిబుచ్చాయి.

"మతకలహాలున్నాయి ఎక్కడో..."

"మనం 'హిందూ ముస్లిం ఏక్ హో' అంటాం కదూ?"

* * *

పదమూడువందల మందితో ఖాల్సా కాలేజీలో జరుగుతూన్న రహస్య(!) సమావేశాలూ ఉపన్యాసాలూ, చర్చలూ అన్నీ కోటికి ఏదో కలలాగున్నాయి. తను అనేక విద్యార్థిమహాసభలకు వెళ్ళాడు కాని ఇదేమిటి, ఏనిమిషమైనా వాళ్లురావచ్చు, సభ వీల్లేదనొచ్చు...

"బహిరంగ సభలు వీల్లేకపోవచ్చు... ప్రభుత్వం నిషేధించవచ్చు... లోపల... ఇంటిలోపల జరుపుకుంటేనేం!"

"పిచ్చివాడా! మతకలహాలు ప్రభుత్వం చూపెడుతూన్న సాకు కాని నిజమైన కారణం అనుకున్నావేమిటి? సోషలిస్టుపార్టీ కార్యవర్గం కలుసుకునేందుకు వీల్లేదన్నది ప్రభుత్వం...ఏం...కార్యనిర్వాహకవర్గంలో ముస్లింలుహిందువులు నరుక్కుంటారా..."

"మరి...ప్రభుత్వంమీసభలు నిషేధించిందికదా......మీరేమి చెయ్యదలచుకున్నారు...అనేక వందల మైళ్ళ దూరం నుంచి డబ్బు ఖర్చుపెట్టుకొచ్చారే!"

ట్రాంలో వెడుతూంటే కోటిని ఎవరో ప్రశ్నించారు. కోటి మాట్లాడలేదు. మళ్లీ ఆయనే అందుకున్నారు..."నన్నడిగితే... మీరు జరిపేది ఎక్కడ......కాంగార్ మైదానంలోకదూ...మహాసభ జరిపి తీరతామని చెప్పండి ప్రభుత్వంతో......జరపండి...పోలీసులుమిమ్మల్నేమిచేస్తారు... బొంబాయిప్రభుత్వం అంటే ప్రజలకికోపంపీకదాకావుంది...మీరు నిషేధాన్ని ధిక్కరించండి! బొంబాయి ప్రజలకు మార్గం చూపించండి!" ట్రాంబండ్లు, కార్లు వీధులన్నిటినీ ప్రతిధ్వనింప చేస్తున్నాయి. ఈ సంభాషణ అవికూడా వింటున్నాయనిపించింది. కలవరపడుతున్నాయనిపించింది.

"రేపుసాయంకాలం నాలుగు గంటలకు విద్యార్థులు పౌరసత్వ హక్కులకోసం పోరాడుతున్నారు!"

"కాంగార్ మైదాన్ చలో!"

"పోలీసులు మహాసభ మైదానం పెండాలు ఆక్రమించారు తెలుసా"

"కాంగార్ మైదాన్ చలో!"

ఎవరిని ఏ ప్రశ్న అడిగినా సమాధానం ఒకటే...

"కాంగార్ మైదాన్ చలో!"

విద్యార్థులందరికీ తాము బహిరంగంగా జరపబోయే విషయం.....ప్లాను అంతా తెలుసు...నాలుగు గంటలకి సాయంత్రం నిషేధాన్ని ధిక్కరించాలి! పోలీసుల్ని అడ్డి...పోరాడి...కాంగార్ మైదాన్ ప్రవేశించాలి.

మధ్యాహ్నం రెండుగంటలకే విద్యార్థులు మైదానంముందు పరేల్ స్టేషన్ దగ్గర చేరారు. ఎదురుగుండా 'పదకొండవ ఆలిండియా స్టూడెంట్సు ఫెడరేషన్ కాన్ఫరెన్స్' అని ఎర్రబేనర్ గాలికి ఊగుతోంది ఉత్సాహంగా.

"జరిపి తీరుతాం!" అన్నాయి పద మూడువందల విద్యార్థికంఠాలు.

"మీకు మేంతోడు" అన్నారు వేల కొద్దీ బొంబాయివాసులు!

"పోలీసులు టియర్ గాస్ వాడితే, ఇదిగో నీళ్లతో మేంసిద్ధం..." అన్నారు బొంబాయి గృహిణులు!

"షేమ్... షేమ్... హోమ్ మినిస్టర్"

"బొంబాయి ప్రభుత్వానికే సిగ్గు..."

పోలీసు లారీలు దిగుతున్నాయి... తెల్లటోపీలతో మొలలో రివాల్వర్ల ఆఫీసర్లు...

"పోలీస్ జులుం నశించాలి..."

"పోలీస్ రాక్షసులు వెంటనే ఇక్కడ నుంచి వెళ్ళిపోవాలి..."

విద్యార్థినులు నీళ్ళలో గుడ్డలుముంచి చుట్టూ అందరికీ పంచిపెడుతున్నారు.

నాలుగు సమీపిస్తోంది!

"వీళ్ళిప్పుడు ఏం చెయ్యబోతున్నారూ...!"

"???"

"అరఫర్లాంగు దూరంలో వుంది మైదాన్... చుట్టూ...... అంతా పోలీసు దళాలు...ఎలా చేరతారు ప్రదేశాన్ని...."

నాలుగు అయింది!!!

ఎక్కడనుంచి వచ్చిందో సిగ్నల్... ఎవరిచ్చారో... నాకు యీనాటికీ తెలియదు... అంతా అద్భుతంగా వుంది.

అంతే!

కాంగార్ మైదాన్ వలో......

గబగబ మైదాన్ వైపు పరుగెత్తారు విద్యార్థులూ......పౌరులూ.....కనుతీసి నూనేలోపల పెరేల్ ట్రాం సేవనులో ఒక్క మనిషి లేడు... కాంగార్ మైదాన్ రోడ్ మీద వేలమంది పరుగెడుతున్నారు!

పోలీసులు నివ్వెరపోయారు. .విద్యార్థి వీరులకి లాఠీలందించారు ..బలుసాకుకోసం పరుగెత్తారు...

మైదాన్ చేరువయింది...పోలీసు ఆఫీసర్ రివాల్వర్ పేల్చాడు...పడిపోయారు ఒకరో యిద్దరో. లాభం లేకపోయింది... విద్యార్థులు ప్రవేశించారు మైదాన్‌లో! పెండాల్ ఆక్రమించారు!

వందలు విద్యార్థులూ...ప్రజలూ... పెండాల్‌లో చేరారు...

కోటి ఉద్రేకంగా నినాదాలు ఇస్తున్నాడు.

"బొంబాయి ప్రభుత్వ కిరాతకచర్యలు నశించాలి!"

"మురార్జీదేశాయ్ ఖబడ్దార్! ఎ. ఐ. యస్. యఫ్. హై తయార్!" ఇంకా ఇంకా గొంతెత్తి అరుస్తున్నాడు.

ప్లాట్‌ఫారం మీద విద్యార్థి నాయకులూ ఎంతోమంది విద్యార్థులూ విద్యార్థినులూ—చుట్టూ వందలకొద్దీ విద్యార్థులూ—విద్యార్థినులూ--ప్రజలూ—ఎదురుగుండా దూరంగా పోలీసులు-పటాలాలు—ముఖాలకి టియర్ గాస్ నుంచి రక్షించుకునేందుకు తొడుగులతో!

కార్యదర్శి మాట్లాడటం ప్రారంభించారు:

"ఈనాడు బొంబాయి పౌరులకు రాక్షసులనుంచి పౌరసత్వాలు సంపాదించుకోవడం నేర్పాం—మహాసభ జరిపి తీర

తాం—ఈవేళటి మహాసభకు బొంబాయి పౌరులు ప్రముఖులందరి ఆశీర్వచనాలూ వున్నాయి. కార్మికనాయకులు శ్రీ యస్. యమ్. జోషీ ఆశీర్వదించారు. ప్రఖ్యాత పండితులు ఘటల్ ఆశీర్వదిం దించారు. ఈవేళ సమావేశానికి బొంబాయి విద్యార్థి యూనియన్ కార్యదర్శి సుశీలా మదీమన్ అధ్యక్షత వహిస్తుంది—"

వందలవేల కరతాళ ధ్వనులతో సుశీలా అధ్యక్షత వహించింది. ఎన్నో కెమేరాలు క్లిక్' మన్నాయి. ప్రెస్ రిపోర్టర్లు, తీసిన ఫొటో తీయకుండా, ఫిలింరీల్సు ఖాళీ చేస్తున్నారు. పోలీసులు పిచ్చిపట్టినట్లు అరుస్తున్నారు; విభ్రాంతులౌతున్నారు.

తీర్మానం ప్రవేశపెట్టబడింది!

"—బొంబాయి ప్రభుత్వ చర్యని ఖండిస్తూ..."

అంగీకరించబడింది ఏకగ్రీవంగా...

బొంబాయి పోలీసుచర్యను ఖండిస్తూ తీర్మానం ప్రవేశపెట్టబడింది....ఏకగ్రీవంగా అంగీ..."టియర్ గాస్..."

ఢాఁ...ఢాఁ...ఢాఁ...

టియర్ గాస్ పెండాలంతా కమ్మేసింది.

పొగ...మంట...విద్యార్థులు, విద్యార్థినులు స్పృహతప్పి పడిపోయారు...

పొగలో పోలీసువీరుడు తుపాకీ కాలుస్తున్నాడు!

చాలమంది జాగ్రత్తగా రక్షణస్థలాలు చేరుకున్నారు.

నీళ్లుబిందెలతో..నాలు గంతస్థులపై నుంచి...కురిసిపోతున్నాయి...కాంగార్ మైదాన్ చుట్టూ బొంబాయి స్త్రీలు అమృత వర్షం కురిపిస్తున్నారు. కడవలు క్రుమ్మరిస్తున్నారు.

"సామ్రాజ్య వాదులతో చాలసార్లు పోరాడేం ఈ విధంగా ఇదేస్థలంలో"... అంటోంది ఒకామె నాతో.

"మళ్లీ ఆక్రమిస్తాం మైదాన్"

ముందుకు పోతున్నారు పోలీసుకు రొమ్ములొగ్గి—

మళ్లీ టియర్ గాస్—తుపాకి కాల్పులు.

కళ్లు మండిపోతూ ఎవరింట్లోకో చేరుకున్నాను. కోటిఏమయ్యాడో తెలియదు—ఇంకాఇంకా చాలామంది—

గదిలో స్పృహ తెలిసీ తెలియకుండా పడుకున్నాను— ఎవరో వచ్చి గదిలో అంటున్నారు—"మనంవిజయంపొందాం—ప్రభుత్వంకాదు. యువకులు గెలిచారు!"

"మన మహాసభ మైదాన్‌లో జరుపుకున్నాం—కార్యనిర్వాహకవర్గం—విద్యార్థి ప్రతినిధులు ఎవరి కేంపులకు వాళ్లు వెళ్లాలని కోరుతోంది—"

"1942 దృశ్యాలు మళ్లా పట్టణంలో జరిగాయి!"

"బొంబాయిప్రభుత్వ దారుణచర్యలు!"

"మురార్జీదేశాయి కఠినహృదయం!"

పేపర్లన్నీ బేనర్ హెడ్డింగులతో విద్యార్థులను హర్షించాయి.

కోటికి దెబ్బలుతగిలాయి ఆసుపత్రిలో ఉన్నాడు—

ఆసుపత్రిలో కోటితో నేనుచూసిందంతా చెప్పాను.

మూలుగుతూ అన్నాడు—"నువ్వు చూసింది చాలా తక్కువపోరాటం—నేను—తర్వాత చెప్తాను—" నీరసంగా కళ్లుమూశాడు.

మధ్యాహ్నం ఒంటిగంటకు బొంబాయి మద్రాస్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది—తన దేమీ పోనట్లుగా...

రైలులో ముసలితాత అన్నమాటలు మళ్లీమళ్లీ జ్ఞాపకానికొస్తున్నాయి—

"మేము మాచిన్నతనంలోనూ ఇలాగే పోరాడేం బ్రిటిష్‌తుపాకులకి ఎదురుగా—ఈనాడు నా స్నేహితుడిమీద మీరు దెబ్బలాడేరు—నేనేమీ విచారపడడంలేదు. శత్రువుఎవరైనాబుద్ధిచెప్పాల్సిందే—నేను వీళ్లతోవిసిగి రాజకీయాలువదలుకున్నాను. మీరు యువకులు—ముందుకుతీసుకుపోండి అపలైన స్వాతంత్ర్యజండాని—మీవిద్యార్థి సంఘానికి నా ఆశీర్వచనములు !!"

విద్యార్థి జండా బొంబాయి గాలిలో రెపరెపలాడుతూ గర్వంగా మీకు స్వాతంత్ర్యాన్నీ శాంతినీ అభ్యుదయాన్నీ ఇచ్చి తీరతానని విద్యార్థులకు హామీ ఇస్తోంది!

"విద్యార్థి ఉద్యమ చరిత్రలో ఒక ముఖ్య ఘట్టం యీ మహాసభలు" తల మీద గాయం నిమురుకుంటూ గర్వంగా అన్నాడు కోటి!

మధ్యాహ్నపు ఎండనీ—దక్కను పీఠభూమినీ చీల్చుకొని వడిగా వడివడిగా అనేక వందల విద్యార్థివీరులనూ ప్రజలనూ మోసుకొని 'మద్రాస్ ఎక్స్‌ప్రెస్ విసురుగా సాగిపోతోంది!

ఓ నాజీ నైజాం ★

నీ వింకా అంధుడవేనా ?
భావికాలగతి ఏమో
పరికించక, నీవారల
మధ్యయుగపు చరిత్రనే
మననంచేస్తూ, నాజీ
నరహంతక పరిపాలన
ఎన్నాళ్ళిక చేద్దామని...
—నీవింకా అంధుడవు !

నీ గాజుకళ్ళ కగుపడవో
కరకుగుండె పోలీసులు
అరబ్బులు గూండాలుచేయు
చెప్ప నోరురాని పనులు :

శిశుహత్యలు, దోపిడీలు,
స్త్రీల మానభంగాలు
చెరలు, గ్రామదహనాలు
—ఒకటేమిటి ? నాజీ...

ఇకనైనా మేలుకొనుము
ఇది పౌరస్వాతంత్ర్యయుగం,
ఇది ప్రజాతంత్రయుగం !
ఇక్కడ నీ నిరంకుశత్వం
నిలిచేందుకు తావులేదు !
తావులేదు ! కాదంటే—
ప్రజాగ్రహమున
కాహుతివైపోతావు !

★ ★ ★
శ్రీ పల్లా రామకోటయ్య

చార్లీ చాప్లిన్ సినిమాకళ

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

చార్లీ చాప్లిన్ హాస్యగాడుగా ప్రసిద్ధికెక్కాడు. అతని హాస్యం వెనక కరుణకూడా ఉందని విమర్శకులు చాలాకాలం క్రితమే గుర్తించారు. లాక్షణికంగా చార్లీ చాప్లిన్ సినిమాకళ కరుణాసమన్వితమైన హాస్యంప్రధానంగా గలది, అని చెప్పినంత మాత్రం చేత చాప్లిన్ సినిమాకళను గురించి సమగ్రంగా వివరించి చెప్పినట్టు కాదు.

టెక్నికల్‌గా చాప్లిన్ హాలీవుడ్‌కు కొంత వెనకగా ఉంటూ వచ్చాడు. టాకీలువచ్చిన చాలాకాలం చాప్లిన్ మూకీలే తీస్తూ వచ్చాడు. గతప్రపంచ యుద్ధం ప్రారంభమైన తరువాత విడుదల అయిన "గ్రేట్‌డిక్టేటర్" చిత్రంలో మొట్టమొదటిసారి చాప్లిన్ నోరు తెరచి మాట్లాడాడు. ఈనాడు కూడా చాప్లిన్ చిత్రాలలో శిల్పం పాత వాసనే కొడుతూ ఉంటుంది.

చాప్లిన్ ప్రత్యేకత తెలుసుకోవాలంటే అతని ఆశయాలను, వాటిని చాప్లిన్ సాధించే పద్ధతులనూ అవగాహన చేసుకోవాలి.

"కిడ్" "గోల్డ్‌రష్" "సర్కస్" "సిటీలైట్స్" "మోడరన్ టైమ్స్" "గ్రేట్‌డిక్టేటర్" "మన్స్యూవెర్డు—" 1925నుంచీ 1947వరకూ చాప్లిన్ తయారుచేసిన చిత్రాలు ఈ ఏడే. వీటిలో మొదటి ఆరింటిలోనూ చాప్లిన్ ఒకేపాత్రధరించాడనీ, అకస్మాత్తుగా "మన్స్యూవెర్డు"లో అతను వేషం మార్చేశాడనీ, అందరూ నమ్ముతున్నారు. ఇది కేవలం పొరపాటు. తన పాత్రను "ట్రాంప్" అని పిలవ నిచ్చాడు చాప్లిన్. కాని ఇదికూడా పూర్తిగా నిజం కాదు. ఎందుచేతనంటే దాదాపు ప్రతి చిత్రంలోనూ చాప్లిన్ ధరిం

చిన పాత్ర ఏదో పని చెయ్యటానికి ప్రయత్నిస్తుంది. "కిడ్"లో అద్దాలు వేస్తుంది, ఇళ్ల ముందు మంచు ఊడుస్తుంది. సర్కస్‌లో కూడా సర్కసు పనులు చెయ్యటానికి సిద్ధపడుతుంది. "మోడరన్ టైమ్సు"లో ఈ పాత్ర ఫ్యాక్టరీకూలీ. "గ్రేట్ డిక్టేటర్"లో మంగలి. అయితే చార్లీ చాప్లిన్ ఇన్ని ఏళ్లు గాధరిస్తూ వచ్చిన పాత్రను శ్రామికుడనటానికి రెండు కారణాల చేత వీలు లేదు. ఒకటి, ఈ పాత్రకు శ్రమించటంలో విశ్వాసం లేదు. రెండు, ఈ పాత్రయొక్క ఆశయాలు మధ్యతరగతి మనస్తత్వానికి చెందినవీ, అసాధ్యమైనవీనూ.

"మన్స్యూర్ వెర్డు" చిత్రంలో చాప్లిన్ పాత్ర అకస్మాత్తుగా మారాడా? లేదు. ఇప్పుడైనా అతను ఉద్యోగం పోగొట్టుకున్న బాంకు గుమాస్తా— మంగలివానికన్న ఎక్కువ ఘనమైనవాడు కాడు. అయితే ఈ చిత్రంలో కూడా ఈ అభాగ్యుడైన బాంకు గుమాస్తా తన గొంతెమ్మ కోరికలు తీర్చుకోవటంలో వెనకటి పాత్రకన్న ఎక్కువ విజయం పొందినట్టు కనిపిస్తాడు— కాని నిజంగా విజయం పొందడు. "సిటీలైట్స్" అనే చిత్రంలో చాప్లిన్ తన ప్రియురాలి గుడ్డితనం పోగొట్టటానికి దొంగతనం చేసి జైలుకు పోయి, కళ్లు వచ్చాక ఆమెకూ తనకూ ఉన్న ఎడం తెలుసుకుని తన ప్రేమ గగన కుసుమమని గ్రహించుకున్నట్టుగానే, వెర్డుకూడా తన భార్యాపిల్లలు పోగానే తన ఆదర్శాలు తనకు అందకుండా పోయాయని తెలుసుకుంటాడు.

వెర్డుగా చాప్లిన్ మారలేదు— పరిణామం చెందాడు; అంతే! 1925లో కిటికీలకు అద్దాలు వేసే వాడికి జీవితంమీద ఎంత అధికారం ఉందో, అతడి కలలు నిజమయ్యే అవకాశాలేపాటి ఉన్నాయో, 1947లో వెర్డువంటి బాంకు గుమాస్తాకు జీవితంమీద అంతే అధికారమూ, తన కలలు నిజం చేసుకోవటానికి అంతే అవకాశాలూ ఉన్నాయి. సాంఘిక పరిణామం ఇది కాదా?

చార్లీచాప్లిన్ కథ వాస్తవిక కథ కాదు. అతని పాత్రలు యథార్థ పాత్రల ప్రతిబింబాలు కావు. అతను మనకు ఒక అద్దాలమ్మేవాణ్ణిగాని

ఒక ఫ్యాక్టరీ కూలీని గాని, ఒక మంగలినిగాని, ఒక బాంకుగుమాస్తానుగాని, చూపడు. మధ్యతరగతి వాళ్ళ ఆదర్శాలకూ నగ్నజీవితానికీ ఉండేసంఘర్షణను చిత్రించేటందుకు ఈ యీపాత్రలను చాప్లిన్ సృష్టించాడు. చాప్లిన్ కళ ప్రత్యేకించి మధ్యతరగతికే. మధ్యతరగతి వాళ్లు విశ్వసించే ధర్మాలునియమాలు,డబ్బు,అధికారం పోలీసులు, సంస్కారం నికృష్ట జీవుల జీవితాల దృష్టి పథంనుంచి ఎట్లాకనిపిస్తాయో చాప్లిన్ చూపిస్తాడు. మధ్యతరగతివాళ్ళ కలలు భగ్నం చేస్తాడు. "కిడ్" చిత్రంలో పోలీసు వాడికి దడిచి చాప్లిన్ ఎవరో వొదిలేసిన కుర్రవాణ్ణి పట్టుకుపోయి పెంచుకుంటాడు. "మోడరన్ టైమ్స్" చిత్రంలో ఎవరో పారేసుకున్న ఎర్రజండా చేతితో పట్టుకుని ఎరెస్టవుతాడు. పోలీసులు శాంతి భద్రతలుకాపాడటానికి కావచ్చు, కాని వారు కాపాడే శాంతిగాని భద్రతగాని అనాధలవికావు. తిండి ఆకలి తీర్చడానికి కావచ్చు, కాని బీదవాళ్ల ఆకలి తీర్చడానికికాదు మతం, ఆత్మశాంతికి కావచ్చు, కాని అసమర్థుడి ఆత్మ శాంతికి మటుకు కాదు. ఒకబుడ్డివేసివున్న ప్పుడుతప్ప ధనికుడి మానవ ప్రేమను విశ్వసించటానికి లేదు. డబ్బుతోపోయిన కళ్లు తెప్పించవచ్చు కాని జైలుకు పోకుండా అనాధకి ఆడబ్బు లభించదు. సంఘంలో ఉండే ఈసత్యాలని విమర్శిస్తూ చాప్లిన్ చిత్రాలు తీస్తూ వచ్చాడు. మధ్యతరగతి వాస్తవికతద్వారా ఈ సత్యాన్ని ఎన్నటికీ గ్రహించలేదు.

చాప్లిన్ రసాన్ని సాధించే విధానంకూడా వాస్తవికతకుతావివ్వదు. ఎంత ఆకలిగొన్న వాడుగాని మైనపు వత్తులు తినగలడా? చెప్పులు వండుకుని తినగలడా? ఎక్కడున్నా ప్రెస్సులోపడ్డ జేబుగడియారం వెడల్పయిన అట్ట గడియారంలాగా సాగుతుందా? యంత్రాల్లో ఇరుక్కుపోయిన మనిషి ఒక్క చుక్క రక్తం కారకుండా బతికి బయటికి వస్తాడా? చాప్లిన్ చిత్రాల్లో ఇవన్నీ సాధ్యమవుతాయి. వెర్రుచేసేవ్యాపారం

వయసుమళ్లిన, డబ్బుగల స్త్రీలను పెళ్లాడి హత్యచేసి డబ్బు కాజెయ్యటం. అయినప్పటికీ "వెర్డు" చిత్రంలో భీభత్సం దాదాపు లేనే లేదు.

చాప్లిన్ రాజకీయవాది కాడు. "వెర్డు" చిత్రంచూసి చాప్లిన్ను "నీవు కమ్యూనిస్టువా ?" అనిఅడిగిన వాడి కన్న మతిలేని వాడుండబోడు. డిక్టేటర్లు, నిరుద్యోగమూ, లాకవుట్లూ, వ్యాపారమూ, మారణ సామగ్రి నిర్మాణము, యుద్ధాలూ—వీటినిగురించి విస్పష్టమైన అభిప్రాయాలు వెలిబుచ్చే అధికారం రాజకీయ వాదులకే ఉన్నట్లూ, కళాకారులకి లేనట్టూ మాట్లాడడం మూఢత్వం. సాంఘిక దోపిడి చలాయించేవాళ్లు ఇటువంటి మూఢత్వాన్ని బలపరుస్తారు.

చాప్లిన్ తన చిత్రాలద్వారా సాంఘిక వ్యవస్థను విమర్శించుతాడేగాని ప్రపంచానికి రాజకీయ ప్రణాళిక లివ్వడు. అంతవరకు కళాకారుడుగా అతన్ని తప్పుపట్టడానికి ఎవరికీ అధికారంలేదు.

ఇటీవల మన దేశంలో విడుదల అయిన "మస్యూ వెర్డూ" చిత్రంలో చార్లీ చాప్లిన్ కళ అనేకవిధాల ఉన్నతస్థాయికి వచ్చింది. "వెర్డూ" వాస్తవిక పాత్రకాదు. తన భార్యాబిడ్డల మీదిప్రేమ కొద్దీ ధనార్జన కోసం హత్యలు సాగించే యథార్థ పాత్ర. కొద్దికాలానికి హంతకుల మనస్తత్వం అవలంబించి సంఘానికీ మధ్యతరగతి విలువలకూ ఎడమై పోతుంది. కాని "వెర్డూ" అట్లా కాడు. తనస్థితిలోనేఉన్న ఒక అనాథ స్త్రీకి సహాయంచేస్తాడు. హింస, హింసను ప్రేరేపిస్తుం దంటాడు. నోరులేని జంతువులమీద ప్రేమ చూపిస్తాడు. తన భార్యా బిడ్డలను చివరివరకూ ప్రేమిస్తాడు. ఒక వ్యక్తి చెయ్యలేని ఈ పని మధ్యతరగతి చేస్తూనేఉన్నది. మధ్యతరగతికి జీవకారుణ్యంలో విశ్వాసం ఉన్నది, యుద్ధాలనూ ఆమోదిస్తున్నది. నీతిలోనూ విశ్వాసం ఉంచుతున్నది, వ్యాపారాన్నీ ఆమోదిస్తున్నది. "వెర్డూ" మధ్యతరగతిప్రజ. మధ్యతరగతిగురించ

(మిగతా 31 పేజీలో)

★ కదలండిక కదనానికి

శ్రీ నల్లం
బాలకృష్ణరావు

మన కోక మెతుకే కఱవై
మనకిక బ్రతుకే బరువై
ఏమిటీ నాటకం!

పగలు రాత్రి విరతి లేక
పరిశ్రమించే బ్రతుకులే చితకటం
మనిషి మనిషిని మృత్యువై మ్రింగటం!!
సహించలేమిది,
సహించలేమిక.

శ్రామికులారా!
శ్రేణులు తీరిన సైనికులారా!
సాగండిక సింహాలై గర్జిస్తూ
అది గదిగో
ఆకసమంటగ
శిఖ శిఖ లెగసిన
ఘనహోమం - రణహోమం - పదండి!
నేల యీనినా జనం మనది
మూలమూలలా జగం మనది
యుగ యుగాలకే విజయం మనది
యోధుల్లారా!
కదలండిక కదనానికి

కోటికోటి గొంతులొక్క మ్రోతగా
కోటికోటి శక్తులొక్క సేనగా

లోకమంత ఏకగీతం
రక్తగీతం ఆలాపిస్తూ
లోకమంత ఏకబాట
రక్తబాట నధిగమిస్తూ,
పగిలి రగిలిన ఫ్యూజియామాలై
ప్రళయాగ్నులై ప్రజ్వరిల్లండి!
ఎగసి ఎగసి విశ్వమంత నిండిపొండి
నింగినంటగ పొంగిపొరలే
పెనుకెరటాలై - పసిఫిక్ సంద్రాలై
హోరు హోరున తరలిరండి!
విశ్వమంత తిరుగ రండి!

కులమత కలహాపు, సంక్షోభంకోసం
కోఅలునిండిన విషం క్రక్కడంకోసం
కాచుకొన్న త్రాచుల పీచమడచగ
కదలండిక కదనానికి!
కదలండిక! కదలండిక!

ఈదాస్యం భస్మమై
ఈదైత్యం అంతమై
స్వాతంత్ర్యం సమభావం పుష్పించగ,
యీ జగతి స్వర్లోకమై
యీ జీవితం స్వర్ణోత్సవమై
కాంతీశాంతీ వర్షించగ
ప్రళయకాలపు గరళ కంఠుల్లారా!
పగిలి రగిలిన కంటిమంటల్లారా!
విలయకాలపు వియన్మణులారా!

విశ్వవ్యాపిత విప్లవ జ్వాలామాలికలారా!
ఎగసి ఎగసి
పోదాం పోదాం
ధృవధృవాలకు, దశ దిశలకూ
దూసుకుపోదాం, పోదాం

ఓ కహోకహో, ప్రళయానిల, ఫాలానిల జ్వాలల్లారా
ప్రళయానిల, ఝుంఝుంానిల మాలల్లారా
విలయగతిని కలయలేచిన వీచీ మాలల్లారా!
కదలిండిక కదనానికి!
కదలండి! కదలండి! కదలండి!

సినిమా కళ

(28 వ పేజీ తరువాయి)

వలసిన నీతులన్నీ వెర్డూ నోట మనం వింటాం.

"వ్యాపారం ఎప్పుడూ తప్పుడు వ్యాపారమే"

"క్రౌర్యం విస్తృతంగా ఆచరణలో పెడితే తప్ప ఫలించదు"

"ఒకరిని చంపటం హత్య! అనేకులను చంపటం పరాక్రమం"

"పాపాత్ములు ప్రపంచంలో లేకపోతేమతగురువు లేంకావాలి?"

"ఆత్మకు ప్రాళనం అనవసరం; అది భగవంతుడిలో భాగం."

"నా పేచీ దేవుడితో కాదు, మనుష్యులతో."

వెర్డూ ప్రకటించే ఈ భావాలను ఎట్లా స్వీకరించాలో, వాటిని గురించి మనస్సులెట్లా సమాధాన పరచుకోవాలో, సమాధాన పరచుకోలేకపోతే ఏం చెయ్యాలో తేల్చుకోవలసినది ప్రపంచప్రజలు. ఉన్న సంగతినగ్నంగాచాప్లిన్ వెర్డూ నోట పలికించాడు. అదే చాప్లిన్ సినిమాకళయొక్క ఒక్క ఆశయమూనూ.

నా కవిత

శ్రీ 'గంగినేని'

★

నా కలం
నెత్తుటి కలం-
ఖడ్గంలా, గండ్రగొడ్డలిలా
చరచర ఉరుకుతోంది
పరపర నైజాం నవాబు
కుత్తుక తెగనరకను!

నా కవిత
పగబట్టిన త్రాచులా
పొంచివున్న రేచులా
దూకుతోంది
నిరంకుశుల రొమ్ములపై
నియన్తల బండల గుండెలపై!

నాకలం
రణఖడ్గం!
రచిస్తుంది—
సామ్రాట్టుల సంస్థానాధీశుల
మరణ శాసనం!

నాకవిత
రణ కంఠం!
పచిస్తుంది—
కూటికోసం కుమిలే
కోటికోట్ల ప్రజలవిప్లవం!
పదండి ఇక
పేదలార!
అట్లో ఇట్లో తేల్చుకోను
కదనభూమికే పదండి!
ప్రతిపూటా పస్తుకాని
కష్టించని రోజు లేదు!
పోనున్నది ఏమున్నది?
పోతేమా దారిద్ర్యం!
తుదిసమరం ఇదే ఇదే
మన నెత్తురు వృథాకాదు!
మన కత్తికి ఎదురులేదు!
పదండి ఇక
సమర అమర భూమికి
పదండి!
పదండి!

నేనెవరిని?

మూలం: కె. ఎ. అబ్బాస్

అనుసరణ: వెంపటి రాధాకృష్ణ

[అబ్బాస్ రచించిన "మై కౌన్ హూం" అను నాటిక చూచి, అతను వ్రాసిన చిన్న కథ లోని సంభాషణలతో, నాటికలోని శిల్పంతో యీ నాటిక తయారు చేయబడింది తెలుగులో]

పాకిస్తాన్ రేడియో

"పాకిస్తాన్ రేడియో! వార్తలు. అజాదె కాశ్మీర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం ముమ్మరంగా సాగించబడ్తోంది. కొన్ని గ్రామాలు విముక్తి చేయబడ్డాయి. నిన్నరాత్రి న్యూఢిల్లీలో ఒక కత్తిపోటు ప్రమాదం జర్గింది. దెబ్బతిన్నది ఎవరయిందీ తెలియలేదు. యీ వార్తలు మీరు కరాచీనుండి వింటున్నారు"

హిందూస్తాన్ రేడియో

"ఆలిండియా రేడియో! తెలుగులో వార్తలు. కాశ్మీర్‌లోని ఇండియన్ యూనియన్ సైన్యాలు, దండగిండ్రను వెనక్కు తరిమికొట్టి, కొంత ఆయుధ సామగ్రిని వశపర్చుకొన్నారు. సరిహద్దు ఘర్షణలను విచారణ చేయుటకై బెజవాడకు మిస్టర్ మున్షీ రాక.

"నిన్నరాత్రి కరాచీలో ఒక కత్తిపోటు ప్రమాదం జర్గింది. దెబ్బతిన్నమనిషి ఎవరయిందీ తెలియలేదు. పోలీసులు దరియాప్తు చేస్తున్నారు. మీరీ వార్తలను ఆలిండియా రేడియోనుంచి వింటున్నారు."

[తెర తేస్తుంది

"కరాచీ
ముస్లిం కాందిశీకుల శిబిరం"

అని ఎంటరులో బోర్డు కట్టేయుంటుంది 'స్పాట్' మొదట దానిమీద పడుతుంది తెరలేచేటప్పటికి పొగలు, మంటలు, అనేక కూతలు వినపడాలి ఒక వ్యక్తి పడియుంటాడు రక్తంతో తడిసిన గుడ్డలు, మాసిన గడ్డం వికృతంగాకనపడేముఖం Spotయితని మీదికి పడ్తుంది కదులుతాడు గాయాల బాధ నెమ్మదిగాలేస్తాడు ఎడమవైపు నడవబోతాడు మనసుచెదిరిన మనిషిలాగా కనపడ్తాడు ధ్వనులువింటాడు వికృతంగా నవ్వుతాడు

హాహాహా! నేను భూతమై పీక్కుతింటాననుకుంటున్నారా! కాదు, మానవుడి జీవితం చెప్పుకుంటానికి వచ్చాను

ముస్లిం ప్రవేశం ఎడమవైపునుండి Spot వెయ్యాలి

వ్యక్తి బాబూ . (ఏదో చెప్పబోతాడు)

ముస్లిం ఎవరునువ్వు? హిందూవా? ముస్లిం వా?

వ్యక్తి జ్ఞాపకంలేదు

ముస్లిం పేరు?

వ్యక్తి అదికూడా జ్ఞాపకంలేదు నాకింకేవిషయంకూడా గుర్తులేదు

ముస్లిం (మానవత్వం నశించిన వాడిలాగ) అయితే యింకె క్కడికన్నాపో ఇది ముస్లింలకు మాత్రమే (వెళ్ళిపోతాడు)

వ్యక్తి (చూస్తూ నిలబడిపోతాడు ఒక క్షణం. బయలుదేర్తాడు మరోవైపు)

వ్యక్తి (కుడివైపునడువబోతాడు)

హిందూ ప్రవేశం

వ్యక్తి బాబూ ఆకలేస్తోంది రొట్టె!

హిందూ నీవు హిందూవా? ముస్లింవా?

వ్యక్తి నాకు గుర్తుకురావటంలా

హిం అది నిజమేనా?

వ్యక్తి నాకుఅబద్ధంచెప్పాలనిలేదు

హిం (కోపంతో) ఇదిహిందువులకుమాత్రమే (వెళ్లిపోతాడు)

వ్యక్తి హిందూ! ముస్లిం! నేనెవర్ని? (ముఖంచేతులతో తడుముకుంటాడు) నేనెవర్నీ కాదు నేనెవర్నీ కాదు హిందూ ముస్లింలకు మాత్రమే ఈ కాందిశీక శిబిరాలు — మానవులకు కాదు

ముస్లిం రొట్టెతో ప్రవేశం

ముస్లిం: ఏయ్ ఇదుగో రొట్టె.

వ్యక్తి: (చెయ్యిచాపుతాడు)

ము: (చెయ్యి వెనక్కు దీసుకొని, వెనక్కు నడుస్తూ) రాలోపలికి వెళ్దాంరా. రొట్టెయిస్తాను.

వ్యక్తి: (కిందనుంచి పైకి అతనిని చూచి రానన్నట్లు తల వూపుతాడు)

ము: పోనీలే నీ వెవ్వరవో చెప్పు. ముస్లింవా? హిందూవా?

వ్యక్తి: అదే తెలియటం లేదు. కొన్ని రోజులుగా ఆలోచిస్తున్నా... ఏదైనా మీరు మానవులేగా (రొట్టె యిమ్మన్నట్టు చేయి చాస్తాడు)

ము: (కోపంతో) కాదు. మేం మానవులం కాదు. ముస్లింలం మీపళ్లేడుగు రొట్టె (కోర చూపులతో వెళ్లుతూ ఉండగా ఆ వైపునుండి హిందూ ప్రవేశించుతాడు ముస్లిం కోరచూపులు యిటు మరల్చుతాడు. నిలబడిపోతాడు)

హిందూ: ఏయ్ ఇదిగో రొట్టె (ముస్లిం వంక ఎగతాళిగా చూస్తాడు)

వ్యక్తి (అందుకో బోతాడు)

హిం: (యివ్వడు) చెప్పు హిందూవా ముస్లింవా?

వ్యక్తి: నేనా! ముస్లిం ... కాదు ... హిం

హిం: అరెగాడిదా. అబద్ధం ఆడు న్నావే నీజిన్నానివెళ్లి అడుగు రొట్టె. (వెళ్లిపోతూ ముస్లిం వంక కోపంతో చూస్తాడు. ముస్లింకుఉక్కురోషం ఎక్కువౌతుంది. ముందుకొచ్చి) పాకిస్తాన్ జిందాబాద్

హిం: (ముందుకొచ్చి కోపంతో, రెట్టింపు కంఠంతో) హిందుస్తాన్ జిందాబాద్ (ఓడిపోయిన వస్తాదుల్లాగ ఒకర్ని ఒకరు చూచుకొని నిష్క్రమిస్తారు)

వ్యక్తి: రొట్టె హిందూ కేనా? ముస్లింకేనా? మానవుడికి లేదా? హుం! మానవుడికి రొట్టె లేదు. (ఎడమ వైపు పోతాడు. రక్తపు చారలున్నట్లు భ్రమించి, కుడి వైపుకి వస్తాడు. అక్కడా అంతే) సరిహద్దులంతా రక్తమయం ... హిందూ ముస్లిం సిక్కుల రక్తంమిళితమై పవిత్రభూమిలో

ఇంకింది (ఎడమ వైపు అడుగు వేసి చూచి) మానవులు కారు (కుడి వైపు అడుగు వేసి చూచి) మానవులు కారు... రాబందులు ... రక్త పిపాసులు... మానవత్వం నశించింది; నశించింది! హా హా హా మానవత్వం......

(చీకటి)

వ్యక్తి : (కుడి ప్రక్కనుంచి ఎడమ వైపుకు నెమ్మదిగా నడుస్తూ వుంటాడు. డాక్టరు బుచ్చర్ ప్రవేశం. వ్యక్తిని చూస్తాడు. సిగరెట్టు వెలిగిస్తాడు.)

వ్యక్తి : (ఎవరింటి ముందుకో వచ్చినట్లుందని తెలుసుకొని తలెత్తి చూస్తాడు. బోర్డు చూస్తాడు. చదువుతాడు) డాక్టర్ బుచ్చర్. హాహాహ !(ఆగి డాక్టర్ని చూచి) నేనెందుకు నవ్వుతున్నానో మీకు తెలుసుకోవాలని వుంది. చావసిద్ధంగా వున్న మనిషి ఎందుకు నవ్వుతున్నాడా అని మీకు తెల్సుకోవాలని వుంది. కాదు... హు !... డాక్టర్ సాబ్ ! మీకేమీ ఆందోళన వద్దు. మీ క్వైనైన్, యాస్పిరిన్ మాత్రలు అమ్ముకోండి... ఎవ్వరూ నన్ను చావునుండి తప్పించ లేరు. ...రెండు కత్తిపోట్లు... వెన్నునొకటి ...రక్తం యిదిగో...

డాక్టర్ : (బాగా పరికించి) Brain effected (కుర్చీ వేసి) Come on Sit down. Just relax. నేను... (అని పట్టుకొని కూర్చోబెడ్తాడు)

వ్యక్తి : (అనుమానంగా అతనివంక చూస్తూ) నేనెందుకు నవ్వుతున్నానని తెల్సుకోవాలనేనా.. చెప్తాను... (ఆలోచించి) నాకిప్పుడే జ్ఞాపకం వచ్చింది. రెండు నెలలనుండి, నేనెవర్నో తెల్సుకోటానికి ప్రయత్నిస్తున్నా... ముస్లిం నా ? హిందూ నా ? సిక్కునా? బ్రాహ్మణుడనా?.. అంటరానివాడినా ? పేదవాడినా? భాగ్యవంతుడినా ? (కాదన్నట్టు తలఊపుతాడు.)

డా: Dont worry. నే చెప్తాను. నీ వెవ్వరవో... See (కాగితం

కలం తీసుకొని) నీమనస్సునకు వచ్చిందంతా చెప్పు- ఎటువంటి దైనాసరే.

వ్యక్తి: (కళ్లుమూసుకొని)... నీలాకాశం... పచ్చని పొలాలు... ప్రవహిస్తున్న నది.

డాక్టర్: So that is Punjab

వ్యక్తి ... పడవలు.... పిల్లలు.... కాలువల్లో స్నానం చేస్తున్నారు.... ఆడుకొంటున్నారు.

డా: (ఆతృతతో) ఎవరాపిల్లలు ? హిందువులా ? ముస్లింలా ? సిక్కులా ?

వ్యక్తి: పిల్లలు. అంతే!

డా: ఊఁ—సరే, యింక చెప్పు

వ్యక్తి: పంటలయ్యాక...పొలంలో ...ఆకాశపుటెత్తున సువర్ణపు ధాన్య రాశి ... సంక్రాంతి పండుగ... భోగి మంటలు ... ఊయాలపాటలు ... వినాలి!

డా: ఎవరుపాడుతున్నారా పాట?

వ్యక్తి: స్త్రీలు

డా: (విసుగుతో) Oh! My heavens! You are too crazy వాళ్ళు హిందువులా, ముస్లింలా, సిక్కులా?

వ్యక్తి: పంజాబీ స్త్రీలు. ముస్లింలు హిందువులు సిక్కులు

డా: (నిరాశతో) సరే యింక చెప్పు

వ్యక్తి: నాకిప్పుడేమి విస్పష్టం లేదు కన్పట్టంలేదు.

డా: ఏం? ఎందుచేత?

వ్యక్తి: నాకు బాగా తలనొప్పిగా వుంది... చీకటి... అంతా చీకటి (తెరలో కేకలు ధ్వనులు)

డా: చూడుచూడు... కన్పడ్డంలా?
(తెరలో మంటలు)

వ్యక్తి: (నిశ్చలంగా) ఆ-చూడగలను మంటలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పల్లెలన్నీ భస్మమవుతున్నాయి.
(కేకలుఎక్కువగా వస్తాయి)

వ్యక్తి: అరుపులు ... స్త్రీలు... పిల్లలు... చెల్లాచెదురుగా

డా: (వెంటనే) వాళ్లెవరు హిందువులా? ముస్లింలా?

వ్యక్తి: మానవులు ... పాపం! మానవత్వం నశించింది... మానవత్వం... ...

డా: అది ఇండియా గవర్నమెంటు చట్టంలోనే లేదు. (మళ్లీ కేకలు ఆలకించి) ఆ వీళ్లే... అరుగో! నీ కుటుంబాన్ని చంపినవాళ్లు! నీ యిల్లు తగుల

బెట్టినవాళ్లు ! నీమనసు చెదర
గొట్టినవాళ్లు ! చూడు! చూడు!
హిందువులా? ముస్లింలా?

వ్యక్తి: అందరూ

డా: అరె Damn Crazy. (కేకలు)
విను!విను!వాళ్ళేమంటున్నారో

వ్యక్తి: నాకేమీ తెలియటంలేదు.
(తెరలో చంపు చంపు కేకలు)
(వెర్రికేక వేసి డాక్టర్ని కౌగలించు
కుంటాడు)

డా: Dont Fear. యిప్పుడు
చూడు. వాళ్లెవరో గురుకు
తెచ్చుకో — చంపేవాళ్ళకి,
తగులబెట్టే వాళ్ళకి నీవు ప్రతీ
కారం చేయాలి.

వ్యక్తి: (కోపంవస్తుంది)ఆ! ఫో: ఫో-
నీ మందులమ్ముకొని బ్రతుకు.

(డాక్టర్ నిర్ఘాంతపోతాడు.
నెమ్మదిగా జారుకుంటాడు. చీకటి.,
వెలుతురు)

(డాక్టర్ బోర్డు తీసివెయ్యాలి)

వ్యక్తి: డాక్టర్...నేనెవర్నో తెలుసు
కోవాలని ప్రయత్నం చేస్తున్నావు
కదూ. నేనొక ముస్లింని. హిందూ,
సిక్కు, స్త్రీలను పిల్లలనుచంపాను
లూఠీలుచేసాను... నేను హిందు
వుని. అనేకమంది ముస్లింలను
చంపాను. కాదు....కాదు.....
నేనెవర్నో నే తెలుసుకోను.....
నేను హిందువునూ కాదు.
ముస్లింనూకాదు, సిక్కునూకాదు,
నేనొక మానవుడిగానే వుంటాను.
నేనొక ....

(ఆలోచిస్తూ వుంటాడు)

ముస్లిం: (ప్రవేశించి) ఏయ్ సాలా
కహాఁజావోగే కాఫిర్ కాబచ్చా
(కత్తితోపొడిచి పారిపోతాడు.)

వ్యక్తి: అబ్బా !

హిందూ: (ప్రవేశించి) ఏయ్ ఆగు
(కత్తితోపొడిచి పారిపోతాడు)
[పోలీస్ యీలలు. Police
calling all the Stations
3 (thrice)]

రేడియో—
"మహమ్మదాలీ రోడ్డు చివ
రలో ఒక మనిషి పొడువ
బడ్డాడు. వెన్నునొకటి,రొమ్ము
నొకటి గాయంవుంది. గురుపట్టి
మనిషిని తీసుకెళ్ళవచ్చును.

వ్యక్తి: (రక్తం చిమ్ముతుంది, పడి
పోతాడు. నెమ్మదిగా లేస్తాడు;
బాధపడ్తూ)

యిపుడీరెండు గాయాలు ఎట్లా తగిలాయో తెలిసిందిమీకు. నన్ను ముస్లిము పొడిచాడు. హిందువూ పొడిచాడు. అందుచేతనే నేను బ్రతకలేను. మీరు బ్రతికించలేరు. అసలు మీరు బ్రతికించతలుచుకోలేదు. మీరుదీనికి ప్రతీకారం చేయ సిద్ధంగా వున్నారు-చివరిసారి-నేను హిందువని చెప్తే హిందూవీరులు వెంటనే అమాయిక ముస్లింలను చంప సిద్ధమవుతారు. నేను ముస్లింనని చెప్తే యీ ముస్లింశూరులు హిందూ తెగమీద ప్రతీకారం చూపుతారు.....నేనెవర్నో నాకిప్పుడు జ్ఞాపకం వచ్చింది. చావబోయే ముందు అంతా జ్ఞాపకం వస్తుంది. నాభార్య-నాశిశువు ఒకేసారిచంపబడటం నా కళ్లారా చూశాను. అందుకనే యిట్లాఅయ్యాను...... ... నాపొలాలు...నాగ్రామం.... నా స్నేహితులు...బంధువులు... యిరుగుపొరుగు. అబ్బా! (తూలబడ్డాడు) నేనెవర్నో ఎన్నటికీ చెప్పను. పొరపాటువల్ల, హిందువూ, ముస్లిమూ, వాళ్ళవాణ్ణే చంపుకున్నారు...ఇదేనా ప్రతీకారం... వాళ్లయిద్దరిమీదే కాదు - నావంటి వాళ్లని వేనకువేలుగాచంపి పవిత్ర దేశాన్ని మలినంచేసిన హిందూముస్లిం సిక్కులపైన యీప్రతీకారం- యీ ప్రతీకారం హిందూముస్లిం-సిక్కు-హిందూముస్లింలపై మానవుడిగా నా ప్రతీకారం (పడిపోతాడు. చనిపోతాడు)

[తెరలోనుంచి పాట వినబడుతుంది]

ఆపండోయ్ - మానవహత్యల్
ఆర్పండోయ్ - మారణహోమం
సహింపలేమని - భరింపలేమని
చాటండోయ్ - చాటండోయ్
మానవత్వమును _ నిలపండోయ్
విభాజ్యభారతం - కలపండోయ్
విదేశిమూకల - తరమండోయ్
అభేద్యకోటను - కట్టండోయ్
విజయభేరీల్ కొట్టండోయ్ !

[తెర పడుతుంది.]

దుర్గతి గతించు...

అనువాదం:
శ్రీ సి. వి. కృష్ణరావు

[గ్రీస్ స్వాతంత్ర్యపోరాటం గురించి ఒక అజ్ఞాత గ్రీక్ కవి రచన]

యుగ యుగాలు
నీ దేశపు స్వాతంత్ర్యానికి
రైఫిల్ పట్టుకొన్న
నీ బిగిసిన పిడికిలి
సడలిపోదు !
గురితప్పదు ! !

అండమాన్ ఖైదుల్లో
ఆ జన్మాంత మనుభవమున్న
నీ యెద కింకేముంది భయం ?
శిరసునెత్తి
ఛాతి విరిచి
కనబోయే
విజయ స్వప్నాలకు
నీ రుధిర స్రవంతినెత్తి
తర్పణ చేయగనిను
మరోసారి చూస్తున్నా.—

నీ శౌర్య ప్రతాపాలకు సంకేతంగా
ఎర్రబారిన
సాయంతనాన

ఒక్కసారి
ఒక్క నిమిషం
వీరులుగా గతించిన
నీ సోదరులకు
శ్రద్ధాంజలి సర్పించు !

ఈ దుర్గతి గతించుకాలం
తప్పక వస్తుంది,
ఈ జగత్తు సర్వం
వసంత మయమై
నీ కాహ్వానం ఇస్తుంది ;

ఈ భూదేవి
అనంత విశాల హృదయం
కరుణకు కొంచెం
తా విచ్చిం దని
జయగీతం పాడుతారు
నేడే మన సైనికులు !
జయనినాద మాలకించి
గోరిలో పవళించిన
వీరుల తనువులు గగుర్పొడుచు!

అప్పారావుగారి రచనలు - అభ్యుదయం

★ ★

శ్రీ రోణంకి అప్పలస్వామి

ఆంధ్రావనికీ, ప్రాచీన యిటలీదేశానికీ చాలావరకూ సామ్య మున్నట్లు నాకు తోస్తున్నది. గ్రీకుసాహిత్యం, ఇటలీ దేశపు సాహిత్యాన్ని బయటపడకుండా అణచి పెట్టిందని కొందరి విమర్శకుల అభిప్రాయం. గ్రీకు పద్యరీతులూ, సాహిత్య సంప్రదాయములూ ప్రబలి ప్రజల హృదయములనుండి సహజోత్పన్నములైన భావాలనూ, దేశి రీతులనూ కిందకు దిగలాగినవని ఖండితంగా చెప్పవచ్చును. అదేవిధంగా మహోన్నతమైన సాంస్కృతిక సంప్రదాయములు, ఆంధ్రుల సహజాభివృద్ధిని అరికట్టాయి. ఈ నగ్నసత్యాన్ని స్పష్టంగా గుర్తించి, సహజ జాతీయతను తెలుగువాళ్ళం పునరుజ్జీవింప చేసుకోవలసి వుంటుంది. ఇదే తరుణోపాయంగా పరిగణించాలి.

ఈ వాస్తవికపరిస్థితిని దృష్టిలోవుంచుకునే కాబోలును అప్పారావుగారు ముత్యాలసరాల ఫక్కీని తెలుగు సాహిత్యంలోకి ప్రవేశపెట్టేరు. మన ఆంధ్రంలో అపారమైన జానపద సాహిత్యం ప్రజల నిత్యజీవితంనుంచి జనించింది. నేటికీ అది ప్రచారిల్లుతూనే వుంది. కాని జానపద సాహిత్యానికి పండితు లంత ప్రాధాన్యత యివ్వకపోవడంవల్ల సాహిత్యంలో దానికి తగిన స్థానంలేకపోవడం [illegible]దం శోచనీయమైన విషయం. ఈ జానపద సాహిత్యం పెక్కు ఫణితులలో తెలుగు జీవితానికి నిండుతనాన్ని ప్రసాదిస్తోన్నా, కవులమనిపించుకునే వారంతా సంస్కృత కవిత్వ పోకడలనే, ఆ మర్యాదలనే గౌరవిస్తున్నారు. గురజాడ అప్పారావుగారు మాత్రము, అందరూ తొక్కినదారిని వదిలిపెట్టి ఆంధ్రసాహిత్యసహజకాంతులను ప్రసరింప చేయడానికి ఉద్యుక్తులయారు. ఇట్టి సహజసాహిత్యరీతియే, ముత్యాలసర రీతి. మన దురదృష్టవశాత్తూ ఆయన యెక్కువ కావ్యాలను వ్రాసి అనేకరీతులను ప్రవేశపెట్టలేకపోయారు. అందువల్ల చాలామంది విమర్శకులు అప్పారావుగారి ఉత్కృష్టతను స్పష్టంగా గుర్తించలేకపోతున్నారు.

ముత్యాలసరములలోని మొదటి కావ్యాన్ని క్లుప్తంగా సమీక్షచేస్తాను. వివరాలకిది సమయంకాదు. యీ కావ్యాన్ని రచించిన దినాల్లో "హాలీసు కామెట్టు" అని ఆంగ్లములో పిలువబడే తోకచుక్క ఆకాశంలో పొడమి దినదిన ప్రవర్ధమానమవుతూవుండెను. ఆ తోకచుక్క ఏవిధంగా చివరకు ఆకాశాన్నంతా ఆవరిస్తుందో అదేవిధంగా కవి నూతనతేజం దేశాన్నంతటినీ వెలుగొందిస్తుందని ఆయన [illegible]మ్మకం అందుకే, ఆయన ముత్యాలసర

రచన కుపక్రమించినది. ఈ లోకచుక్క లోకానికి ఎట్టి విపత్తులు చేకూరుస్తుందో అని అంతా దిగులుచెందుతూంటే, ఆ లోక చుక్కను ఉద్దేశించి, కవి "తలతు నేనిది సంఘ సంస్కరణ ప్రయాణ పతాకగాన్" అని ప్రవచిస్తారు. ఈ గేయాన్ని చక్కగా మనం అవగాహనచేసుకోవాలంటే ఆనాటి సంఘపరిస్థితులను జ్ఞప్తికి తెచ్చుకోవలసి వుంటుంది. నాటి ఆంధ్ర సమాజంలో రెండు విభిన్న శక్తుల నిరంతర పోరాటం సాగుతూంది. అభ్యుదయ శక్తులకూ, తద్వ్యతిరేక శక్తులకూ జరిగే సంఘర్షణా ఫలితమే యీయన రచన. ప్రగతిశక్తుల విజయాన్ని సాధించిపెట్టినది అప్పారావు గారు. కందుకూరి వీరేశలింగం పంతులు గారి కదనశంఖం, గిడుగు గురజాడల పోరాటపిలుపు, నాటి ఆంధ్రసమాజానికొక నూతన దీప్తిని కలిగించాయి. తన రచనల్లో ఛాందస ప్రవృత్తులపై ఎదురుదాడి తీస్తూ ఆచరణలో తన ఆదర్శాలను చూపిస్తూ వీరేశలింగంపంతులుగారు నవోద్యమానికి వెన్నెముక అయారు. కళా సమన్వితమైన రచనా సృష్టితో అప్పారావు పంతులుగారా ఉద్యమాన్ని విశాలవంతం చేస్తూ భాషలో శైలిలో భావాలలో నూతనదృక్పథాన్ని తీసుకువచ్చారు. కావ్యభాషగ వ్యావహారికాంధ్ర భాషను స్వీకరించి, లోకానికి కను విప్పుచేశారు.

ఈ చక్కని ఖండకావ్యంలో గురజాడ వారు భార్యాభర్తలమధ్య సంవాద రూపమున హృదయరంజకంగా భవిష్యత్ప్రపంచాన్ని సృష్టిస్తున్నారు. అసలు సిసలు సమస్యలను సమగ్రంగా చర్చిస్తున్నారు.

కాని కళాపోషణను విస్మరించడమే లేదు. భావకవులు అసలు మూలసమస్యల జోలికేపోరు. వాస్తవిక సమస్యలను మర్చిపోతూ పలాయన వాదులుగ జీవితాని కానంతదూరంలో ముడుచుకని కూచుంటారు.

వీరిలో కొందరు అభివృద్ధినే ఎదిరిస్తారు. మరికొందరు అభివృద్ధి నిరోధకులే. అందుచేతనే పలాయనతత్వాన్నే తమ పరుగుగ స్వీకరించి ఎందుకూ కొరగాని రచనల కుపక్రమిస్తారు.

అప్పారావుగారు తాత్వికుడు. వాస్తవికవాది. ఆయన చూపు అతి నిశితమైనది. ఈ కావ్యంలోనే పండితులను హెచ్చరిస్తూ, లోకచుక్క నుద్దేశించి ఆయన అంటున్నారు:

"కవులకల్పన కలిమి నెన్నో
వన్నెచిన్నెలు గాంచు వస్తువు
లందు వెర్రి పురాణగాథలు
నమ్మజెల్లునె పండితుల్"

మన దేశంలో భౌతికతత్వవాదులని పాశ్చాత్యులందరికీ పేరుపెట్టి వారి అసలు సిసలు నిజాయితీనికూడా, ఏవగించుకోవడం ఒకవిధమైన దురలవాటుగా పరిణమించింది. వారి విద్యావిధానాలలోని, సాహిత్యంలోని, విజ్ఞానతత్వంలోని మూల సూత్రాలు ఎంత మంచివయినా వారి సంస్కృతి నుంచి ఆశియా దేశీయులు గ్రహించవలసినది ఎంత వున్నా, పాశ్చాత్యుల సాహిత్యాది కళలను దుమ్మెత్తిపోయడం, ప్రతీ నూతన విజ్ఞాన స్వరూపమూ, అన్వేషణా ఏనాడో వేదంలోనే

వుందని అనవసరంగా ప్రాచ్యసంస్కృతిని వెనక వేసుకురావడమూ, ఆధునికులను తూర్పారబట్టడమూ ఏనాటినుంచో మన దేశానికొక అలవాటు. పాతకొత్తలను ఆమూలాగ్రంగా వీక్షించి, వాటిలోని ఊకను ఊది, పాతకొత్తల మేలుకలయికను చేసి చూపించినది అప్పారావు పంతులుగారే.

పాతపద్ధతులలో వున్న అసహ్యాకర విధానాలను తీవ్రంగా ఆనాడు నిరసించడమంటే అభివృద్ధి నిరోధకశక్తులమీద ఎంత కత్తికట్టవలసి వచ్చిందో మనం ఊహించుకోలేము. ఈనాడు మన ఆత్మల్లో కాకపోయినా, మన పెదవులమీద వర్ణవ్యవస్థను దుమ్మెత్తి పోయవచ్చును కాని ఆనాడు ఈ వాదనకంతగా బలం యేమీ లేదు. అల్లాంటి పరిస్థితిలో అప్పారావుగారు, వర్ణవ్యవస్థపై ముట్టడి కొనసాగించారు. కులతత్వాలపై కదనశంఖం పూరించారు. జ్ఞానమొక్కటే మానవులకు తరణోపాయమని ఆయన విశ్వాసం. అదే లోకకల్యాణ హేతువని ఆయన నమ్మకం.

ఈ కావ్యంలో సంఘసంస్కరణల పద్ధతుల నవలంబించిన భర్తను పూర్వాచార పరాయణురాలగు భార్యనుంచి యెంత వత్తిడి వస్తున్నది కవి చిత్రిస్తారు. భార్యకు కలిగే అవమానాన్ని కవి యీ మాటల్లో చెప్తున్నారు.

“తోటికోడలు దెప్పె; పోనీ;
సాటివా రోదార్చె; పోనీ
మాటలాడక చూచి నవ్వెడి
మగువకేమందున్ ”

ఈ ఆఖరి చరణంలో కవి మగువ మనస్సును పూర్ణంగా అవగతం చేసుకున్నారు. మన ప్రబంధాలలోని నాటకాల్లోని పాత్రలు సజీవములే కావు. సజీవ పాత్రలు పండితుల కవగాహన కాకుంటే పోనీ; ఆయనకది ఒక లెక్కలోనికి రాదు.

“కొయ్యబొమ్మలె మెచ్చు కళ్ళకు
కోమలుల సోరెక్కునా ”

ప్రయోజనాన్ని లక్షిస్తూ కళాసృష్టి చేయడం అతి మేధావులకుకాని అలవడదు.

ప్రకృతిసౌందర్యాన్ని అప్పారావుగారు చక్కగా పరిశీలించారు కనుకనే “కాసరెనో యన గాలివీచెను” అంటారు ఒకచోట. ప్రకృతి నతిరమ్యంగా అవలోకిస్తూ సాధారణ కవులవలె కాక “ఎక్కడనో ఒక చెట్టుమాటున నొక్క కోకిల పలుకసాగెను” అంటారు.

“పుస్తకంబులలోని మాటలు
విస్తరించుచు ననుభవంబుల
తత్త్వమెరుగక, శుకములగుదురు
ఒట్టి శాస్త్రజ్ఞుల్ ”

అనే ఆయన మాటల్లోని లోతు జాగ్రత్తగా పరిశీలింపదగింది. అనుభవం లేని పుస్తక పాండిత్యం గత కొన్ని శతాబ్దాలుగా తెలుగు సాహిత్యాన్ని ఏవిధంగా చేసిందో మనం మర్చిపోలేము కదా!

అర్థంలేని కర్మసిద్ధాంతాలూ, మోక్షద్వారాలూ వాస్తవిక జీవితాలకు నల్లమందు పెట్టాయి. వీరికి మానసంగల వ్యక్తులు ఏ పనీ తెగించి చేయలేరు. అట్టి వేదాంతమే విపరీతంగా పెరిగి అతి సాధారణజీవితపు సమస్యలను కూడా, కర్మతో ముడిపెట్టి

నానా ధ్వంసం చేస్తున్నది. ఈరీతి వేదాంతానికి అప్పారావుగారు విముఖులై దీనికి తిరోగమనం పట్టించారు.

" ఎప్పటికి సనుభూత మెద్దియొ
అప్పటికి నది నిక్కువంబే
ఎప్పుడో లోకంబు కల్లగు
ననుట యిపుడెట్లో "

అనే ఆయన వాక్యాలకు అద్వైతులాగ్రహాలు కారామరి!

ఇక కన్యక అనే కావ్యాన్ని చర్చిస్తాము. పట్టుమేలే ఒకానొక రాజును సెట్టికూతురు ధిక్కరిస్తుంది.

ఈ కావ్యంలోని పాత్రల పోషణను గురించే ఒక వ్యాసం రాయవచ్చును. మానవులకు కావలసింది పరువూ ప్రతిష్ఠలే కాని డబ్బు కాదని ఆయనాదేశం. అసమాన పౌరుషాన్ని ప్రదర్శించే సెట్టికూతురు మరువతగనిది.

తన శరీరాన్ని త్యాగం చేసి, తన జాతంతా పౌరుషవంతంగా జీవించాలని ఆమె సందేశాన్నిస్తుంది. ప్రతీ వ్యక్తికీ విద్య కావాలి. పౌరుషం కావాలి. ఈ రెండూ లేనిజాతి ఏదైనా కానీయండి యిక్కట్లు తప్పవు.

డామన్ పిథియాస్ ఒక యవనగాథ. జగత్ప్రఖ్యాతిగల ఒక యవనగాథను పరిగ్రహించి, మహోన్నతమైన కళా చాతుర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. శామానుద్వీప వర్ణన మత్యంత హృదయరంజకము. కథా కథన మతి లలితంగానూ, సహజంగానూ పరుగులు తీస్తూ సాగుతుంది. ఆఖ్యాన కావ్యాల నీపద్ధతిలో రచించడానికి కీయునయే ప్రప్రథములు.

వాడుకభాషలో రచన సాగించడమే ఒక వైశిష్ట్యం. సంభాషణకుగల నడకకు పద్యనడకకు చాలా సన్నిహితంగా వచ్చి ఒక వింత శోభను కలిగిస్తూ, "కాసులు" అనే కావ్యం పరుగులు పెడుతున్నది. ఈ రీతి కవిత్వరచనను పాశ్చాత్యులు గమనిస్తే గర్వించితీరుతారు. పద్య నడక, సంభాషణ నడకకు వొప్పి సర్వాంగశోభితంగా వుండేకావ్యాలాంగ్లంలో చాలా వున్నా, ఆంధ్ర సాహిత్యంలో చాలా అరుదు. ప్రేమకుగల మూల్యాలను సరితూచే పడికట్టురాళ్లు "కాసుల"న్న గేయపాదాలు.

లవణరాజుకథ అస్పృశ్యతను నిర్మూలించ ప్రయత్నించే కావ్యం. సమాజపు యిరుకు గొందుల్లో అట్టడుగున పడివున్న హరిజనస్త్రీని ఒకానొక రాజుకు యిచ్చి కవి వివాహమహోత్సవాన్ని చేస్తున్నారు. ప్రేమకు హృదయమే మూలమని, మతాలు కావని ఆయన మతం. ఇందులో కూడా ప్రకృతిసౌందర్యవర్ణన కళాభాసితమే.

"తూర్పుకొండలు గొడుగులెత్తెను
చామరంబులు నిడిపె"

"తాటివనమున నాగి చంద్రుడు
తాను చెవియొగ్గె"

మానవచైతన్యం ఎప్పుడూ ఒకేలాగ బిగ్గవేసుకొని కూచోక, పరిస్థితులను బట్టి కలుగుతూ వుంటుందని ఆయన విశ్వాసం. అందుకనే ఆయన మానవానుభవాలనే ప్రమాణాలుగ స్వీకరించడం.

పూర్ణమ్మలాంటి కావ్యం యింతవరకూ తెలుగుసాహిత్యంలో రానేలేదనిచెప్పడం ఏమీ అతిశయోక్తి కాదు. మానవత్వంతో ప్రకృతి పెనవేసుకొని పోతూ, కరుణ రసాన్ని అడుగడుగునా అందిస్తున్న దీ కావ్యం.

పండిన దానిమ్మపండు విచ్చినట్లు యీ కావ్యాన్ని చదువుతున్నంతసేపూ హృదయం విచ్చిపోతూనే వుంటుంది. కావ్యం చదివాక, ఎన్నడూ మరవలేని జీవితానుభవాలను మన హృదయాలపై ముద్రలు కొడుతుంది. పిల్లలూ, స్త్రీలూ ఈ గేయం పాడుతూంటే మరీ రాణింపుకు వస్తుంది. నడకలో భాషలో భావంలో నూతనత్వాన్ని లక్షిస్తూ స్త్రీలపాటలకు దగ్గరగా దీన్ని కవి రచించారు.

ముసలివాళ్ళకు చిన్నపిల్లలనిచ్చి వివాహంచేయడం, విక్రయించడం ఆనాటి సాంఘికాచారమే కదా! దీన్ని యింత తీవ్రంగా సాహిత్యంలో నిరసించినది ఈయనతప్ప యింకొకరు యేరీ? పుత్తడిబొమ్మ పూర్ణమ్మ కొలనులో పడేటప్పుడు పిన్నలకూ పెద్దలకూ చెప్పినమాటలు మనరి ఎన్నటికీ మరువలేము.

" నలుగురు కూచుని నవ్వేవేళల
నా పేరొకతరి తలవండి
మీమీ కన్నబిడ్డలకు
నా పేరొకతరి ఇవ్వండి "

ఇది చదువుతున్నప్పుడు మన కంఠం బరువెక్కుతుంది. గొంతుకతడి ఆరిపోతుంది. బలబలకారే పూర్ణమ్మ కన్నీరూ మనకన్నీరు కలసి చెక్కిళ్ళను తడుపుతాయి కవి, పూర్ణమ్మ ఆత్మహత్య చేసుకుందని, వాచ్యంగా మనకు చెప్పడు. అది కేవలంధ్వని. ప్రకృతిలో పూర్ణమ్మను మిళితం చేస్తున్నాడు కవి.

" కన్నుల కాంతులు కలువల చేరెను
మేలిమి జేరెను మేనిపసల్
హంసల జేరెను నడకల బెడగులు
దుర్గను చేరెను పూర్ణమ్మ "

కలువపూవుల్లో పూర్ణమ్మ కాంతులు లీనమవడం, ప్రకృతిలోనే ఆమె కలిసిపోవడం ఎంతో కరుణరసాన్ని జనింపచేస్తున్నవి. ఇంతకంటే ఏ వృత్తమకవీ ఇంత స్వల్పవ్యవధిలో కరుణరసాన్ని అత్యున్నత స్థాయికి తీసుకొని వెళ్ళలేదు!

మనిషి అన్న కావ్యం విగ్రహారాధనను తీవ్రంగా ఖండిస్తున్నది. దేశభక్తి గొప్ప జాతీయగీతం. దీన్ని సమూహ గానం చేస్తూంటే గుండె దద్దరిల్లుతుంది. అప్పారాయ వర్ధంతినాడు నాజర్ దళం దీన్ని గానం చేస్తున్నంతసేపూ హృదయం స్పందించిపోతూనే వచ్చింది. ఎంతమంది కలసిపాడితే అంత సొగసుగా వుంటుం దీ గేయం. భావాలన్నీ నేటికీ ఆనాటికీ ఎన్నటికీ నవీనాలే! దేశభక్తి అన్న గేయం, ఆంధ్రులకు జాతీయగీతం కావాలి. ఇంత చక్కని జాతీయగీతం చాలా అరుదుగా వివిధదేశ సాహిత్యంలో గోచరిస్తున్నది. మానవులంతాకలిసి ప్రకృతిని జయించే కృషిలోనే కవిత ఆవిర్భవించింది. కాని నేడది సమూహ జీవితానికి చాలాదూరం అవుతున్నది. సమూహగానం, కవిత్వం ప్రజ లలవరచుకోవలసి వుంది.

కవితాస్వాష్టవానికీ, సమాజాభివృద్ధికీ యీ పద్ధతి ఎంతో ఉపకరిస్తుంది.

మానవ మూల్యాలూ, జీవిత విలువలూ గ్రహించనిదే మనం కవిత్వం చెప్పడానికి అర్హులం కాము. అలా కానినాడు కవిగారంటున్నట్టు మనం చిట్టచివరకు

"నేల ప్రాకిన చెట్లు పళ్ళను
విలువ లెరుగక పాదరక్షల
మట్టిలో"

అని విచారింపవలసి వస్తుంది

తలస్పర్శంగా అప్పారావుగారి రచనలను సమీక్ష చేయడానికి ఇక్కడ స్థలం లేదు. కనుక కొద్దిగా కథానికలను గురించి చెప్పి ముగిస్తాను.

"మీ పేరేమిటి" అన్న కథ విప్లవాత్మకమైనది. హిందూమతకళ్మలాన్ని రోడ్డు కీడ్చి క్షాళన చేస్తున్నది. ఇలాటి ఆత్మశోధన మనకీనాడు ఎంతో అవసరం. మనం ఎవరికి వాళ్ళం ఆత్మవిమర్శ చేసుకోవలసిన సమయం ఆసన్నమయింది.

సాధారణ స్త్రీ అయిన నాంచారమ్మ తగు మనుష్యుల మనుకునే వారందరికంటే బుద్ధికుశలతను ప్రదర్శిస్తుంది. మతాచార్యులను హడలెత్తించిన గుండం తొక్కడమనే కార్యాన్ని ఒక దూదేకులసాయిబు చేసి చూపిస్తాడు శైవ వైష్ణవ మతతత్వాలపై ఈ కథ ఎత్తిన ధ్వజం మెచ్చుకోతగింది. ఆనాటి గొంపిలోపడ్డ మనుష్యులను పైకి దీస్తూ నవ్యతాలుగా మతాలను వెక్కిరిస్తూ పురోగామి అయిన గురజాడ అప్పారావుగారు చేయనిదేమీ లేదు.

వ్యంగ్యవైభవాన్ని వెదజల్లుతూ, చెప్పిన శ్రీరంగనీతులూ, దూరేవి దొమ్మరిగుడిసెలూ అనే భక్తాగ్రేసరుల అసలు నిజాయితీని ఎదుర్కొంటూ అర్చకుల రాత్రి విహారాలనూ ప్రజల మూఢనమ్మకాలనూ చూపిస్తూ సంఘగోతను పరిహసిస్తున్నాడు కవి.

నామమాత్ర రాజకీయ స్వాతంత్ర్యమే మనలక్ష్యం కారాదు. ప్రస్తుతం మతదురహంకారం జాతిలో ప్రవేశిస్తున్నది. గాంధీ మహాత్ముణ్ణే బతకనివ్వని ఈ మతోన్మాదం సాధారణ అమాయిక ప్రజలను జీవించనిస్తుందన్న హామీ ఎక్కడ? మణిపూసలవంటి యువకులు మతోన్మాద ధోరణిలో పడిపోతున్న ఈ సమయంలో కవులం, నేడే సాంఘికార్థిక మతభేదాలను నిరసిస్తూ నిర్మూలిస్తూ రచనలను సాగించాలి. ఇందుకు ఆవేశాన్నీ మార్గాన్నీ అందిస్తున్న తెలుగుకవి గురజాడ అప్పారావు గారు!

"నవసమాజ నిర్మాణంకోసం అభ్యుదయ రచయితలు కృషిచేయాలి!"

డాక్టర్ ముల్క్‌రాజ్ ఆనంద్ ప్రారంభోపన్యాసం

కేరళరాష్ట్ర అభ్యుదయ రచయితల మహాసభ జనవరి 24, 25 తేదీలలో త్రిచూర్‌లో మహావైభవంగా జరిగింది. ప్రొఫెసర్ యం.పి. పాల్ అధ్యక్షతవహించారు.

ప్రఖ్యాత అభ్యుదయరచయిత, "కూలీ" "అస్పృశ్యుడు" మొదలైన ప్రపంచ ప్రసిద్ధ నవలలు రచించిన డాక్టర్ ముల్క్‌రాజ్ ఆనంద్ ప్రారంభోపన్యాసం చేశారు.

ఈ మహాసభలో కేరళరాష్ట్రంలోని ప్రసిద్ధకవులు, కథకులు, నవలాకారులు, జర్నలిస్టులు, శాస్త్ర, వైదాంతిక విజ్ఞానగ్రంథాలను రచించినవారు అనేకమంది రచయితలు ఉత్సాహంతో పాల్గొన్నారు. తిరుచూరులోని విద్యావంతులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు సభలకుహాజరై శ్రద్ధగా ఆలకించారు. అభినందించారు.

డాక్టర్ ఆనంద్ ఉపన్యసిస్తూ, ప్రపంచం నేడు రెండు పక్షాలుగా విడిపోయిందనీ, అమెరికా తనునిర్మిస్తున్న ఆటంబాంబు మొదలైన మారణాస్త్రాలతో ప్రపంచ సంస్కృతికీ, మానవాభ్యుదయానికీ ప్రమాదకరంగా పరిణమించి హిట్లర్‌వలెనే ప్రపంచాన్ని మరొక మారణహోమం చెయ్యటానికి పూనుకొంటున్నదనీ, అన్నారు. ఈ పక్షాన్నే బ్రిటిష్ సామ్రాజ్యవాదులు, ఫ్రాన్సులో డిగాలీ, చైనాలో జంగ్‌కైషేక్ కూడా బలపరుస్తున్నారని వివరించారు.

రెండవపక్షానవున్న సోవియట్ యూనియన్, తాను స్వయంగా దర్శించివచ్చిన తూర్పు యూరప్ దేశాలు ఎలా బానిస ప్రజలకు అండగా నిలబడుతున్నాయో తెలియజేశారు. ఈ ప్రపంచపరి

వ్యాప్తమైన సంఘర్షణలో అభ్యుదయ రచయితధ్యేయం సుస్పష్టమైనదనీ యుద్ధాన్ని పురికొల్పే స్వార్థపరులను ప్రతిఘటించి శాంతి, అభ్యుదయాలకై ప్రజలతో కలిసి పోరాడాలనీ సందేశమిచ్చారు.

అభ్యుదయ రచయితలు పురా సంస్కృతినిగౌరవిస్తూనేదాస్యంతో నిద్రాణమైయున్న భారత జాతిని పునరుజ్జీవింప చెయ్యాలి గాని, గతాన్నే తిరిగి నిర్మించే ఛాందస వాదాలకు లొంగిపోరాదన్నారు. అభ్యుదయ రచయితలు ప్రజల పక్షాన నిలబడి, ప్రజలందరికీ కూడూ, గుడ్డా లభించే నవసమాజ నిర్మాణంకోసం కృషిచెయ్యాలనీ, ఆ ఆశయం సఫలీకృతమైననాడు గాని రచయితలు ప్రజల శోక గాథలనువిడిచి, ఆనందోత్సవాలను గురించి వ్రాయలేరనీ అన్నారు.

డాక్టర్ ఆనంద్ ఉపన్యాసం లోని రాజకీయవాదం, సంస్కృతికీ రాజకీయాలకూ ఎంత సన్నిహిత సంబంధమున్నదో వివరించింది. అభ్యుదయ రచయితల ఉద్యమం ఎప్పుడూ "కమ్యూనిస్టుప్రాబల్యం" కింద లేదనీ. సంస్కృతికోసం జరిపే పోరాటంలో కమ్యూనిస్టులు ప్రథమశ్రేణిలో నిలబడటం వల్లనే కమ్యూనిస్టులు అభ్యుదయ రచయితల ఉద్యమంలో వున్నారనీ డాక్టర్ ఆనంద్ స్పష్టపరిచారు.

ఆయనఉపన్యాసంలో కాశ్మీర్ స్వాతంత్ర్యపోరాటం, దేశవిభజన, భయంకరమైన పంజాబ్ మతకలహాలు, సంస్థానాధీశుల నిరంకుశ ప్రభుత్వాలు, సర్దార్ పటేల్ అధికారంకింద మృగ్యమైన పౌర హక్కులు మొదలైన అనేక సమస్యలు సాకల్యంగాచర్చించారు.

మహాసభలో ఆహ్వాన సంఘాధ్యక్షుడు ప్రొఫెసర్ ముందసెరీ, ప్రసిద్ధకవి జి. శంకర కురుప్, మార్క్సిజాన్ని గూర్చి అనేక గ్రంథాలు వ్రాసిన కె. దామోదరన్ మొదలైనవారు ఉపన్యసించారు.

— ప్రణాళిక —

ప్రణాళిక - ఉపసంఘంచే జనవరి 24వ తేదీనే తయారుచేయబడిన చిత్తు ప్రణాళికను గూర్చి రచయితలంతా సమావేశమై దీర్ఘంగా చర్చించారు. ఇందులో ప్రధానంగా పి. భాస్కరన్ డి. యం. పట్టేకాట్ మొదలైనవారు పాల్గొన్నారు.

ప్రాణ ప్రతిజ్ఞ

మూలం
అషిత్ సేన్

★

అనుకృతి:
శ్రీ సూరి

పరధ్యానంగా ఆలోచిస్తూ కూర్చున్నాడు గఫూర్. హలిమ చనిపోయేటప్పుడు "నాకోసం బెంగపెట్టుకోవద్దు. కాని పిల్లలనయినా ఏలాగోఅలా బ్రతికించండి" అని చెప్పిపోయింది. మృత్యుపథగామిని అయిన ఆమె అంతిమ వాంఛను కూడా నెరవేర్చలేకపోయాడు గఫూర్. ఆ తర్వాత కొద్దిరోజులకే పిల్లలు కూడా చనిపోయారు.

జబ్బులూ అలాంటివి కూడా ఏమీ వచ్చిపోలేదు వాళ్లు. పట్టెడు మెతుకులు— పట్టెడు మెతుకులు కరవై భార్యా, పిల్లలూ చనిపోయారు. ఎంత సహించరాని ఆకలి మంట అది! అబ్బ!

విశాలమయిన హలిమ నేత్రాల్లోంచి ఒక్క కన్నీటిచుక్క అయినా రాలలేదు. ముఖంలోనూ, కళ్ళల్లోనూ సంతోషాన్ని వెలిబుచ్చటానికే ప్రయత్నించింది హలిమ. పాలికాపు భార్య అయి ఉండి ఆకలి బాధకు కన్నీళ్లు కార్చుతుందా! ఎంతసిగ్గుచేటు!

కాని పిల్లలు మాత్రం అమాయకుల్లాగా నానా హంగామా చేసేవాళ్ళు. చిన్న పిల్లలు కనుక ఒకొక్కప్పుడు ఆకలికి ఆగలేక హద్దుమీరి అన్నం కావాలో అని గోలపెట్టేవాళ్ళు.

కాని మరి గఫూరో? విశాలమయిన పంటకళ్లాలకేసి అసహాయదృష్టులను పరపుతూ కూర్చునేవాడు.

అటుగో అటు కనుచూపు మేరవరకూ ఉన్న పొలాల్లో గఫూర్ తన చేతుల మీదుగా బంగారాన్ని పండించాడు. ఆ బంగారంలాంటి పంట అంతా కోయించి నూర్పించి స్వయంగా బళ్ళకెత్తించి భూస్వామి ఇంటికి తోలిపెట్టాడు. పంట కళ్ళంలో తనకు అన్నో యిన్నో మిగిలిన గింజలుకూడా వడ్డీక్రింద భూస్వామికి అక్కడే చెల్లుపెట్టాడు.

నిజానికి భూస్వామి దరిద్రంతో ఏమీ కొట్టుకుపోవటంలేదు. అతడు తలచుకుంటే గుప్పెడు మెతుకులు సులభంగానే పెట్టగలడు. భూస్వామి గరిసెలోని గుప్పెడు గింజలకోసం రెండు ప్రాణాలు పోయినంత మాత్రాన యీ ప్రపంచంలో ఎవరికేం నష్టం? ఏమయినప్పటికీ అతడికి ఒక్క గింజయినా రాలలేదు. ప్రతిమాలటం,

ప్రాధేయపడటం-అన్నీ వ్యర్థమయినాయి. భగవంతుడికి కూడా సామాన్య మానవుల ప్రార్థన సులభంగా చెవినిపడదు. భూస్వామే గాని పాలికాపుకు దేవుడు !!!

— ఇలా ఆలోచిస్తూ ఆలోచిస్తూ వుండగానే నిద్రమత్తు వచ్చింది గఫూర్‌కు. ఆ మత్తు నిశ్చింతమయిన సుఖనిద్రను పట్టనీయలేదు - అలసిపోయిన అతడి శరీరానికి ఆ నిద్రమత్తులో తుదీ మొదలూ లేని పీడ కలలు రాసాగినాయి.

—"నువ్వే చంపావు మమ్మల్ని. పట్టెడన్నం పెట్టలేనివాడివి ఎందుకు పుట్టించావు అసలు? మమ్మల్నే - మా అమ్మనీ కూడా నువ్వే చంపావు. నీకు సాహసం లేదు. అంచేత అదంతా దురదృష్టం అని చెప్పి తప్పించుకోవాలని చూస్తావు. భగవంతుడు కాదు పండించింది పంటను; నువ్వే ఏ చేతులతో పండించావో ఆ చేతులతోనే కొంత ధాన్యాన్ని యెందుకు దాచుకోలేదు? నువ్వే చంపేశావు మమ్మల్ని. ఇప్పుడు నువ్వు సుఖంగా నిద్రపోవటానికి వీల్లేదు. మమ్మల్ని యెందుకు చంపావో జవాబు చెప్పితీరాలి. ఎందుకు చంపావు?... ఎందుకు చంపావు?..."

నిద్రమత్తులో ఉన్న గఫూర్ కంఠం నుంచి కొన్ని మాటలేవో అస్పష్టంగా వెలువడ్డాయి. వెంటనే గాభరాగా లేచి కూర్చున్నాడు. శరీరమంతా విరగ్గొట్టినట్లుంది గుండె ఎందుకనో దడదడ కొట్టుకో సాగింది.

అదేమిటి అలా అన్నారు? గఫూరే చంపాడా వాళ్ళను? వాళ్ళ చావుకు గఫూరే సంజాయిషీ చెప్పుకోవాలా? కాని గఫూరు కయినా చెప్పుకునేందుకు మాత్రం ఏముంది? అయినా ఏదో చెబుదామని అనుకుంటూండగానే నిద్ర మెలుకువ వచ్చింది. ఆ ప్రశ్నించినవాళ్ళ ఆకారాలు శూన్యంలో లీనమయిపోయినాయి.

నిజానికి గఫూర్ మాత్రం ఏమని చెప్పగలిగేవాడు? తనమీద ఉన్న అభియోగం అబద్ధమేమీ కాదు. నిజంగానే గఫూర్ చాటుగా ధాన్యమేమీ దాచుకోలేకపోయాడు. కష్టపడి రక్తం చెమట ఓడ్చి తాను పండించిన ధాన్యంమీద తనకేమీ అధికారం లేదూ! తన కలాంటి వాంఛ ఉన్నట్లయితే భార్యా పిల్లలు చనిపోయేవారు కాదుగదా? తన ప్రియజనుల ప్రాణాలకన్న భూస్వామి ధాన్యానికే విలువ ఎక్కువా? భూస్వామి దేవుడి కాళ్ళమీద పడి వృధాగా అర్థించటం— లేనా ఆ లోకంలోని దేముడి అనుగ్రహాన్ని అర్థించి తల బాదుకోవటం— ఇవేనా జీవితంలో పరమ సత్యాలు? ఈ సత్యాల్ని అంగీకరించకపోతే అక్రమంగా ప్రవర్తించటమే ఔతుందా నిజంగా?

ప్రశ్నల మీద ప్రశ్నలు బయలుదేరి అతడి మనస్సును చీకాకుపరచసాగినాయి. స్తిమితమైన గఫూర్ దృష్టిపథంలో అతడి పిల్లల ఆకలిమంటలు ఇంకా ఆరిపోనట్లు కన్పించ సాగాయి. అప్రయత్నంగా గఫూర్ పండ్లు పటపటలాడినాయి. నెమరుకణతలమీది నరాలు అస్వాభావికంగా పైకి ఉబ్బినాయి. చిరిగిపోయిన

గగ్గులోంచి హఠాత్తుగా చేతులు పైకి లాక్కొని పిడికిళ్ళు బిగించాడు

...   .

ఏడాది తిరిగింది. ఈసారి గఫూర్ మండల్ అప్పు తీసుకోటానికి రాలేదు. అబద్ధపు కేసు బనాయించి భూస్వామి మయీనుద్దీన్ అతడి నివేశనస్థలాన్ని భుక్తపరచుకున్నా గఫూర్ ఏమీ మాట్లాడనూ లేదు— పోట్లాడనూ లేదు.

మయీనుద్దీన్ మాత్రం తానింత ఘనమైన కార్యం చేశానుకదా అని మహా సంతోషించాడు. అందులో ఆశ్చర్యమేముంది? సహజమే అది. కాని ఊళ్లో వాళ్ళంతా గఫూర్ లాగా మంచివాళ్లయితేగా!!

అస్తమించబోతున్న సూర్యకాంతిలో గ్రామమంతా ధూళిధూసరితమైనట్లుంది. దేవేశ వర్మగారి వీధిసావడిలో అందరూ సమావేశమయినారు. రక్తమాంసాదులు యెండిపోయి బక్కచిక్కి ఉన్న వారి ముఖాల్లోని ప్రతి రేఖలోనూ అణగిఉన్న ఉద్వేగం - కనిపిస్తోనేవుంది. హుక్కా, బీడీ, చుట్టలపొగలో కూడా ఆ ఉత్తేజన మాత్రం కప్పించకుండా పోలేదు. 'ఈసారితో మనకు సర్వమూ పోతుందనుకుంటూ' అని బిగ్గరగా కేకెట్టాడు.

"ఇలా నిరాశపడికూర్చుంటే చివరికెటూ పోనేపోతుంది"

"అంతకన్న ఏమిటీ చెయ్యటం మరి ఇంక? భూస్వామి దగ్గరకెళ్ళి మొరపెట్టుకుని యెడ్లనూ - నా గళ్ళనూ తాకట్టు పెడితే అప్పు ఇస్తాడు. మర్యాదగా అలా తీసుకెళ్ళి తాకట్టుపెడతామేఅనుకుందాం; వచ్చేసంవత్సరమయినా ఈ అప్పు తీరిపోతుందో - పోదో యెవరు చెప్పగలరు? ఇలాంటి పరిస్థితుల్లో నిరాశ చెందటంకన్న గత్యంతరమేముంది?"

"ఉందోయ్ - ఉపాయం ఉందిదీనికి. అది తెలుసుకోలేకపోబట్టే నిరుడు — ధాన్యం దాచుకోలేక నా భార్యాపిల్లల శవాలమీద వృధాగా కన్నీరుకార్చాను."

"అయితే ఏమిటో చెప్పాలి ఉపాయం"

"ఉపాయమా?" గఫూర్ ముఖంలోని నరాలు ఉబికాయి. పిడికిలి గట్టిగా బిగించాడు—"జబర్దస్తీగా ధాన్యాన్ని దాచుకోవడమే ఉపాయం" అన్నాడు.

"జబర్దస్తీగా లాక్కోవటమా?"— చటుక్కున కళ్లు మిరుమిట్లు కొలిపినట్లయింది మతిశేఖర్‌కు. కళ్లు తెరచుకుని గఫూర్ కేసి చూస్తూ ఊరుకున్నాడు.

"ఏమిటీ - దీనికి ఒప్పుకున్నట్లేనా చెప్పండి?"

"కాని యెలా జబర్దస్తీచెయ్యటం—? అంత శక్తి ఏదీ మనకు?"

"పంట పండించేందుకు ఎక్కడినుంచి వచ్చింది శక్తి? పిల్లల్ని పుట్టించేందుకు ఎక్కడినుంచి వచ్చింది శక్తి? ఆశక్తినే ధాన్యాన్ని జబర్దస్తీగా లాక్కోవటంలో కూడా వినియోగించుకోండి"

"కాని భూస్వాములంటే తలితండ్రుల లాంటి వాళ్లు కదా?"

"ఒప్పుకోను మతీ! ఆమాట ఒప్పుకోను నేను"—అణచుకున్న ఉద్రేకాన్ని వెళ్ళగక్కాడు గఫూర్. "బిడ్డల నోటి

ముందరి గ్రాసాన్ని లాక్కునేవాళ్ళని కూడా తల్లితండ్రులంటే ప్రపంచంలో తలితండ్రుల నందర్నీ అవమానపరచినట్లవుతుంది. అదీగాక చస్తే నువ్వు చావు. కాని నీ భార్యాపిల్లల్ని చంపే అధికారంమాత్రం నీకులేదు. అలాంటప్పుడు ముందువాళ్ళకు తగిన ఏర్పాట్లు చెయ్యవద్దూ?—"

భార్యా పిల్లలు! తిండి లేక పీక్కుపోయిన భార్యా పిల్లల— అయిదుగురి— ముఖాలూ మతిశేఖ్ కు కళ్ళకు కట్టినట్లు కన్పించాయి. అతడి భార్య చాంద్ బీబీ— నిజంగా చంద్రబింబం లాగా ఆమె ముఖం ఎంతో అందంగా ఉండేది. ఆ ముఖంలో నవ్వెప్పుడూ తొణికిసలాడుతూ ఉండేది. కాని పీక్కుపోయిన ఆమె ముఖంలోని నవ్వు మతిశేఖ్ అసామర్థ్యాన్ని ఎత్తిపొడుస్తూ కొరడాతో కొట్టినట్లయింది. పిల్లలు నలుగురూ ప్రపంచమంటే ఏమిటో యెరుగరు. వాళ్ళుకూడా ఆ ఆకలిబాధను అలవాటించి మెలికలు తిరిగిపోయారు నిజమే వారి ఆకలికి ఇలాంటి అవమానం చెయ్యటానికి ఏ మధికారముంది మతిశేఖ్ కు?

మతిశేఖ్ కు ముచ్చెమటలు పోసినాయి చెక్కిళ్ళమీద. నెట్టూర్పులు తొందరగా రాసాగాయి. చెమటబిందువులు అతడి శరీరంలో నిర్జీవత్వాన్ని బైటికి ప్రవహింపచేసినాయి. తర్జనితో ఆ చెమట తుడిచి విసుగ్గా నేలకేసి విదిలించసాగాడు.

"మంచిది. నీకు సాయంగా నేనూ ఉంటాను. ఒకవేళ చావవలసి వస్తే, చావవలసిన విధంగానే చనిపోదాం."

గఫూర్ వజ్రపుపిడికిలి శిథిలం కాసాగింది. ముఖంలోని పైకి ఉబికిన కండరాలన్నీ మళ్ళీ యథాస్థానానికి చేరుకున్నాయి. ఆ చిక్కిపోయిన చెక్కిళ్లమీద నవ్వు రేఖలు కన్పించసాగాయి. ఆరిపోయిన బీడీ మళ్ళీ వెలిగించుకుని లేచి నిలబడ్డాడు. మసక వెలుతురులో మెల్లిగా ఇంటికిబయలుదేరి వెళ్ళిపోయాడు.

... ...

పంట కోతకు వచ్చింది. ధాన్యం ఫస్టు బంగారం రంగుమీద ఉంది. మయీనుద్దీన్ కళ్ళకి బంగారపు కాంతులు మిలమిలలాడాయి. కొత్తగాదె ఒకటి కట్టించక పోతే వీలులేదు.

"మాస్టారేం యతీన్? కొత్త గాదె కట్టించవోయ్! కట్టించు! కట్టించకపోతే తీరా చివరకి ధాన్యం పోయటానికి చోటు ఉండదు. ఈ దౌర్భాగ్యులు ఈసారి మన బంగారంలాంటి పంట అంతా వాళ్ల పొట్ట నెట్టుకుంటారు. తెలుసా?"

"నిజం. క్రితం సారి కరువు రావటం కూడా మంచిదే అయింది తమ భాగం అడగటానికి ఏమీ లేకపోయింది వాళ్ళకు"

—"అరే! అంతమాత్రాన ఏమయినట్లు?" మయీనుద్దీన్ పెదవులమీద విషపు నవ్వు వ్యక్తమయింది.

—అదృష్టవశాత్తూ ఇక్కడ 'లా' తెలిసినవాళ్లెవరూ లేరు ఒకటిన్నర రెట్లో రెండురెట్లో ఎంతయినా పెంచు. ఆ అప్పు ఇచ్చిన ఆ మొత్తాన్ని, వాళ్లనీ ముప్పు తిప్పలు పెట్టితీరాలి.

"అంతే చేయాలి. ఆ దౌర్భాగ్యులకు నిజంగా అంతపని జరిగితీరాలి. ఖగేన్

గాడితో—నీ కూతుర్ను మా దగ్గరకు పంపించు—నువ్వు ఇక ధాన్యం సంగతి ఆలోచించనుకూడా ఆలోచించ నవసరంలేదని—చెప్పానుకూడా. అలా చెయ్యలేదు. పాలికి పాలందుకున్న దౌర్భాగ్యుడు! వాడు పరువు మర్యాదలమీద మాట్లాడటం! బకాయి ధాన్యం అంటే అది ఎంత మోయలేని బరువో ఇప్పుడు తెలుస్తుంది. భూస్వామిగాదెలోకి ధాన్యం తీసుకువచ్చి చేర్చి కూతురి మాన మర్యాదలను కాపాడుతాడు కాబోలు మహా!"

వెంటనే ధాన్యంవిషయమై ఆచూకీ తీస్తున్నట్లు పోజుపెట్టి మాట్లాడుతూ యతీన్‌సర్కార్ మయీనుద్దీన్ చేతిలో నుంచి హుక్కా అందుకుని తన నోటిదగ్గిర పెట్టుకున్నాడు. ఉద్ధత యౌవనంలో ఉన్న సావిత్రిమీద వచ్చిన స్వప్నంలో తాను పలికిన అవమానకర వాక్యాల లాల సాగ్ని ప్రజ్వరిల్లసాగింది. హుక్కా గుడగుడ లాడింది.

... ...

—"చప్పుచప్పున చేరవెయ్యాలి. లేకపోతే మళ్ళీ చీకటిపడుతుంది."

—"పడనీ—చీకటిపడితే మరీ మంచిది. ధాన్యం చేరవేయటానికి చీకటిగా ఉంటేనే వీలు."

"ఛీ! చీకటిగా వుంటేనే మంచిదంటావ్! మనమేమయినా దొంగతనం చెయ్యటానికి వచ్చామా? నీబిడ్డను ఎవరయినా కౌగిలించుకుంటే నువ్వు మెదలకుండా ఊరుకుంటావా? పండిన పంటేగా రైతుకు ప్రాణాధారం."

భయపడుతూ—అలవాటు లేకపోవటం మూలంగా తడబడుతూ ఖగేన్ వర కూతురు సావిత్రి ధాన్యంమూటలు ప్రక్కయింట్లోకి చేరవేసింది.

... ...

మయీనుద్దీన్, యతీన్ సర్కార్‌లకి మనస్సు ఉడుకెత్తిపోతోంది. తమ తాతముత్తాతల కాలంనాటినుంచి ఎన్నడు జరగనిది తాము ఊళ్ళో ఉండగానే జరుగుతుందా? తమ కళ్ళయెదుట ప్రత్యక్షంగా ధాన్యాన్ని చేరవెయ్యటమా? మాద్దాం బ్రిటిషు ప్రభుత్వం చావలేదింకా!

"ఆః-పోదూ-ఇంగ్లీషు ప్రభుత్వం! ఎవళ్లో కొంతమంది కులంతక్కువ వెధవల భూస్వామిని అణగద్రొక్క గలుగతారా యేం మహా!"

"కాదోయ్! వ్యవహారమేమీ సక్రమంగా ఉన్నట్లు తోచదు. ఈ వెధవలంతా కత్తులూ, కటార్లూ దగ్గిరుంచుకుని ధాన్యాన్ని కోస్తూ, పహారా కాస్తున్నారట. ఏపనిపడితే ఆపని చేయటానికి ఎర్రజెండా గుర్తుపెట్టుకుని ఓ సంఘంగాకూడా తయారవుతున్నారట!"

"సంఘం—ఎర్రజెండా! అవన్నీ అలా ఉంచు! నేనుమాత్రం ఇవన్నీ చూస్తూ ఊరుకోలేను. జయేన్! నువ్వొకసారిపోయి సబ్‌ఇనస్పెక్టర్‌ను పిలుచుకువస్తావ్?"

ఇన్‌స్పెక్టరు నవ్వితే చాలు విషం రక్తం చిందుతూవుంటాయి. తాము ఎదుర చూస్తూన్న జయేన్ కంఠస్వరంతో ఇన్‌స్పెక్టరు మామూలుధోరణిలోకి వచ్చాడు. ఇంతవరకు యీ కేసును మరో సెక్షన్

కేసుగా మార్చి ఏమేమో చేద్దామనుకుని ఊహించుకున్న వ్యూహాలన్నీ యెగిరిపోయాయి. ఎన్ని పశువులు నాశనం కానున్నాయో ఇవాళ. అయిదు సంవత్సరాల క్రితం జరిగిన సంగతి ఒకటే జ్ఞాపకం వచ్చింది యివాళ ఇన్‌స్పెక్టరు గారికి...

ఏదో కేసు విచారణ సందర్భంలో మయనాహాటక్ అనే ఊరు వెళ్లాల్సి వచ్చింది. ఊళ్లో ఉన్న వాళ్లంతా తమ శక్తి కొలదీ కోడిగ్రుడ్లను, కోళ్లను, గొర్రెలను తన క్యాంపులోకి తీసుకువచ్చి సమర్పించుకుని వెళ్లారు. "గొప్పవారు వచ్చారే— వారికి ఏమి ఇచ్చి మనం సంతోషపెట్ట గలమో!" అన్న ఆదుర్దా ప్రతీవారి ముఖంలోనూ వ్యక్తమయింది అప్పుడు. ఇవాళ వీళ్లను లొంగతీసుకు రావాలంటే ఇన్‌స్పెక్టరు గారికి తలతిరిగిపోతోంది. టోపీతీసేసి కుర్చీలో చతికిలపడ్డాడు ఇన్‌స్పెక్టరు.

"ఏమిటి సంగతి?"

"ఇంక చెప్పేట్లులేదు!"

"చెప్పేదేముంది? ఇద్దరు ముగ్గురిని పట్టుకువచ్చి గుడ్డలు ఊడదీసి కొరడాలు తీసుకుని కొట్టకపోయినారా? ఇదంతా చేయించిం దెవ రసలు?"

"ఎవ్వరూ కాదు. మనకు తెలిసినంత వరకు దాన్ని బట్టి చూస్తే, గఫూరే ఈ దుర్మార్గమంతా సాగిస్తున్నట్లు తోస్తుంది"

ఒళ్లు మండిపోయింది ఒక్కసారి. ఈ దుర్మార్గుడు గఫూర్ ఎవడో వాడి సంగతి కనుక్కుందాం పదండి. వాడికి తగినశాస్తి చేసిపెడదాం.

పైన ఎండ మండిపోతోంది. అదీగాక ఎవరిదో ధాన్యం కోసుకుపోయారన్న కేసు ఇది. అంచేతనే ఇన్‌స్పెక్టరుకు తల దిమ్మెక్కిపోయింది. రుస రుస లాడుతున్నాడు కూడా. తీరా వెళ్లేసరికి ఆ ప్రాంతాల్లోని ఇరవై పాతిక ఇళ్లల్లో ఆడవాళ్లు, మగవాళ్లు ఎవరూ లేరని తెలిసింది.

"ఈ వెధవలంతా ఎక్కడకుపోయారు?"

"చిత్తం బాబూ—"

"ఏయ్! మీవాళ్లంతా ఎక్కడకు పోయారు? గఫూర్ వెధవ ఎక్కడకు పోయాడు?"

"ఉన్నారు బాబూ! అందరూ ఉన్నారు. ఎక్కడకుపోతారు?"

"వెధవల్లారా! ఉన్నారేం? ఎక్కడున్నారన్న సంగతే అడుగుతున్నా. అందర్నీ బూటు తీసుకుని మూతిమీద తంతాను ఇవాళ"

"అయితే రండి ఇన్‌స్పెక్టరుగారూ! ఆచోటు చూపిస్తారండి!"

"పద వెధవా!" ఖగేన్‌కు వీపుపగల గొట్టించి కారంచల్లించాడు గాయాలమీద ఇన్‌స్పెక్టరు.

దారి తప్పించి ఇన్‌స్పెక్టరును ముందుకు తీసుకువెడుతున్నాడు ఖగేన్. మయినాను దీన్, యతీన్ సర్కారుల ముఖాల్లో కత్తివేసినా నెత్తురుచుక్కలేదు. అడుగులు సరిగ్గా ముందుకు పడటంలేదు. కారణం ఏమయినా ఎండ తీవ్రంగా ఉండటం మాత్రం కారణం కాదు. ఇలాంటి ఎండలో నడవటం వాళ్లకు అలవాటుంది.

ఇన్‌స్పెక్టరు మాత్రం ధైర్యంగా

ముందుకు నడుస్తున్నారు మయీనుద్దీన్ యతీన్‌ల పరిశీలనం సరదాపుట్టించింది ఇన్‌స్పెక్టరుకు. మధ్యమధ్య "భయం వేస్తోందా బాబూ!" అని అడుగుతున్నాడు హేళనగా.

"చూడండీ ఇన్‌స్పెక్టరుగారూ!"

"ఏదీ? ఎక్కడ?" చేతితో చూపించిన వైపుకు వెదుతున్నాడు ఇన్‌స్పెక్టరు.

"అదుగో అక్కడ ఉన్నారంతా! వస్తారా అక్కడికి?"

వెందరాళే తిరిగి వెడదామనుకున్న సంగతి చటుక్కున గుర్తుకొచ్చింది ఇన్‌స్పెక్టరుకు. అదీగాక చాలా ప్రొద్దెక్కింది. తల పంకిస్తూ అలాగే ఉండిపోయాడు ఇన్‌స్పెక్టరు.

"ఎన్ని (గంటలు) కొట్టారో ఇప్పుడు? చెప్పగలవా?"

"ఎన్నైనా మీ వీపులమీద కొడతారు— ఇప్పుడు రండి. రైతుల నందర్నీ పట్టుకుంటారా మరి?"

"ఊహూం. ఇప్పుడు కాదులే. ఏమంటారు యతీన్ బాబూ?—" వెనక్కి తిరిగి చూశాడు ఇన్‌స్పెక్టరు. ఆ ప్రశ్నించినవాళ్లు అప్పటికే చాలాదూరంపారిపోయారు.

యతీన్‌కు, మయీనుద్దీన్‌కూ ఈ పరిస్థితి యావత్తూ తెలిసినా— ఇప్పుడు చాలా వేళ మిగిలిపోయింది, వెనక్కి వెళ్లాలి— అన్న ఆలోచన చాలా సేపటి క్రితమే కలిగింది వాళ్ళకి.

... ...

దూరంగా ఖగేన్ చూపించిన వైపునుంచి చాలామంది జనం ముందుకు వస్తున్నట్లున్నారు అందరి చేతుల్లోనూ కర్రలున్నాయి. పొలంమధ్యలో ఎర్రజెండా ఎగురుతోంది. ఆడవాళ్ళూ, మగవాళ్ళూ కలిసి ధాన్యం కోయటం— కట్టలు కట్టడం కనిపిస్తూనే ఉంది.

"అరే! వీళ్లు వెళ్లిపోయారే!—" ఇన్‌స్పెక్టరు కూడా అటు కేసి రెండడుగులు వేశాడు.

"ఏం వెళ్ళిపోతారేం మరి? ఎందుకు వచ్చినట్లు? మీ గఫూర్ వాళ్లు కూడా ఉన్నారు. ఇంకా చాలామంది కూడా ఉన్నారు!"

కాని ఇన్‌స్పెక్టరు మాత్రం అప్పుడిహ ఇంచుమించు పరుగుతీయటం ప్రారంభించాడు. కర్రలు తీసుకుని వస్తున్న జనం, దగ్గరకు వచ్చేశారు. ఖగేన్ బిగపట్టుకున్న పెదవులల్లోంచి పెద్ద నవ్వు వినవచ్చింది.

... ...

అర్ధరాత్రి ఊరంతా సొమ్మసిల్లి నిద్రపోతున్నట్లుంది. హఠాత్తుగా ఆ వైపున మట్టిరోడ్డుమీదనుంచి కుక్కల అరుపులు వినిపించ సాగాయి. ఎక్కడో రైతు గుడిసెలోనుంచి అప్పుడు నిద్రలేచిన భయవ్యాకులమైన రైతుబిడ్డ ఏడుపుధ్వని కూడా వినవచ్చింది.

గఫూర్ మండల్ త్రుళ్ళిపడి లేచాడు. ఒక్కసారిగా కొన్ని బ్యాటరీలైట్లు వెలుతురు ఊరుమధ్యలో దేనికోసమో వెతుకుతున్నట్లుంది.

ఒకవైపున ఎడతెరపిలేని కుక్కల అరపులు - తర్వాత అనేకమందికలిసి వస్తున్న పాదాల చప్పుడు నిద్రమత్తులోఉన్న

గ్రామస్థుల హృదయాలను మేల్కొలిపాయి. ఒకరొకరే అందరూవచ్చి ఒకచోట గుమిగూడుతున్నారు రైతులు.

ఈసారి ఒక్క ఇన్‌స్పెక్టరే కాదు వచ్చింది. ఇనపటోపీలు నెత్తినిపెట్టుకున్న చాలామంది ఇన్‌స్పెక్టర్లువచ్చారు. బుజాల మీద తుపాకులుకూడా ఉన్నాయి వరుసగా బారులుతీర్చి.

ఆ పెద్దవెలుతురులో రైతులకుఎదురుగా వస్తున్నాడు మయీనుద్దీన్ భయంకరమైన ముఖంతో. రైతులుకొంచంవెనక్కి తగ్గారు. మయీనుద్దీన్ తుపాకికూడా ముందుకు వచ్చింది. "ఏమిట్రా దొంగవెధవల్లారా! నా కళ్లఎదుటే ధాన్యాన్ని చేరవేస్తారా మహా... ఏమనుకుంటున్నారో! ఇంకా బ్రిటిషు ప్రభుత్వం నిలబడేవుంది తెలుసా? ఇలాంటి లుచ్ఛాలనందర్నీ తుపాకీబారులు పెట్టి కాల్చి చంపిస్తాను. మీకు మేలుజరగాలంటే తెల్లవారేలోపున ధాన్యం అంతా తీసుకువచ్చి నా కళ్లఎదుట గాదెలో పొయ్యండి"

"ప్రాణాల్నయినా ఇస్తాం కాని, ధాన్యాన్ని మాత్రం ఇవ్వం"—అని గుంపులోంచి ఒక పీడితప్రాణి గర్జించింది.

ఉద్వేగంలో తాను చాలా తొందరపడ్డానని చటుక్కున స్ఫురించింది మయీనుద్దీన్‌కు. హెల్మెట్స్ ధరించిన పోలీసులు కొంచెం దూరంలోవున్నారు ఇంకా. ఎంత ప్రయత్నించినా వీళ్ళలో ఒక్కరు కూడా వెనుదీయలేదు. మనస్సు మార్చుకోనూ లేదు. మయీనుద్దీన్ చిట్టచివరి సారిగా తెగించి ఇలాఅన్నాడు.

"మీలో ముసల్మానులెవరైతే ఉన్నారో వారంతా ఇవతలికి వస్తారా ఒకసారి? మీకు భయంఎందుకు? మీరు నాజాతి సోదరులు. ఆ గుంపులోంచి మీరంతా తొలిగి ఇవతలికివస్తే తర్వాత ఎంతమంది ప్రాణాల్ని విడవటానికి సిద్ధమౌతారో చూస్తాను" తుపాకీ పైకిఎత్తి గురిచూస్తూ నిలబడ్డాడు మయీనుద్దీన్.

బలిష్ఠుడైన దీర్ఘదేహుడు ఒకడు ఎగిరి గంతువేసి వచ్చాడు; తుపాకికి రొమ్మిచ్చి నిలబడ్డాడు.

"వీరిలో ముసల్మానులు ఎవరూలేరు. అందరం తిండిలేని జాతికి చెందినవాళ్ళం. చంపితే చంపండి యెవర్ని చంపుతారో! ప్రాణాల్ని అయినా యిస్తాం కాని ధాన్యాన్ని మాత్రం ఇవ్వం!"

కాని మయీనుద్దీన్ ఒక్కడూ ఎలా చంపగలడు? తుపాకీ ఇంకా క్రిందికి దింపకముందే మయీనుద్దీన్ పాదుషా తుపాకీ వెనుకకు రైఫిల్సు ధరించిన బ్రిటిషు ప్రభుత్వపు భటులువచ్చి నిలబడ్డారు.

... ...

తుపాకీ కాల్పుల ధ్వనుల్లో, అరుపులు గుసగుసలు అణిగిపోయినాయి. ఇటూ అటూ ఒకటీ రెండు ఇండ్లలోంచి ఏడుపు ధ్వనులు మాత్రం వినవస్తున్నాయి. పైన ఆకాశమంతా రక్తపుముద్ద అయి పోయి వణుకుతున్నదా అన్నట్లుంది.

ఆ రోజల్లా గడిచింది. మళ్లీ సాయంకాల మయింది. మయీనుద్దీన్ గాదెలో ఎవరూ చిట్టెడు గింజలైనా తెచ్చిపోయ లేదు. (మిగతా 62 వ పేజీలో)

జీవితం విలువ

—శ్రీమతి శారద—

సుబ్బడు ఒక్కడే వాళ్ళమ్మకి. సుబ్బడు నాన్నని ఎరగనే ఎరగడు. విశాలమైన ప్రపంచంలో దరిద్ర బాధా పీడితులైన అనేకమందిలో, సుబ్బడూ, వాడితల్లీ—సభ్యులు... అంచేత, సుబ్బడు, చిన్నప్పుడు, ఇంకా పెద్దింటిపిల్లలు మొహం కడుక్కోడం చాతకాని ఈడులో నన్నమాట, ప్లీడరు రామదాసుగారింటిలో, పిల్లల్ని ఎత్తుకోటానికీ, ఆడించటానికీ చేరాడు. వాడికి సరిగ్గా తెలీకపోయినా, అనేక విషయాలు, రామదాసుగారింట్లో, దెబ్బలతో, చివాట్లతో తెలిసివొస్తుండేవి. పనివాడు, జీతం తీసుకుంటాడు. వాణ్ని ఎంతవరకువాడుకోవాలో, ఏమిటో, రామదాసుగారి సంసారంలోని 12 మందిసభ్యులకీ క్షుణ్ణంగా తెలుసు. తెలియని, చిన్నపిల్లలకి పెద్దవాళ్లు తెలియజేసి తమ బాధ్యత నెరవేర్చుకున్నారు. పెద్దవాళ్ళు చివాట్లు వేస్తోవుంటే, సుబ్బడు తలొంచుకుని ఉండేవాడు. చిన్నపిల్లలు తంతే, ఏడవకూడదని ఏడేళ్ళ సుబ్బడికి తెలుసు! రామదాసుగారింట్లో పనిచేస్తున్నంతసేపూ, ఎవరూ నేర్పకుండానే, వేదాంతం బోధపడిందా, అన్నట్టు అన్నిట్నీ భరించే సుబ్బడు రాత్రిపూట తల్లివడిలో పడుకుని,

"ఈయేల, చిన్నబాబాయిగారు కొట్టిండే, నొస్తోందే" అని ఆరోజు తనకి జరిగిన బహుమానం తల్చుకుని వెక్కి వెక్కి ఏడ్చేవాడు.

గాఢమైన మాతృప్రేమతో, సుబ్బడితల్లి గంగి, కొడుకుని, "ఊరుకో అయ్యా, మన రాత, ఏంచేత్తాం" అని ఓదార్చి నిద్రబుచ్చేది. అంతకన్న ఆ ముసలి తల్లికి, తమ దుర్భరదారిద్ర్యానికి కారణాలు తెలీవు. తెలుసుకుందామనే ప్రయత్నమూ లేదు. ఏ బాధనైనా భరించి, జానెడు పొట్టనిసగమైనా పూడ్చాలనేదే ఆమె తప

జీవితం విలువ

—శ్రీమతి శారద—

సుబ్బడు ఒక్కడే వాళ్ళమ్మకి. సుబ్బడు నాన్నని ఎరగనే ఎరగడు. విశాలమైన ప్రపంచంలో దరిద్ర బాధా పీడితులైన అనేకమందిలో, సుబ్బడూ, వాడితల్లీ—సభ్యులు... అంచేత, సుబ్బడు, చిన్నప్పుడు, ఇంకా పెద్దింటిపిల్లలు మొహం కడుక్కోడం చాతకాని ఈడులో నన్నమాట, ప్లీడరు రామదాసుగారింటిలో, పిల్లల్ని ఎత్తుకోటానికీ, ఆడించటానికీ చేరాడు. వాడికి సరిగ్గా తెలీకపోయినా, అనేక విషయాలు, రామదాసుగారింట్లో, దెబ్బలతో, చివాట్లతో తెలిసివొస్తుండేవి. పనివాడు, జీతం తీసుకుంటాడు. వాడ్ని ఎంతవరకువాడుకోవాలో, ఏమిటో, రామదాసుగారి సంసారంలోని 12 మందిసభ్యులకీ క్షుణ్ణంగా తెలుసు. తెలియని, చిన్నపిల్లలకి పెద్దవాళ్లు తెలియజేసి తమ బాధ్యత నెరవేర్చుకున్నారు. పెద్దవాళ్ళు చివాట్లు వేస్తోవుంటే, సుబ్బడు తలొంచుకుని ఉండేవాడు. చిన్నపిల్లలు తంతే, ఏడవకూడదని ఏడేళ్ళ సుబ్బడికి తెలుసు! రామదాసుగారింట్లో పనిచేస్తున్నంతసేపూ, ఎవరూ నేర్పకుండానే, వేదాంతం బోధపడిందా, అన్నట్టు అన్నిట్నీ భరించే సుబ్బడు రాత్రిపూట తల్లివడిలో పడుకుని,

"ఈయేల, చిన్నబ్బాయి గారు కొట్టిండే, నొస్తోందే" అని ఆరోజు తనకి జరిగిన బహుమానం తల్చుకుని వెక్కి వెక్కి ఏడ్చేవాడు.

గాఢమైన మాతృప్రేమతో, సుబ్బడితల్లి గంగి, కొడుకుని, "ఊరుకో అయ్యా, మనరాత, ఏంచేత్తాం" అని ఓదార్చి నిద్రబుచ్చేది. అంతకన్న ఆ ముసలితల్లికి, తమ దుర్భరదారిద్ర్యానికి కారణాలు తెలీవు. తెలుసుకుందామనే ప్రయత్నమూ లేదు. ఏ బాధనైనా భరించి, జానెడు పొట్టనిసగమైనా పూడ్చాలనేదే ఆమె తప

కొడుక్కి నేర్పగల్గిన ఆదర్శం; ఆమె అనుభవ పూర్వకమైన, ఆదర్శంగూడా.

ఒకనాడు, సుబ్బడ్ని రామదాసుగారి పన్నెండేళ్ల అబ్బాయి, కిందపడేశాడు. సుబ్బడికి, మోకాలు అంగుళం లోతుకి గాయపడింది. వెంటనే, సున్నం వేయించింది, రామదాసుగారి భార్య. చాలాసేపు ఏడుస్తోఉంటేను.- "ఏం వగలురా వెధవా, మోకాలు దోక్కు-పోతే, గంటసేపణ్ణుంచి ఏడుస్తున్నావు" అని సుబ్బడ్ని మందలించింది ఆమహాతల్లి. రాత్రి యింటికివొచ్చి సుబ్బడు, చాలాసేపు ఏడ్చాడు; మామూలుగా తల్లివడిలో నిద్రపోయాడు అన్నీమరిచి. తెల్లారి కుంటుతూ పనికి వెళ్లాడు. "వెళ్ళక పోతే, యెట్లా, బువ్వ కావద్దూ ?," అంది వాళ్ళమ్మ.

౨

దీపావళికి వారం ముందునుంచీ ఊళ్ళో, టపాకాయల మోత వింటున్నాడు సుబ్బడు. రామదాసుగారింట్లో గూడా పువ్వొత్తులు, జిల్లీలు కాలుస్తున్నారు పిల్లలు. సుబ్బడుఅన్నీ చూస్తూవింటూ, ఆనందిస్తే చాలని గావును, ఆయింట్లో వాళ్ళ అభిప్రాయం. ఒక్క-జిల్లీగాని, టపాకాయగానివాడికిచ్చిన పాపాన పోలేదు ఆపిల్లలు. ఇవ్వాల్సిన అవసరంఏమిటి, వాళ్ళకి ? పైగా, సుబ్బడు కుర్రతనం కొద్దీ, ఓజిల్లీ అందరూ చూస్తుండగానే, తీస్తే ముగ్గురు పెద్దలు చివాట్లేశారు, ఇద్దరుపిల్లలు తన్నారు. దొంగతనం విషయమై, ఓపెద్ద ఉపన్యాసం! సుబ్బడికి బోధపడలేదు కాని, ఫలితం స్పష్టంగా తెలిసింది ! కళ్ళవెంట నీళ్ళు గిర్రున తిరిగాయి. తనఈడు వాళ్ళు, దున్నపోతుల్లా ఉండే ఆపెద్ద వాళ్లు, అన్ని జిల్లీలు, తోటాలు, మతాబాలు కాలుస్తూ ఉంటే తనకి ఒక్కటికాల్చేహక్కు లేదూ ? ఇంత విమర్శగా కాదు, సుబ్బడు ఆలోచించింది; కాని, ఇదే వాడి ఆలోచనలరూపం. వాడికి ఏహక్కుల విషయమూ తెలీదు. తెలియనివ్వటం, రామదాసుగారికుటుంబానికి, ఇష్టంలేదు. ఆ రోజుగూడ రాత్రి సుబ్బడు వాడి అమ్మతో, జరిగిన విషయం

చెప్పి, భోరునపడ్డాడు. ఏం చేస్తుంది, ఆ తల్లి? పొట్టనింపడమే బ్రహ్మాండమైన జీవితాలకి, కట్టగుడ్డే కరువైన బతుకులకి, టపాకాయలు కూడానా? ఈ మాటలే, ఆమె మాటల్లో కొడుక్కి చెప్పి పనికి పంపింది పొద్దున. సుబ్బడు, తల్లి ప్రేమ మాటలకి శాంతించి, మారాంపెట్టక వెళ్ళేవాడు పనిలోకి.

3

దీపావళి నాడు పొద్దుణ్ణించి, సుబ్బడికి పిల్లల సరదాలతోటి భూమి కెలుకనపడ్డయ్. పగలు వాడికి రామదాసుగారింటోనే, బువ్వే శారు, పండగ పుణ్యమాఅని. కాని అంతకన్న ప్రబలమైన కారణం, బుల్లిబాబుని ఎతుకుని తిరగాల్సి ఉండటం. సాయంత్రంపూటదీపాలు పెట్టిం తర్వాత, సుబ్బడు, బుల్లిబాబుని ఎతుకుని అరుగుమీాల నుంచుని, పిల్లలు కాల్చేమతాబాల వంకా, తోటాలవంకా చూస్తున్నాడు. వాడికళ్ళు ఆశతో, నిరాశతో, మెరుస్తున్నై. బుల్లిబాబు వాణ్ణిమధ్యమధ్య రక్కుతున్నాడు. అన్నీ ఓర్చుకుని, పిల్లాణ్ణి ఏడవకుండా సముదాయిస్తున్నాడు. కాని బుల్లిబాబుగారికి ఆకలి ఎక్కువై తల్లికోసం గోలపెడుతుంటే, ఆతల్లి "దున్నపోతల్లే వాణ్ణి సముదాయించలేవు, ఎందుకురా నువ్వుదండగ చేటూ..." అని రాగం తీస్తో సుబ్బడి బుగ్గ సాగతీసి, పిల్లణ్ణి ఎతుకుని, గడప మీాద కూర్చుని పాలిస్తోంది. సుబ్బడు అరుగు దిగి, వీథ రెండో వైపున రోడ్డుమీాదకూచుని, టపాకాయల్ని రంగురంగుల పువ్వొత్తుల కాంతులిని, చూస్తున్నాడు సరదాగా.

రామదాసుగారి పెద్దబ్బాయికీ చిన్నబ్బాయికీ జిల్లీల హందొలో తగాదాముదురుతోంది. ఒకరికన్న ఒకరు ఎక్కువ కాల్చాలని, జిల్లీల్ని కాల్చి, రోడ్డుమీాదకి, ఆకాశం మీాదికి విసురుతున్నారు. ఈ సరదాలోనే, లీనమై ఉన్నాడుసుబ్బడు కూడా. పెద్దబ్బాయిగారు, చిన్నబ్బాయిని వెక్కిరిస్తో "చూడరా. వెధవా, నేను తమాషా చేస్తాను" అని ఓజిల్లీ సుబ్బడిమీాదికి విసిరాడు. సుబ్బడు తన ఆనందంలోనే ఉండి, కళ్ళు పెద్దవిచేసి, చూస్తు

న్నాడు, కూర్చుని. జుర్, అని మోతపెడుతూ, పెద్దబ్బాయి విసిరిన జిల్లీ, సుబ్బడి కళ్ళకి తగిలింది. సుబ్బడికి, కళ్ళు రెండూ, జిగేలుమన్నాయి. అమ్మో, అమ్మో అనుకుంటూ కళ్ళు నులుముకుంటున్నాడు సుబ్బడు. ఒక్క-క్షణం తర్వాత సుబ్బడికి ఘోరమైన బాధ ప్రారంభమైంది. వెర్రికేక వేశాడు. ఈ కేకతో, ఇదంతా చూస్తూ బుల్లిబాబుకి పాలిస్తున్న రామదాసుగారి భార్యకి భయం వేసింది. భర్తని కేకేసింది. లోపల లా పుస్తకాలు తిరిగేస్తున్న రామదాసుగారు పరుగెత్తుకొచ్చారు. సుబ్బడిగోల, చెప్పనలవిగాకుండా వుంది. వకీలు రామదాసుగారు, వాణ్ణి ఆసుపత్రికి చేర్చాడు.

౭

ఆసుపత్రి వాకిట్లో సుబ్బడితల్లి గోలుగోలుమనిఏడుస్తూకూచుంది. రామదాసుగారు డాక్టర్ మొహం ఆదుర్దాగా చూస్తూ నుంచున్నాడు. డాక్టరు, సుబ్బడి రెండుకళ్ళకీ కట్లుగట్టి, రామదాసుగారివంక చిరునవ్వుతో చూసి, "ప్రాణభయం లేదుగాని, కళ్ళు పోయినాయి" అన్నాడు. రామదాసుగారి ప్రాణం కుదటపడ్డది. "ఆసాంతం నయం చేసి పంపేయండి" అన్నాడు డాక్టరుతో, వకీలుగారు; సరేఅన్నాడు డాక్టర్.

రామదాసుగారు బైటికివొచ్చి, గంగిని ఓదార్చి, "ఇదిగో, నీపిల్లాడికేం ఫరవాలేదు. ఈ పది రూపాయలు తీసుకో" మని ఇచ్చి, వెళ్ళిపోయినాడు మహారాజ. తన ఏడేళ్ళ కొడుకు జీవితం, పదిరూపాయలకన్న ఎక్కువ విలువ చేస్తుందని ఆ ముసలి తల్లికి తెలీదు. "మారాజు, పదిరూపాయలు ఒక్కసారేఇచ్చాడు" అని సంతోషపడ్డది, ఆ హృదయం!

సుబ్బడ్ని పదిహేనురోజుల తర్వాత ఆస్పత్రినుండి, పంపేశారు; సుబ్బడికి, ఈ విశాల సౌందర్యలోకం,అంధమైపోయింది. కర్రసాయంతో, తల్లిచెయ్యిపుచ్చుకుని, తనకి విధింపబడ్డ ఘోర శిక్షను అనుభవించేందుకు, అంధకార బంధురమైన క్రూరలోకం లోకి ప్రవేశించాడు భిక్షమెత్తుకోటానికి, పాతగుడ్డల జోలికట్టుకుని. తనకి ఈ శిక్ష ఎందుకో ఆ కుర్రవాడికేం తెలుస్తుంది?

లేఖలు ★ ★

ఆర్యా,

అభ్యుదయ చదివాను. కిందటి సంచిక కంటె బాగున్నది. అనిశెట్టివీ, తెన్నేటిసూరివీ, శ్రీశ్రీవీ గేయాలు ప్రత్యేకించి బాగున్నాయి. కుందుర్తి, గిడుతూరివారి రచనలు ఆశాశూన్యంగా, నిరాశాజనకంగా ఉన్నాయి అవి అభ్యుదయ రచనలు కావని నా అభిప్రాయం. జాస్తి సీతారాందాసు రచనలో కవిత్వం లోపించిందని నాకు తోచింది. "రచయితల కర్తవ్యం" లో హెచ్చరిక అభ్యుదయ రచయితసాటి అభ్యుదయ రచయితలకు చెయ్యవలసినది కాదు. గాంధీజీ హత్య గురించీ, దాని వెనకఉన్న వాతావరణం గురించీ అభ్యుదయ రచయితలకు తెలియదని "అభ్యుదయ" ద్వారా స్ఫురింపజేయటం ఉచితం కాదేమో! గిడుగువారి వర్ధంతి గురించీ, నాట్యకళా పరిషత్తు గురించీ వార్తలు ప్రచురించటం నాబుద్ధికి సరిగా తోచలేదు. ఆ సందర్భాల్లో చేసిన ఉపన్యాసాలను పురస్కరించుకుని అభ్యుదయ సంపాదకీయాలు రాయటం ఉచితంగా ఉండేది. "ప్రగతి" కోసం అన్ని పేజీలు వ్యయపరచటం వృథాయేమో!

—కొడవటిగంటి కుటుంబరావు
[మద్రాసు]

ఆర్యా!

ఇప్పటికి వచ్చిన గాంధీజీ సంచికలన్నిటిలోనూ, మొత్తంమీద అభ్యుదయ బాగుంది.

మొదటి శీర్షిక 'ప్రతిజ్ఞ' మొదటి పంక్తిలోనే ఒకపదంవుంది 'విశ్వప్రపంచాన్ని'. దీని అర్థం ఏమిటో బోధపడదు. ఇది నొక్కిచెప్పటం కోసం వాడారనుకుంటామా లేక మరేమిటి? సంపాదకులే యిలాంటివి చేస్తే, కంచే చేను మేసిన లెక్కకు వస్తుంది.

"పిచ్చుకుకలు" లాంటి కవిత్వానికి అభ్యుదయ ప్రోత్సాహమివ్వరాదు.

ఇతర భాషలనుండి అనువాదాలు సాగించి, తెలుగును సజీవం చేయడం బావుంది. ప్రగతి అన్న నాటిక, ప్రస్తుత సమాజానికి నారి కురుపుగాఉన్న యుద్ధాన్ని- దాని

వల్ల కలిగే బీభత్సాన్ని -రచ్చకీడుస్తుంది. ఇలాంటి రచనలు ఎంతేనా అవసరం. కాని అభ్యుదయలాంటి 80పేజీల సంక్షిప్త సంచికల్లో, ఒక్క నాటికకే 20పేజీలు వినియోగించడం బాగులేదు. ఎందువల్ల నంటే 10 పేజీలకు సరిపోయే నాటికగనక అయివుంటే మిగతా పది పేజీలలో రెండుచిన్న కథానికలకూ, రెండుగేయాలకూ, (స్వతంత్ర రచనలకు) అవకాశముండేది.

పత్రికకు జీవం పోసింది ముఖ్యంగా, అనిశెట్టి, శ్రీశ్రీల రచనలు. ఇంగ్లీషు సుప్రసిద్ధ కవి ఆడెన్ ఎక్కిక్సను తెలుగులోకి ప్రవేశపెట్టినందుకు అనిశెట్టికి, యిక్కడ, అనేకమంది పాఠకులు ధన్యవాదాలర్పిస్తున్నారు. గాంధీజీ మృతిమీద వచ్చిన అన్ని గేయ రచనల్లోకీ యిదే వుత్తమ మని యిక్కడి అభిప్రాయం. కాని ఒక రచయిత రచనలలో ఒకటికంటే యెక్కువ ఒకేసంచికలో వేయ కూడదని మా అభిమతం.

అభ్యుదయలో మాసంమాసం గ్రంథాలను సమీక్షు చేయాలి. పత్రికాసమ్ముఖంగానే మహాసభ విరాళాలకు విజ్ఞప్తి చేయాలి.

అనిశెట్టిది తప్ప తక్కిన గేయ రచనల స్టాండర్డ్ అభ్యుదయ అంతస్తుకు అనువుకాదని కొందరి అభిప్రాయం. సంపాదకులు, రచయితల పూర్వకీర్తికీ, పేరుప్రఖ్యాతుల పైపైపూతలకు మురిసి, వారి రచనలు యెంతఅధోస్థితిలోవున్నా ప్రచురించక, ప్రతిరచననీ తాము మథించి,సారంకలదయితే ప్రచురించాలని మా మనవి. ఒక సారస్వత పత్రికకుండవలసిన కనీసపుటంతస్తునైనా అభ్యుదయ అందుకోవాలని మా కోరిక —కె వి రమణారెడ్డి

[ఆంధ్ర విశ్వ విద్యాలయం]

(58 వ పేజీ తరువాయి)

ఖగేణ్ కూతురు సావిత్రి ఇల్లు కాలిపోయి చచ్చిపోయింది. ప్రాణాలు దక్కలేదు; మానంమాత్రం దక్కింది.

పోలీసులూ, మిలిటరీవాళ్లు, భూస్వామిగారితాలూకువాళ్లు పిచ్చికుక్కల్లాగా ఊరంతాతిరిగి xఫూర్ మండల్ కోసం గాలించడం మొదలెట్టారు.

ఊరిచివర నదిఒడ్డున ఎవరిదో శవం రక్తంలో తేలి యాడుతోంది. భార్యాపిల్లల ఆకలిబాధ తాలూకు కన్నీటిచారికలు గుండెల్లోని రక్తంతో తుడిచివేయబడ్డాయి.

యుగసంధ్య

శ్రీ చంద్రారెడ్డి

ఉదయించెడి తూరుపు దెస
లరుణించెను యుగరేఖలు
అదలించిరి రాకాసులు
పయనించెడి మానవులను
ఎదురీదిరి రక్కసులకు
కదలించిరి మూర్ఖతమసు
ముందేగెడి యువజ్వాల
లధినేతలు యుగవాణికి

ఇంతలో

దిగజారిన ముసలి మనసు
లభివృద్ధి నిరోధకులు
భయపెట్టిరి, దారినిండ
సంశయముల చూపెట్టిరి

ఏమని

ఉదయరేఖ లవికావని
అపరరేఖ లగునోరీ
మున్ముందుకు పోకండీ
రాత్రిపుడే అరుదెంచెను
చీకటిలో తాకటులతో
అగచాట్లకు లోనగుదురు
నిలుడు నిలుడు పోకండటు
వినుడు వినుడు ముందుమాట
పెద్దల సుద్దులురా యివి

మా మాటలు వినకుండిన
చెడిపోవుట తథ్యమునండీ!
యీ బాటనె యీ త్రోవనె
మహామహులు అణగారిరి
మన మొకరము లెక్క లేరు
వృథాప్రయాస మనకెందుక
రారండీ వెనుకకు మరలిటు

తాళం

వింటిమి మీమాటలు పెద్దల్లారా!
వినకపోయెడి పెడసరి వెధలు
విరగబడెదరు నిజమేనండీ!
బావుకతిందురు పోయిముందునకు

ఎవరిది!

అంచుకొందరు చీడపురుగులు
ముసలి యువకులు కలసి చనిరటు
మూతిముడుచుక వెనుకకుక్

ఇక

మిగిలియున్న మానవు లపు
డరుణ కాంతివైపు జూచి
సంశయంపు దృష్టులతో
దారిజూపు తార లేక
దిక్కులంత దీనముగా
కాంచు చుండి ఆతురులై

ఆ అదనులో
లేచె యువజ్వాలయొకటి
మెరిసెను యుగతార యొకటి
తళుకులతో మనసులలో
పలికెను యుగవాణి అపుడె
ప్రజలంతా కాంచిరపుడు.

యువ ప్రబోధము
యుగసంధ్యయిది మనకు
వెనుకాడ బోకండి
భాగ్యజీవన సుఖము
పొందవలెనంటే
ముందుకురుకుడి యిపుడె
మందు హృదయాలలో
ఎదిరించు క్రూరతను
పరిమార్చి వేయండి
అడ్డు కంటకమెల్ల
హతమార్చి వేయండి
ఉదయించు మనసులతో
అను గామిశకులను
కూడదీసుక మనము
పోదాము రారండి:
వ్యథమరచి అదనులో
పయనించి త్వరితముగ
చేరెదము మనకాంతి
పొందెదము మనశ్శాంతి
రండి రండిక మీరు
వెనువెంట రారండి!

పయనము
యువకుడు అగ్నైమండెను
యువరక్తం రగిలించెను
హిమాలయం కదలించెను
బాడబముల నదలించెను
పరుగెత్తిన దా తుపాను
మోగిన దా జయఘంటిక
పలికిన దా విశ్వవాణి
ఎదిరించిన కంటకములు
చూర్ణమయ్యె ధూళిగలిసె
ఉడుకెత్తిన ధారావాహిని
అరుణించిన తూర్పుదెసకు
ఉదయించిన కాంతిదెసకు
పరుగిడినది త్వరిత గతిని
చేరిన దా స్వర్ణకాంతి

యుగోదయము
అరుణరేఖలవి ఉదయించెనురా
ఉదయబింబమదె పైపై కొచ్చెను
కోలాహలములు మిన్నుముట్టెరా
భూమ్యాకాశము లేకమాయెను
స్వేచ్ఛావాయువు వ్యాపించినది
సుగంధములె విరజిమ్మినది!-

* * *

సమీక్ష

సుబ్బలక్ష్మి కథలు

రచన: శ్రీ తెన్నేటి సూరి

మహోదయ ప్రచురణలు, మచిలీపట్నం

వెల: ౧౨ అణాలు

'పాలతల్లి' సుబ్బలక్ష్మి పెంచిన మమకారాన్నీ, పెట్టుకొన్న ఆశల్నీ కేంద్రం చేసుకొని వ్రాసిన అయిదు కథల సంపుటి యిది.

కన్నతల్లి మీద కన్న అరుణకుమారునికి పెంచి పెద్దచేసిన సుబ్బలక్ష్మిమీద ప్రేమ, అభిమానం హెచ్చు. ప్రేమ, మమకారం ఆత్మాభిమానాన్ని చంపుతాయి.

చిన్న కుర్రవాడిని బెల్లించి, ఇంట్లోంచి అవీ, యివీ తెప్పించుకు తింటూందని అనుకొంటారని సుబ్బలక్ష్మి అభిమానం. అరుణ చేతి బూరెముక్కలు తీసుకోడానికి గల ఆ అభ్యంతరం అతని మీదగల ప్రేమ, మమకారం ముందు నిలువలేకపోయింది. అతనిని సంతోష పెట్టడానికి ఆమె తన అభిమానాన్ని చంపుకోవలసి వచ్చింది.

తల్లిపైగల గౌరవంకన్న సుబ్బలక్ష్మిపైనున్న మమకారం ప్రేమ అరుణకుమారుని ప్రేమమయహృదయాన్ని అదుపులోకి తెచ్చాయి. ఆమెకోసం, ఆమె ఆశించే దేశంకోసం అతడు తన వ్యక్తిగతమైన అభిమానాన్ని చంపుకొన్నాడు.

కాని, ప్రేమాభిమానాల అధికార పరివ్యాప్తి మానవుని వ్యక్తిత్వం వరకే. కాని మానవుడు వట్టి వ్యక్తి మాత్రమే కాడు. సంఘయంత్రంలో ఒక చక్రం. అతని వ్యక్తిగతమైన అభిమానాలు, ప్రేమలు, మమకారాలు సంఘాన్ని అదుపులోకి తేజాలవు దానిని నడిపించే నియమాలు వేరే వున్నాయి.

"కుయ్యమంటే ఏవిటి" అని కులవిభేదాలనుగూర్చి అరుణ వేసిన ప్రశ్న వేలసంవత్సరాలుగా రక్తమాంసాలలో జీర్ణించిపోయిన ఒక సాంఘికాచారాన్ని కదపబోతుంది. 'మా అన్నం నీకు పెట్టకూడదు'— అనే దొక్కటే సుబ్బలక్ష్మినోట సమాజబంధం ఇప్పించగల సమాధానం.

సంఘంలో నూతన పరివర్తనం తేవడానికి పూనుకొన్న అరుణకు సంఘం ఇచ్చిన సమాధానంకూడా ఇందుకేమీ తక్కువ కాదు. 'క్రాక్' బిరుదం, పోలీసు నిఘా మాత్రమే అతని పెంకదనానికి సంఘం ఇచ్చిన సమాధానం. సుబ్బలక్ష్మిమీది ప్రేమ, ఆమె మాటయెడగల గౌరవం అతనిచే మృత్యువును జయింపచేసింది. కాని సాంఘిక దుర్నయాలను తుదముట్టించనీ లేకపోయింది.

బాలుడికీ, యువకుడికీ భవిష్యత్తు వుంది. వాళ్ళు నిరాశల్నీ, నిస్పృహల్నీ తట్టుకు నిలబడతారు. కాని, సుబ్బలక్ష్మి వృద్ధాప్యం నిరాశా నిస్పృహల్ని తట్టుకో

లేక పోయింది. తుదిసుడియలలో తన ముద్దుల పెంపుడు కొడుకుని కళ్ళతో చూచుకొని ప్రాణం విడిచింది.

సూరిగారు మానవుని మనస్తత్వాల లోతుల్ని కథాగతిలో చక్కగా బయటకు తెచ్చారు.

కాని చివరి మూడు కథలలో సుబ్బలక్ష్మి పాత్రయొక్క స్థితికీ, ఆమె మనస్సులోనికోరికలకూ అతుకు కుదరగ లేదు. రచయిత సుబ్బలక్ష్మికి సమాజంలో యిచ్చిన స్థానానికి అనుకూలమైన భావాల్ని ఆ పాత్రకి ఇచ్చివుండలేదు.

సుబ్బలక్ష్మివిగా పరికించిన రాజకీయ భావాలుగాక, వర్గస్వార్థాలకు ఘర్షణను మాత్రమే ఆయన సూచించివుంటే సహజంగా వుండేది.

సూరిగారిది కథారచనలో వడితిరిగిన చేయి. అందరూ చదవవలసిన కథలు ఇవి.

— రామమోహన్

★

యక్ష ప్రశ్నలు

రచన: శ్రీ మహీధర జగన్మోహన్
విశ్వసాహిత్యమాల—రాజమండ్రి
వెల: రూపాయిన్నర

మన భాషలో శాస్త్రీయ గ్రంథాలు చాలా తక్కువ. శాస్త్ర విజ్ఞానం మన భాషలో వ్యాప్తిపొందడం ఎంతో అవసరం. ఈ కొరత తీర్చడానికై ఇటీవల జరుగుతూన్న ప్రయత్న ఫలితాల్లో ఈ గ్రంథం ఒకటి.

ఏ విషయం మీదనైనా, ఎంత తల పట్టు కలిగించే సిద్ధాంతాన్నయినా చక్కటి కథలా, చిన్నపిల్లలకు కూడా తెలిసేలాగ ఆకర్షకంగా వుండేటట్లు చెప్పడం ఒక ప్రతిభ. విజ్ఞానశాస్త్రవిషయాలు నోరు తిరగని పారిభాషిక పదాలతో నిమిత్తం లేకుండా సులభంగా చెప్పే పుస్తకాలు పాశ్చాత్య భాషలలో చాలా వచ్చాయి. ఆ విధమైన రచనలకి విఖ్యాతి పొందిన మైకేల్ ఇలిన్ అనే సోవియట్ రచయిత వ్రాసిన 'యక్షప్రశ్న'ల నేరచనను దృష్టిలో వుంచుకొని ఈ పుస్తకం వ్రాయబడింది.

కేవలం అనువాదాలంటే మన ప్రజల విజ్ఞాన స్థాయికీ, జీవిత పద్ధతులకీ అందకుండా, పొందకుండా వుండిపోతాయి. అందుచేత ఇటువంటి రచనల విషయంలో స్వతంత్రపంథా తొక్కడమే మంచిది.

ఈ పుస్తకం ఆదినుంచి అంతవరకూ కథమాదిరిగా ఉత్సాహం కలిగించేటట్లు వ్రాశారు రచయిత.

ఇటువంటి పుస్తకాలు పిల్లలకు, పెద్దలకు కూడ ఎంతో ఉపయోగకరం. మనకు నిత్యం కనపడే వస్తువులు, వాని పుట్టు పూర్వోత్తరాలు, మనం నిత్యంచేసే పనులు వాటి పరిణామం ఈ పుస్తకంలో వివరించడానికి ప్రయత్నించి చాలవరకు రచయిత సఫలుడయ్యాడు.

పిల్లలు సహజ కుతూహలంతో వేసే ప్రశ్నలు యెన్నో పెద్దవాళ్ళకు 'యక్ష ప్రశ్నలు', అలాంటి లక్ష యక్షప్రశ్నల కిందులో శాస్త్రీయ సమాధానాల నిచ్చారు. ఇది మహాభారతంలోని ఉపా

ఖ్యానం కాదు. సుశీల అడిగే ప్రశ్నలకి సూర్యం బాబయ్య చెప్పే సమాధానాల సంపుటి యిది.

స్నానం చేయడం ఎప్పటినుంచి వస్తూ ఉంది? సబ్బు చేసే పనేమిటి? కుండలో నీరు చల్లగా యెందుకు వుంటుంది? నీరు ఎందుకుమండదు? ద్రవపదార్థమేయైన, పెట్రోలు ఎందుకు మండుతుంది? తుప్పు పట్టడం అంటే యేమిటి? సూది, చాకు, కత్తెర - వీటిని మానవులు ఎప్పటినుంచి వాడుతున్నారు? నిప్పు నేలాగ మచ్చిక చేశారు? అగ్గిపెట్టె చరిత్ర ఏమిటి? పింగాణీ ఏలాచేస్తారు? పాలు ఎందుకుపులుస్తాయి? దుస్తులు మనకి వేడి నిస్తాయా? విదేశాల నుంచి మన నిత్యాహారం అయిన వస్తువు లేమిటి?...... ఇలాంటి ఎన్నో ప్రశ్నలకి చక్కని సమాధానాలు ఇందులో దొరుకుతాయి. సాంప్రదాయికంగావస్తూన్న పిచ్చి నమ్మకాల్ని తోసిపుచ్చడం, శాస్త్రీయ దృష్టితో ప్రతివిషయాన్నీ అర్థం చేసుకోవడం — ఈ రెండులాభాలనీ ఈ పుస్తకం వలన పొందవచ్చు.

ఇటువంటి పుస్తకానికి బొమ్మలుకూడా వుంటే యెంతో బాగుండేది. రచయిత కూడా ఆ విషయాన్ని గుర్తించారు. రెండోకూర్పులో ఆలోటు తీరుస్తారనే ఆశిస్తాము.

ఇటువంటి గ్రంథాలు తెలుగుభాషలో విశేషంగా తీసుకురావడానికి ఈ గ్రంథ కర్త ప్రయత్నించగలడని ఆశిస్తాం.

★

అభ్యుదయ

[లిఖిత పత్రిక]

నిర్వాహకులు:

ఆంధ్ర అభ్యుదయ రచయితలసంఘ శాఖ

అన్నామలై విశ్వవిద్యాలయం

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘ శాఖల్లో ఎక్కువ ఉత్సాహంతో కార్యక్రమం సాగిస్తున్న వాటిలో అన్నామలై విశ్వవిద్యాలయ శాఖ ఒకటి. ఈ శాఖ పక్షాన 'అభ్యుదయ' అనే లిఖిత పత్రిక నిర్వహింప బడుతున్నది. ఇప్పటికి రెండు సంచికలు వెలువడ్డాయి.

విద్యార్థి రచయితల ఆంధ్రాంగ్ల రచనల తోను, విద్యార్థిచిత్రకారుల వివిధచిత్రాల తోను ఈ లిఖితపత్రికా సంచికలు అచ్చు పత్రికల అందచందాలను పోటీచేస్తున్నట్టున్నాయి. సాహిత్య విషయకమైన వివిధ సమస్యలమీద విద్యార్థి రచయితల రచనలు కూడా విశిష్టంగా వున్నాయి. విద్యార్థి రచయితలూ విశ్వవిద్యాలయాంధ్రాధ్యాపకులూ పరస్పర సహకారంతో ఈ సంచికలను వెలువరించడం ముదావహం. పత్రికా నిర్వహణలో అన్నామలై శాఖ కార్యదర్శి శ్రీ జాస్తి సీతారామదాసు, ఇతర బాధ్యులూ చేసిన కృషి ప్రశంసింపదగింది.

తక్కిన స్థానికసంఘాలుకూడా ఇలాగే లిఖితపత్రికలు నడుపుకోడానికీ, ఆయా

పురోగతి

[మళయాళం]

కేరళ అభ్యుదయ రచయితల మాసపత్రిక

చెరుతురుతి, కొచిన్ స్టేట్

★

ఉపాధ్యాయ

[ఆంధ్రరాష్ట్ర ఎలిమెంటరీ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ వారి మాసపత్రిక]

సం. చందా రు 3; విడిప్రతి పావలా

'ఉపాధ్యాయ', కొత్తపేట-గుంటూరు

★

ప్రాంతాల యువరచయితల పురోభివృద్ధికి తోడ్పడడానికీ, అన్నానసరైశాఖ మార్గదర్శకంగా పనిచేస్తున్నందుకు అభినందించాలి.

— ప్రయాగ

★

అభ్యుదయ

[బెంగాలీ]

బెంగాలీ అభ్యుదయ రచయితల మాసపత్రిక

312, శివనారాయణదాస్ లేన్, కలకత్తా

★

భారతదేశంలో రచయితల స్థితిగతుల్ని పెంపొందించడానికి అభ్యుదయ రచయితలసంఘం కృషిచేస్తున్నందుకుసంతోషం. మీసమిష్టి ప్రయోజనాలకోసం అన్యోన్య సహకారంతో కలిసికట్టుగా, నవీన భారతీయ సాహిత్యాభివృద్ధికి మీరు ఎంతైనా తోడ్పడగలరు. రాజకీయ విభేదాలుమాని, మీ దేశంలోని రచయిత లందరికోసమూ, మీ దేశంకోసమూ, మీరు కలిసి పనిచేస్తారని ఆశిస్తాను.

— మెల్లరీ కర్టీ

కను విప్పు

—శ్రీ బి. రామచంద్రరావు—

గాలులు గుజ గుజమన్నాయ్:
"అదే! ఒకపోరాటంలో
పది తరాలు పరిగెత్తాయ్!
ఒక్కొక్క దినంలో
కిక్కిరిశాయ్ శతాబ్దాలు!

ప్రజానీక చైతన్య
ప్రవాహం పొంగి పొంగి
ధరిత్రినే ముంచెత్తింది!
చరిత్రనే గడుముతోంది!
క్షణంసేపు కూర్చుంటే,
శకం వెనుక పడిపోతావ్!
నిదురలేచి కదలాలోయ్,
లేలెమ్మ"ని చుట్టుముట్టి
గాలులు గుజగుజ మన్నాయ్,
ఇంటా, బయటా, చెవిలో,
హృదయంలో.

2

లేదా మని చైతన్యం;
పడుకోమని మాంద్యం!
ఒక్కసారి ఆవులించి,
పక్కతిరిగి పడుకొన్నా.
మేడమీద గాఢనిద్ర;
గాఢనిద్రలో స్వప్నం—

నాకోసం భవిష్యత్తు
లో కూర్చొని వేచియున్న
భావాలను కావ్యాల్లో
బయటికి లాగేస్తున్నా!
సాహిత్య ప్రపంచాన్ని
చకితం చేసేస్తున్నా!
దీన జనానీకానికి
జ్ఞానభిక్ష పెడుతున్నా!

3

చురుక్కుమనింది వీపు!
ఉలిక్కి పడి లేచాను.
కళ్లునులుముకొని చుట్టూచూస్తే
ప్రపంచ మంటుకొనింది.
లక్ష లేఖినుల విప్లవనృత్యం
ఒకొక్క లేఖినిఒకొక్క కాగడా

4

మేడమీది భావకవుల
శకలీ కృతస్వప్నం,
వాడలోని ప్రజాకవుల
సఫలీ కృతయత్నం!

బాంబే సినీటోన్ వారి ★ **సమ్రాట్ అశోక** ★ (వీణా, సప్రూ నటించినది)

2300 సంవత్సరాలక్రితం, తన 99 మంది సోదరులను హతమార్చి, భారత చక్రవర్తిగా అశోకుడు తన్నుదాను ప్రకటించుకున్నాడు. మౌర్యవంశంలో ఈయన మూడవవాడు. అధికార వ్యామోహంతో ప్రపంచాన్నంతటిని తన అధీనంచేసుకోవాలని, తన ఆస్థానానికి దేశంలోని రాజుల నందరినీ పిలువనంపాడు. కళింగరాజు రానందున అశోకుడు కోపించి, అతని రాయబారిని చంపి, కళింగరాజ్యంపై దాడిచెయ్యమని తన సేనాపతి రోచకుడికి ఆజ్ఞాపిస్తాడు.

రోచకుడు దాడిచేసి కళింగాన్ని శ్మశానభూమిచేస్తాడు. కాని, తనదేశప్రతిష్టను నిలబెట్టుకోడానికై రణరంగంలో నిలబడ్డ కళింగ రాకుమారి శౌర్యం రోచకుడికి దిగ్భ్రమ గొలిపింది. మరి రక్తపాతంచెయ్యనని అతను అస్త్రసన్యాసంచేశాడు. ఇదితెలిసి అశోకుడు తానే యుద్ధాన్ని నడప బూనుకున్నాడు. తన సేనానిభుజాలు ఒకస్త్రీకి దాస్యంచెయ్యడానికి కాదనిచెప్పి, రోచకుడి చెయ్యి నరికివేసి, అశోకుడు శవాలమీద స్వారీచేస్తూ, ఆనందిస్తున్నాడు.

ఇలాంటిసమయంలో సుధేమణ అనే, ఒక బౌద్ధసన్యాసిని విజేత అశోకుడికి ఒక పసిపాప శవాన్ని బహూకరిస్తుంది. ఈ తిరస్కారాన్ని అశోకుడు సహించలేడు. కాని ధర్మంజయిస్తుంది. అశోకుడు అహింసానిరతుడవుతాడు...తరువాతకథ తెరమీద......



Wrapper Printed at Universal Printers, Bezwada